veluturu telugu daily
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి నల్గొండ | ఆదివారం 25.10.2026
సంపుటి : 9 | సంచిక : 132
www. veluturu.com

## 3 రోజులకు సరిపడా వస్తువులను ఉంచుకోండి

**యూకే ఎమర్జెన్సీ అలర్ట్..!**

- ఆహారం, నగదు దాచుకోవాలని ప్రజలకు ఆదేశం
- బ్రిటన్‌లో మూడేళ్లపాటు బీ రెడీ ప్రచారానికి శ్రీకారం
- తుపాన్లు, కార్చిచ్చులు, సైబర్ దాడుల ముప్పుతో ముందస్తు చర్యలు




- వివరాలు 11 లో..

# ఎల్‌నినో రికార్డు

## తొలిసారిగా 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

**పసిఫిక్‌లో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు**

సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు
పేర్కొన్న అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ




2

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రపంచాన్ని భయపెడుతోంది. పసిఫిక్ ప్రాంతంలో అసాధారణ వేడితో కొత్త రికార్డు సృష్టించింది. అక్టోబర్ 22, 2026న భూమధ్య రేఖ పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సుమారు 30 డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లు అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ (ఎన్‌ఓఏఏ) పేర్కొంది. ఈ పరిణామాలు మరింతగా బలపడుతున్న ఎల్‌నినోను సూచిస్తున్నాయి. - న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 24

**మహారాష్ట్రతో చర్చలకు**

# ముహూర్తం ఫిక్స్





**సోమవారం ముంబయికి సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి**

- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ
- కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు.

- హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24

**కేఆర్‌ఎంబీ సమావేశం వాయిదా**

మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్ రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్‌ఎంబీ సమావేశాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది.




**నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు**

సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడి హెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు.

గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించనున్నారు.



**దేశంలో ఎక్కడా లేనివిధంగా**

## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్

- సంక్షేమానికి సంబంధించి నవంబర్‌లో ముఖ్యమంత్రితో చర్చ
- కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి
- టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

- వివరాలు 2 లో..

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల**

## కల సాకారం చేస్తాం



- న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- వివరాలు 2 లో..

**అన్యాయాలను చూడలేక**

## నక్సలైట్‌గా మారా..!!



**తర్వాత న్యాయవాది, ఎమ్మెల్యే, మంత్రి అవుతానని ఊహించలేదు**

- మహిళా రాజకీయ నాయకత్వంలో అడ్డంకులను అధిగమించి నిర్ణయాధికారాన్ని సాధించాలి
- పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు మహిళల నాయకత్వంపై సదస్సులో మంత్రి సీతక్క

2 లో

**మూడు బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే**

# బీఆర్ఎస్ విషప్రచారం

- ఎల్‌నినోనూ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు
- పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే రైతులపై కరువు దెబ్బ తగ్గేది
- గోబెల్స్‌ను మించిపోయిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రచారం
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి




హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, ఎల్‌నినో పరిస్థితులను సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చేస్తున్న ప్రచారం జోసెఫ్ గోబెల్స్‌ను మించిపోయిందని విమర్శించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. మేడిగడ్డలో డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాలను గత ప్రభుత్వ హయాంలోనే జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) గుర్తించిందని తెలిపారు. మూడు బ్యారేజీల వైఫల్యాలపై సాంకేతిక, న్యాయ విచారణలు, విజిలెన్స్ నివేదికలు స్పష్టమైన విషయాలను వెల్లడించాయని పేర్కొన్నారు. పేలవమైన డిజైన్, నిర్మాణమే బ్యారేజీల దుస్థితికి కారణమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తెలంగాణ రైతాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

**పూర్తికాని ప్రాజెక్టులతో రైతులకు నష్టం**

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్‌ఎల్‌బీసీ, సీతారామ తదితర ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితుల్లో రైతుల కష్టాలు తగ్గేవని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రాణహిత-చేవెళ్ల, దేవాదుల తదితర ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే కరువును మరింత సమర్థంగా

- మిగతా 2 లో..

**హైదరాబాద్‌లో భారీగా**

## డ్రగ్స్ పట్టివేత

- భోపాల్ బస్సులో రూ.1.1 కోట్ల విలువైన మెథాంఫెటమిన్ సీజ్
- ప్రాథమిక విచారణలో వెలుగులోకి కీలక విషయాలు..



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :

నగరంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీ డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేశారు. భోపాల్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రైవేట్ ప్రయాణికుల బస్సులో తనిఖీలు చేపట్టి, సుమారు రూ. 1.1 కోట్ల విలువైన 1.136 కిలోల మెథాంఫెటమిన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఖచ్చితమైన నిఘా సమాచారం మేరకు డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. బస్సును క్షుణ్ణంగా తనిఖీ

- మిగతా 2 లో..



## తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

**జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభారి సునీల్ బన్సల్ ధీమా**

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:

భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రభారిగా నియమితులైన గౌరవ సునీల్ బన్సల్ తొలిసారిగా హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో పార్టీ నేతలు ఘన స్వాగతం పలికి, సన్మానించారు.

ఈ స్వాగత కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపూరే తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులతో సమావేశమైన సునీల్ బన్సల్ మాట్లాడుతూ, గతంలో తాను ప్రభారిగా వ్యవహరించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంతో పాటు, పశ్చిమ బెంగాల్ మరియు ఒడిశా రాష్ట్రాలలో పార్టీని విజయవంతంగా అధికారంలోకి తీసుకువచ్చిన వైనాన్ని గుర్తుచేశారు. అదే సక్సెస్ ఫార్ములాను తెలంగాణలోనూ అమలు చేస్తామని, రాబోయే కాలంలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని ఆయన స్పష్టమైన ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు సైనికుల వలె పని చేసి పార్టీ విజయానికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు.

**టీజీహెచ్ఆర్సీ సుమోటోగా**

## “సరకా” ఘటన

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి నివేదికకు ఆదేశం
- నవంబర్ 26లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం

- వివరాలు 12 లో..

**అల్లూరి జిల్లాలో ఘోరం**

## బ్లాస్టింగ్ వల్ల ఏడుగురి మృతి

అనంతగిరి మండలం పినకోట దగ్గర ఘటన

2 లో



**గచ్చిబౌలిలో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్...**

12 లో

# ఎల్‌నినో రికార్డు

## తొలిసారిగా 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

### పసిఫిక్‌లో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు

**సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు**

**పేర్కొన్న అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ**

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 24 :**




పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రపంచాన్ని భయపెడుతోంది. పసిఫిక్ ప్రాంతంలో అసాధారణ వేడితో కొత్త రికార్డు సృష్టించింది. అక్టోబర్ 22, 2026న భూమధ్య రేఖ పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సుమారు 30 డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లు అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ (ఎన్‌ఓఏఏ) పేర్కొంది. ఈ పరిణామాలు మరింతగా బలపడుతున్న ఎల్‌నినోను సూచిస్తున్నాయి.

ఎల్‌నినో అనేది సహజ వాతావరణ ప్రక్రియ. ఇందులో మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కన్నా ఎక్కువగా వేడెక్కుతాయి. దీంతో గాలుల దిశ, మేఘాల కదలికల్లో భారీ తేడాలు చోటుచేసుకుంటాయి. ప్రపంచంలో పొడిగా ఉండే ప్రాంతాల్లో భారీ వర్షాలతో వరదలు సంభవించవచ్చు. వర్షాలు కురవాల్సిన ప్రాంతాల్లో కరువు రావచ్చు. దీంతో ప్రపంచ వాతావరణం అస్తవ్యస్తమవుతుంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) అంచనాల ప్రకారం, 2026 అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్‌లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరే అవకాశం ఉంది. డిసెంబర్ నాటికి ఎల్‌నినో ప్రభావం గరిష్ఠానికి చేరే అవకాశం ఉంది.

ఎల్‌నినో 3.4గా పిలిచే ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల సగటు అసాధారణంగా జూన్ నెలలో సాధారణం కన్నా 1.6 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉండగా, ఆగస్టులో 2.5 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగినట్లు డబ్ల్యూఎంఓ తెలిపింది. అక్టోబర్-డిసెంబర్ కాలంలో ఈ వ్యత్యాసం 3.7 డిగ్రీల సెల్సియస్ కు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ఇది 2015 నవంబర్-2016 జనవరి మధ్య నమోదైన 2.6 డిగ్రీల సెల్సియస్ రికార్డును అధిగమించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

### భారత్‌పై ప్రభావం..

ఎల్‌నినో వల్ల ప్రభావితమయ్యే దేశాల్లో భారత్ కూడా ఉంది. ముఖ్యంగా వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటివి చోటుచేసుకుంటాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గణాంకాల ప్రకారం, 2026 నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే సుమారు 13 శాతం తక్కువగా నమోదైంది.

ఇదే సమయంలో దక్షిణాసియాలో అనేక ప్రాంతాల్లో వచ్చే నెలల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

# అన్యాయాలను చూడలేక నక్సలైట్‌గా మారా..!!



### తర్వాత న్యాయవాది, ఎమ్మెల్యే, మంత్రి అవుతానని ఊహించలేదు

**మహిళా రాజకీయ నాయకత్వంలో అడ్డంకులను అధిగమించి నిర్ణయాధికారాన్ని సాధించాలి**

**పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు మహిళల నాయకత్వంపై సదస్సులో మంత్రి సీతక్క**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:**



మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగి అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. మహిళలు రాజకీయాల్లో ఎదిగే క్రమంలో ఎదురయ్యే వివక్ష, అడ్డంకులకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన "పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం" అనే అంశంపై జరిగిన సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి గురుదీప్ సింగ్ సత్పాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కర్ణాటక మాజీ ఎమ్మెల్యే అంజలి, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమతో పాటు, ఇప్పుడు రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తన జీవితం ఎన్నో కష్టాలు, పోరాటాలతో నిండిందని, చిన్నతనంలో ఆకలి బాధలు సహా అనేక సమస్యలను ఎదుర్కొన్నానని తెలిపారు. ములుగు వంటి అటవీ ప్రాంతంలోని పేద కుటుంబంలో జన్మించిన తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని చెప్పారు. చిన్నతనంలో సమాజంలో జరుగుతున్న అన్యాయాలను చూడలేక నక్సలైట్‌గా మారానని, ఆ తర్వాత న్యాయవాది, ఎమ్మెల్యే, మంత్రి అవుతానని ఎన్నడూ ఊహించలేదని అన్నారు.

"కష్టాన్ని నమ్ముకొని పనిచేశాను.. నేడు మీ ముందు మంత్రిగా నిలబడ్డాను" అని సీతక్క పేర్కొన్నారు. ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పెద్దల సహకారంతో రాష్ట్రంలో కీలకమైన పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేసే అవకాశం లభించిందన్నారు. తన జీవితంలో ఎదురైన కష్టాలను, చేసిన పోరాటాలను ఎప్పటికీ మర్చిపోనని స్పష్టం చేశారు.

మంత్రి పదవిలో ఉన్నప్పటికీ తన మూలాలను మర్చిపోలేదని, ప్రజా జీవితంలో ఉన్నవారు ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండాలని అన్నారు. ఇప్పటికీ ప్రతి వారం రెండు రోజులు ములుగు ప్రజల మధ్య గడుపుతానని, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలతో ఎన్నుకోబడిన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నదే తన సిద్ధాంతమని చెప్పారు.

"ప్రజాప్రతినిధులుగా మనం ప్రజలకు జవాబుదారులం. మనం ప్రజలకు బాసులం కాదు.. సేవకులం. చేపకు నీళ్లే బలం.. నాయకులకు ప్రజలే బలం. నీళ్లు లేకుండా చేప బతకలేనట్లే, ప్రజలతో సంబంధం లేకుండా నాయకుడు రాజకీయంగా నిలబడలేడు" అని సీతక్క అన్నారు.

మహిళలు రాజకీయంగా ఎంతటి ఉన్నత స్థానాలకు చేరుకున్నా వివక్షను ఎదుర్కోవాల్సి వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పురుష మంత్రులకు లభించే గౌరవం మహిళా మంత్రులకు ఎప్పుడూ సమానంగా లభించడం లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ మహిళలు వెనుకడుగు వేయకుండా అంకితభావం, దృఢ సంకల్పంతో పనిచేస్తూ ముందుకు సాగాలని సూచించారు.

పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం మాత్రమే సరిపోదని, వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అధికారం, తగిన గౌరవం పొందాలని సీతక్క అన్నారు. ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులు ఇతరులపై ఆధారపడకుండా తమ బాధ్యతలను స్వయంగా నిర్వహించేందుకు అవసరమైన అవకాశాలు, శిక్షణ, సంస్థాగత సహకారం అందించాలని పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన, రాజకీయ సాధికారత పరస్పరం ముడిపడి ఉన్నాయని మంత్రి వివరించారు. స్వయం సహాయక సంఘాలు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలు వ్యాపారాలు ప్రారంభిస్తూ, ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. ఆర్థికంగా బలోపేతమైన మహిళలు రాజకీయాల్లోనూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని అన్నారు.

మహిళలపై సామాజిక వివక్షతో పాటు రాజకీయ, డిజిటల్ వేదికలపై వేధింపులు కూడా అడ్డంకులుగా మారుతున్నాయని సదస్సులో చర్చించారు. మహిళా నాయకులు నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే వాతావరణం కల్పించడంతో పాటు, రాజకీయ శిక్షణ, మార్గదర్శకత్వం, చట్టపరమైన సహకారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రతి అమ్మాయి సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా లేదా ప్రధానమంత్రిగా ఎదగాలని కలలు కనే పరిస్థితులు రావాలని సీతక్క ఆకాంక్షించారు. మహిళలకు సమాన అవకాశాలు, నిర్ణయాధికారం, గౌరవం లభించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని అన్నారు. మహిళలు అడ్డంకులను అధిగమించి ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా నాయకత్వ బాధ్యతలు చేపట్టే సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం

- న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:**

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత కూడా గతంలో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రిగారు వెల్లడించారు.

జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

# బీఆర్ఎస్ విషప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొనేవాళ్లమని పేర్కొన్నారు. పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల ద్వారా ఎన్ని ఎకరాలకు నీరిచ్చారని, ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మార్చి తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు.

పదేళ్లలో తెచ్చిన అప్పులను సద్వినియోగం చేసి ఉంటే ఎల్‌నినో ప్రభావం రైతులపై ఇంతగా పడేది కాదన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్లే ప్రజలు, రైతులు ఎల్‌నినో ప్రతికూల ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వినియోగించకుండానే తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు సాధించిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో రెండున్నరేళ్ల పాలనలో కృష్ణా, గోదావరి బేసిన్లలో సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి పెరిగాయని చెప్పారు. మూడు బ్యారేజీ లు నిరుపయోగంగా ఉన్నప్పటికీ గోదావరి బేసిన్‌లో రికార్డు స్థాయిలో సాగునీరు అందించామని వెల్లడించారు.

బ్యారేజీల గేట్లను ఎత్తి ఉంచాలని డ్యామ్ భద్రతా సంస్థ లిఖితపూర్వకంగా సూచించిందని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు దేశీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నామని, నిపుణుల ఆధ్వర్యంలో డిజైన్ల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. పునరుద్ధరణ విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని, చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ విషపూరిత ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు, రైతులు నమ్మడం లేదని, గత ప్రభుత్వ వైఫల్యాల వెనుక ఉన్న వాస్తవాలను రైతాంగం గమనించాలని కోరారు. సమావేశంలో మంత్రి జి. వివేక్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ రెడ్డి, బాలు నాయక్, మందుల సామ్యేల్, సంజీవ్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ సలహాదారు పరిక్షిత్ మెహ్రా, ఈఎన్సీ రమేష్‌బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో ఎక్కడా లేనివిధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్

- సంక్షేమానికి సంబంధించి నవంబర్‌లో ముఖ్యమంత్రితో చర్చ
- కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి
- టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:**

న్యాయవాదుల సంక్షేమం, భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చామని పేర్కొన్నారు. గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో శనివారం టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం చైర్మన్ అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, శ్రీధర్ బాబు, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రాంమోహన్ రెడ్డితో పాటు లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం, స్టైఫండ్ పెంపు, సంక్షేమ అంశాలపై నవంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ వంటి సంస్థలను తనకు అనుకూలంగా వినియోగించుకుంటోందని విమర్శించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో, 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. పార్టీ కార్యకర్తలకు న్యాయపరమైన సహకారం అందించాలని, న్యాయవాదులకు తగిన గుర్తింపు, పదవులు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

మంత్రి వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ న్యాయవాదులకు తగిన ప్రాధాన్యం కల్పించడం, ఖాళీ పోస్టుల భర్తీపై మంత్రివర్గంలో చర్చిస్తామని చెప్పారు. జిల్లా స్థాయిలో న్యాయవాదుల కేంద్రాల ఏర్పాటుపైనా ఆలోచన చేయాలన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులకు ఇందిరమ్మ ప్రమాద బీమా అమలు చేస్తామని, ఆరోగ్య బీమా పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. న్యాయవాదుల కార్పస్ ఫండ్ పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. జీపీ, ఏజీపీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్టాండింగ్ కౌన్సిల్ పోస్టుల భర్తీపై కసరత్తు జరుగుతోందని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే పార్టీ కార్యక్రమానికి తెలంగాణ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు.

## అల్లూరి జిల్లాలో ఘోరం

# బ్లాస్టింగ్ వల్ల ఏడుగురి మృతి

**అనంతగిరి మండలం పినకోట దగ్గర ఘటన**



**అనంతగిరి, వెలుతురు అక్టోబర్ 24 :**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పేలుడు కలకలం రేపింది. అనంతగిరి మండలం పినకోట దగ్గర రోడ్డు పనులు చేపట్టగా.. అక్కడ ఒక్కసారిగా పేలుడు సంబంధించి. ఈ ఘటనలో ఏడుగురి చనిపోగా.. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి.. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ పేలుడు దెబ్బకు మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమయ్యాయి. ఈ ఘటనలో టిప్పర్‌తో పాటుగా మరో వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయకచర్యలు ముమ్మరం చేశారు. రోడ్డు నిర్మాణం కోసం కొండను తొలిచేందుకు జిలిటెన్ స్టిక్స్ పెట్టగా పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది.

ప్రాథమికంగా అందుతున్న సమాచారం ప్రకారం.. అనంతగిరి మండలం పినకోట దగ్గర ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీని కోసం కొండను బ్లాస్ట్ చేసి కొండను తొలించేందదుకు జిలెటిన్ స్టిక్స్‌ను నిర్వాహకులు పెట్టారు. వీటిని గమనించకపోవడంతో అటు వైపు వెళ్లిన టిప్పర్ ప్రమాదానికి గురైంది. ఈ పేలుడు దెబ్బకు టిప్పర్ ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో చనిపోయిన ఏడుగురిలో ఓ టీచర్, డ్రైవర్, ముగ్గురు కార్మికులు ఉన్నారు. మృతులను విశాఖపట్నానికి చెందిన టీచర్ సునీత, దేవరాపల్లికి చెందిన మణి , చీడకాడకు చెందిన నారాయణ రావు, కడపకు చెందిన పవన్ కుమార్‌గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ పేలుడు ఘటనపై హోంమంత్రి అనిత అల్లూరి జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ ప్రమాదంలో గాయపడి వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

**(మొదటిపేజీ తరువాయి)** చేయగా, స్లీపర్ బెర్తుల పరుపుల కింద అత్యంత చాకచక్యంగా దాచిన నాలుగు అనుమానాస్పద ప్యాకెట్లను గుర్తించారు. ఫీల్డ్-టెస్టింగ్ కిట్ ద్వారా పరీక్షించగా, ఆ ప్యాకెట్లలో ఉన్నది నిషేధిత 'మెథాంఫెటమిన్' అని నిర్ధారణ అయింది. అధికారుల ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సదరు స్లీపర్ బెర్తులలో ప్రయాణించిన వ్యక్తులు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బస్సు ఎక్కి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో దిగిపోయినట్లు తేలింది. డ్రగ్స్‌ను బస్సులోనే వదిలి వెళ్లడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. పట్టుబడిన 1.136 కిలోల మెథాంఫెటమిన్‌ను ఎన్‌డిపిఎస్ చట్టం, 1985 కింద అధికారులు సీజ్ చేశారు. ఈ డ్రగ్ సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, హైదరాబాద్‌లో ఎవరికి డెలివరీ చేయాలనుకున్నారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# కాళేశ్వరంలో అంతరాష్ట్ర సరిహద్దు తనఖీ కేంద్రం ఏర్పాటు..

**జయశంకర్ భూపాలపల్లి. వెలుతురు అక్టోబర్ 24** :జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం పౌర సరఫరాల శాఖ, పోలీస్, పంచాయతీ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించేలా చూడటంతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని అక్రమంగా తెలంగాణలోకి తరలించకుండా నిరోధించేందుకు ఈ తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసు, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో 24 గంటల పాటు నిరంతర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సరిహద్దు దాటి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల సంక్షేమం, పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు.

## రూ.150 కోట్లతో మూడు మండలాల్లో

# శాశ్వత కరువు నివారణ చర్యలు

- ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయాల మేరకు ప్రణాళికలు రూపొందించాలి
- స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రాజెక్టు అమలు
- ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి
- మహిళలు, యువత, కులవృత్తులు.. ప్రతి వర్గం అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** కరువు పరిస్థితులు ఎప్పుడు తలెత్తినా ప్రజలు, రైతులు తట్టుకునేలా రాష్ట్రంలోని మూడు మండలాల్లో 150 కోట్ల రూపాయిలతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు నీటి వనరులను సమర్థవం తంగా వినియోగించుకోవడం, రైతు కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చారిత్రకంగా కరువు ప్రభావానికి గురవుతున్న ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయం అధికంగా ఉన్న జిల్లాలు, సామాజిక--ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు, రైతు కుటుంబాల జీవనోపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి ( ఎన్‌డిఎఫ్) సహకారంతో ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులతో మంత్రి గారు సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో కరువు-నిరోధక వ్యవసాయ విధానం అమలు, కరువు పీడిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార మార్గాల అన్వేషణ, ప్రతిపాదిత ప్రాజెక్టు కార్యాచరణ, నిధుల సమర్థ వినియోగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్, నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈమొత్తం ప్రాజెక్ట్‌కు ప్రకృతి విపత్తుల శాఖ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ నోడల్ ఏజన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని గ్రామ మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తోపాటు, వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు చేపడతారని తెలిపారు. కరువు నివారణ ప్రాజెక్టు అమలులో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసుకోవాలని, ఎంపిక చేసిన మండలాల్లోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి లక్ష్యాన్ని చేరేలా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో నెరవేరుతాయని తెలిపారు. మహిళలు, యువత, రైతులు, కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలు సహా సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కరువు ప్రభావం ఒక్క వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఉపాధి, కుటుంబ ఆదాయాలు, సంప్రదాయ వృత్తులపై కూడా పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి వర్గానికి ప్రయోజనం చేకూరేలా, స్థానిక పరిస్థితులకు తగిన శాశ్వత పరిష్కారాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని మంత్రి స్పష్టం చేశారు. నిధుల వినియోగం, పనుల ఎంపిక, అమలు విధానం, క్షేత్రస్థాయి ఫలితాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. కేవలం నిధుల ఖర్చు, పనుల పూర్తితోనే ప్రాజెక్టు విజయాన్ని అంచనా వేయకుండా, ప్రజలకు ఎంత మేరకు ప్రయోజనం చేకూరింది, కరువు సమస్యను పరిష్కరించడంలో ఎంత పురోగతి సాధించామన్నది ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎన్. గోపి తదితర అధికారులు పాల్గొన్నారు

## ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నా శ్రీవారి దర్శనంలో

# భక్తులకు ఊరట కల్పించాలి

- నేషనల్ బీసీదళ్, తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు డి.వి.వి.సత్యనారాయణ విజ్ఞప్తి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న సమయాల్లో కూడా భక్తుల విశ్వాసాలకు ప్రాధాన్యత ఇస్తూ శ్రీవారి దర్శనానికి ఇబ్బంది కలగకుండా మన తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్రాల, కేంద్రం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అధికారులు చర్యలు తీసుకోవాలని డి.వి.వి.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు..రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం కల్పించాలి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా పరిశీలించాలి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా, సులభంగా స్వామి వారి దర్శనం కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డి.వి.వి.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తిరుమలకు చేరుకునే భక్తులకు, ప్రస్తుతం ఉన్న దర్శన విధానంలో మరింత సౌకర్యవంతమైన ఏర్పాట్లు కల్పించాలని ఆయన కోరారు. ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి భక్తులు, కుటుంబాలతో వచ్చే భక్తులు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దర్శన ఏర్పాట్లను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులకు అందుబాటులో ఉండేలా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల ద్వారా దర్శనం పొందే అవకాశాన్ని సమర్థవంతంగా కల్పించాలని సూచించారు. దర్శన టికెట్ల కేటాయింపు, క్యూల నిర్వహణ, వేచి ఉండే సమయం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా పారదర్శకమైన దర్శన విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించేలా ఉండాలని, సామాన్య భక్తులపై ఆర్థిక భారం తగ్గిస్తూ, వారికి సౌకర్యవంతమైన దర్శన అనుభవం కల్పించడం దేవస్థానం ప్రధాన లక్ష్యంగా ఉండాలని డి.వి.వి.సత్యనారాయణ అన్నారు. ప్రజల విశ్వాసానికి, భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం మరియు టీటీడీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## శాసనసభ స్పీకర్‌కు

# టీఎన్జీవోస్ నేత అభినందనలు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :** తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావును టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల అధికారిక వి దేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన స్పీకర్‌కు అభినందనలు తెలిపి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య ఆత్మీయ సంభాషణ జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన సభ ప్రాధాన్యత, ప్రజాప్రతినిధుల బాధ్యతలను గౌరవిస్తూ ఈ భేటీ సుహృద్భావ వాతావరణంలో సాగింది.

# నీటి గండం పొంచి ఉంది.. మేల్కోనాలి!




- రాబోయే ఎనిమిది నెలలు అత్యంత కీలకం
- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు
- రైతులకు భరోసా
- సర్వసభ్య సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి

**ఆత్మకూరు, వెలుతురు అక్టోబర్ 24 :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎనిమిది నెలలు అత్యంత కీలకమని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో చెరువులు ఎండిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని, నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని కోరారు. ప్రైవేటు వ్యక్తుల బోర్లలో తాగునీరు అందుబాటులో ఉన్నా, ప్రభుత్వం తరపున నీటిని కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు ప్రణాళిక, నీటి వినియోగంపై తగిన అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే పరిస్థితులపై ప్రజలకు స్పష్టంగా వివరించి, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం మనుషులపైనే కాకుండా పశు పక్షాదులపైనా పడే అవకాశం ఉన్నందున వాటి సంరక్షణకు కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకుని, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తే రాబోయే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మంత్రితోపా టు వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్ డి ఓ సుబ్రహ్మణ్యం, ఎంఆర్ఓ, ఎండిఓ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నీటి దందాపై

# హైడ్రా కొరడా



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** సున్నం చెరువు సమీపంలో ఇళ్లలో అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడి విక్రయిస్తున్న దందాపై హైడ్రా చర్యలు చేపట్టింది. రెవెన్యూ, సీహెచ్‌ఎంసీ అధికారుల సమక్షంలో, పోలీసుల బందోబస్తు మధ్య భారీ ఆపరేషన్ నిర్వహించి ఇళ్ల నుంచి బయటకు వచ్చిన బోర్ల పైపులను తొలగించింది. అక్రమ బోర్ల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 50 నుంచి 60 అడుగుల లోతులోనే బోర్లకు నీరు పడేదని, ప్రస్తుతం 600 అడుగులకు పైగా బోర్లు వేసినా నీరు లభించడం లేదని తెలిపారు. తాము నీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తుండగా, కొందరు నీటిని విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారని వాపోయారు. ఈ అక్రమ నీటి దందాకు హైడ్రా చర్యలతో అడ్డుకట్ట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐపీ చానళ్ళకు అక్రిడిటేషన్లు లేవు

- తేల్చిచెప్పిన మంత్రి పొంగులేటి
- జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు త్వరలో ఇస్తాం



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :** రాష్ట్రం కేబుల్ టీవీల స్థానంలో నడుస్తున్న ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్(ఐపీ) ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం కుదరదని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తేల్చిచెప్పారు. ఇప్పటికే 26 వేల అక్రెడిటేషన్ కార్డులిచ్చామని,గతంలో కంటే నాలుగు వేల కార్డులు ఎక్కువే ఇచ్చామని, గతంలో లేని ఐపీ చానళ్ళకు కొత్తగా అక్రెడిటేషన్ కార్డులివ్వలేమని ఆయన స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలో కేబుల్ చానల్స్ ప్రతినిధులు,పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటి ని కలిసి కేబుల్ ఐపీ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ కూడా పారదర్శకంగా కొనసాగుతుందని, గత ప్రభుత్వం కేవలం 21వేల అక్రెడిటేషన్లు ఇస్తే... తమ ప్రజాప్రభుత్వం ఇప్పటికే 26వేల అక్రెడిటేషన్లు ఇచ్చిందని చెప్పారు. అక్రెడిటేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు ఇస్తామని మంత్రి అన్నారు. అంతకు ముందు ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ, రాష్ట్రంలో కొన్నేళ్ళుగా కేబుల్ నెట్వర్క్ ద్వారా నడిచిన అనేక న్యూస్ చానళ్ళ ప్రస్తుతం మారిన టెక్నాలజీకి అనుగుణంగా ఐపి ద్వారా నడుస్తున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఐపీ టీవీ న్యూస్ ఛానళ్ళకు కూడా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, రవికుమార్, కేబుల్ చానెల్ అసోసియేషన్ ప్రతినిధులు సుభాష్, భరత్, శ్రీరాములు, షఫియుద్దీన్, ప్రతాప్, రాచర్ల గోపి, సుధాకర్, విజ్ఞేష్ గౌడ్ తదిరులున్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో 8 నెలల ఉపాధి ప్రణాళిక

- పనుల్లో పురోగతి కావాలి.. సమాధానాలు కాదు
- 370 రకాల పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించి లక్ష్యాల మేరకు పూర్తి చేయాలి
- ఉపాధి పనుల పురోగతిపై మంత్రి సీతక్క



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి ఎద్దడి, వ్యవసాయ సవాళ్లను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద అనుమతించిన 370 రకాల పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించి, ఎనిమిది నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఉపాధి పనుల పురోగతిపై శనివారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. అక్టోబర్ 30 నాటికి మండలస్థాయి సమన్వయ కమిటీల ద్వారా పనుల ప్రణాళికలు పూర్తి చేసి, నవంబర్ 1 నుంచి పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గుర్తించిన 318 రకాల పనుల్లో గ్రామాల అవసరాలకు అనుగుణంగా కనీసం 50 ముఖ్యమైన పనులకు ప్రాధాన్యతనిచ్చి లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో వేగం పెంచని డీఆర్డీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు జాబ్ కార్డుల జారీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటి వృథా నివారణకు కాలువల మరమ్మతులు, చెరువులు, కుంటల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు పనులు చేపట్టాలన్నారు. కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలల ప్రహరీ గోడలు, పశుగ్రాసం, పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వీలైన సౌర విద్యుత్ పనులను గుర్తించి నిధులను వినియోగించుకోవాలన్నారు. రెండో పంటగా అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని, రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఉపాధి కల్పించేలా పని దినాల క్యాలెండర్ రూపొందించాలన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో 7 శాతం వర్క్ షేర్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని, అర్హులైన ఆదివాసీ, గిరిజనులకు జాబ్ కార్డుల జారీలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ప్రణాళికలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# ఉప్పల్‌లో కొత్త సిటీ బస్ టర్మినల్

- రూ.3.22 కోట్లతో నిర్మాణం.. 100 రోజుల్లో పూర్తి
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.12,888 కోట్ల ఆదా
- ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రూ.1,400 కోట్ల బకాయిల చెల్లింపునకు చర్యలు
- పీఎం ఈ-డ్రైవ్ కింద రాష్ట్రానికి మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు : పొన్నం ప్రభాకర్





**ఉప్పల్, వెలుతురు అక్టోబర్ 24 :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ జోనల్ వర్క్‌షాప్ వద్ద రూ. 3.22 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన సిటీ బస్ టర్మినల్ నిర్మాణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ , మున్సిపల్ శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, పీర్జాదిగూడ, బోడుప్పల్, ఉప్పల్ పరిసర ప్రాంత ప్రజల ప్రయాణ ఇబ్బందులను తొలగించేందుకే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో ఈ బస్ టర్మినల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. స్థానిక ప్రాంత పేరు ప్రతిబింబించేలా ఈ కొత్త బస్ స్టేషన్‌కు నామకరణం చేస్తామని, 100 రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సుమారు 1,053 బస్సు ట్రిప్పుల ద్వారా లక్ష మంది ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం ద్వారా ఇప్పటివరకు 367 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి రూ. 12,888 కోట్లు ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. ఇప్పటికే 3,000 పైగా నూతన బస్సులను కొనుగోలు చేశామని, పీఎం ఈ-డ్రైవ్ కింద మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని వెల్లడించారు. ఢిల్లీ తరహా కాలుష్యం హైదరాబాద్‌లో రాకుండా ఉండేందుకు ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, తొలి దశలో 250 పాత డీజిల్ బస్సులను రిట్రోఫిట్ చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ. 1,400 కోట్ల బకాయిలపై ముఖ్యమంత్రితో చర్చించామని, త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడుతుందని పేర్కొన్నారు. అలాగే దశాబ్ద కాలం తర్వాత ఆర్టీసీ ఎన్నికలు నిర్వహించామని, గుర్తింపు సంఘంతో కమిటీ వేసి విలీన ప్రక్రియ ముందుకు తీసుకెళ్తామని వివరించారు. టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ నూతన టర్మినల్ పూర్తిగా నగర (సిటీ) బస్సు సేవలకు మాత్రమే కేటాయించబడుతుందని తెలిపారు. యాదగిరిగుట్ట, వరంగల్, ఉమ్మడి నల్గొండ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే జిల్లా సర్వీసులు యథావిధిగా ఉప్పల్ పాత బస్ స్టాండ్ టర్మినల్ నుంచే నడుస్తాయని స్పష్టం చేశారు. ఈ టర్మినల్ ప్రాంగణంలోనే ప్రత్యేక బస్ పాస్ కౌంటర్, నిరంతర సమాచారం అందించే విచారణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ ప్రధాన రహదారిపైనే బస్సులను నిలపడం వల్ల ఏర్పడే తీవ్ర ట్రాఫిక్ జామ్‌లకు ఈ టర్మినల్‌తో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎండీ నాగిరెడ్డి తెలిపారు. బస్సులన్నింటినీ టర్మినల్ లోపలికి మళ్లించడం వల్ల ఉప్పల్ రింగ్ రోడ్డు, చౌరస్తాలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందన్నారు. బోడుప్పల్, పీర్జాదిగూడ ప్రజలకు సికింద్రాబాద్, మెహదీపట్నం, ఐటీ కారిడార్, పటాన్‌చెరు వంటి ప్రాంతాలకు ప్రయాణం ఇకపై సులభతరం కానుందని వివరించారు. దశాబ్దాలుగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యలకు ముగింపు పలుకుతూ అధునాతన సిటీ బస్ టర్మినల్ అందుబాటులోకి రావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నూతనంగా తయారైన రెట్రోఫిట్ బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డి పరిశీలించి అధికారులతో కలిసి అందులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ ఆర్టీసీ ఈడీ లు సిహెచ్ .వెంకన్న, రాజశేఖర్, ఏ.శ్రీధర్, ఖుస్రో షా ఖాన్, ఎఫ్ఏ విజయపుష్ప, జెడి నర్మద పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాలపై నిర్లక్ష్యం..

# పాలమూరుకు సాగునీటి సంక్షోభం!

**హామీలు కాదు..**
**నీటి హక్కులకు భరోసా ఏది?**

**తెలంగాణలో వ్యవసాయం కోట్లాది ప్రజల జీవనాధారంతో ముడిపడి ఉంది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చరిత్రను పరిశీలిస్తే కరువు, వలసలు, వర్షాధార వ్యవసాయం, భూగర్భ జలాల కొరత ప్రజల జీవితాలను ఎంతగా ప్రభావితం చేశాయో అర్థమవుతుంది. తెలంగాణ ఉద్యమ కాలంలో పాలమూరు వెనుకబాటుతనం, సాగునీటి సమస్య రాష్ట్ర సాధన ఆవశ్యకతను వివరించిన ప్రధాన అంశాలుగా నిలిచాయి. స్వరాష్ట్రం ఏర్పడితే సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, బీడు భూములు పచ్చని పంటపొలాలుగా మారతాయని, ఉపాధి కోసం వలస వెళ్లే పరిస్థితులు తగ్గుతాయని ప్రజలు ఆశించారు. కానీ రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లు గడిచినా పాలమూరు ప్రజలకు సాగునీటి భద్రత పూర్తిస్థాయిలో అందలేదు. ప్రాజెక్టుల పేర్లు మారుతున్నాయి, అంచనా వ్యయాలు పెరుగుతున్నాయి, ప్రభుత్వాలు మారుతున్నాయి. అయినా కాలువల ద్వారా పొలాలకు నీరు చేరే విషయంలో ఆశించిన పురోగతి కనిపించడం లేదనే విమర్శలు కొనసాగుతున్నాయి.**

ఇప్పుడు పాలమూరు సమస్యను మరోసారి రాజకీయ ప్రకటనలతో సరిపెట్టకుండా, కృష్ణా జలాల హక్కులు, ప్రాజెక్టుల నిర్మాణం, నిధుల వినియోగం, నీటి నిర్వహణలోని లోపాలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అంటే భారీ రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు, ఎత్తిపోతల వ్యవస్థలు నిర్మించడమే కాదు. వాటి ద్వారా నీటిని సమయానికి ఎత్తిపోసి, ప్రధాన కాలువలు, పంపిణీ వ్యవస్థల ద్వారా రైతుల పొలాలకు చేర్చినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. రిజర్వాయర్లు నిర్మించి కాలువలు అసంపూర్తిగా వదిలేస్తే, పంపులు ఏర్పాటు చేసి వాటిని నడిపేందుకు అవసరమైన విద్యుత్, నిర్వహణ వ్యవస్థలను సిద్ధం చేయకపోతే, బడ్జెట్‌లో నిధులు కేటాయించి వాటిని సకాలంలో ఖర్చు చేయకపోతే ప్రజాధనం ఆశించిన ఫలితాలను ఇవ్వదు. ప్రాజెక్టు పూర్తయిందని ప్రకటించడానికి, దాని కింద రైతుకు వాస్తవంగా సాగునీరు అందడానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల విషయంలో ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించాలి. 2025--26 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో సాగునీటి రంగానికి సుమారు రూ.23,330.65 కోట్లు కేటాయించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు పేర్కొంటున్నాయి. అయితే మొత్తం బడ్జెట్ కేటాయింపును చూసి మాత్రమే ప్రాజెక్టుల పురోగతిని అంచనా వేయలేం. అందులో ఎంత మొత్తం కొత్త పనులకు, ఎంత పాత బిల్లుల చెల్లింపులకు, ఎంత రుణాల చెల్లింపులకు, ఎంత నిర్వహణకు కేటాయించారు? విడుదల చేసిన నిధుల్లో ఎంత ఖర్చు చేశారు? ఖర్చు చేసిన మొత్తానికి అనుగుణంగా ఎన్ని పనులు పూర్తయ్యాయి? ఎన్ని ఎకరాలకు కొత్తగా నీటి వసతి కల్పించారు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం ప్రాజెక్టుల వారీగా సమాధానాలు చెప్పాలి. గతంలో కేటాయింపులు చేసినా ఖర్చు తక్కువగా జరిగిందనే విమర్శలు ఉన్నాయి. కేటాయింపులు, నిధుల విడుదల, వాస్తవ వ్యయం, భౌతిక పురోగతి మధ్య సంబంధాన్ని స్పష్టంగా వెల్లడించకుండా బడ్జెట్ కేటాయింపులను అభివృద్ధికి నిదర్శనంగా చూపడం సమంజసం కాదు. రాష్ట్రంలో భారీ, మధ్యతరహా, చిన్నతరహా సాగునీటి వనరులన్నింటినీ సమన్వయంతో అభివృద్ధి చేయాలి. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, వివిధ ప్రాజెక్టులు, చెరువులు, చిన్నతరహా ఎత్తిపోతల పథకాల కింద కలిపి సుమారు 73.57 లక్షల ఎకరాలకు నీటి వసతి కల్పించాల్సిన లక్ష్యం ఉంది. అందులో ఇంకా సుమారు 54 లక్షల ఎకరాలకు నీటి వసతి కల్పించాల్సి ఉందని పేర్కొంటున్నారు. ఈ గణాంకాలను తాజా అధికారిక రికార్డులతో ప్రభుత్వం ధ్రువీకరించి, ప్రస్తుతం వాస్తవంగా సాగునీరు పొందుతున్న ఆయకట్టు ఎంత, నిర్మాణంలో ఉన్న ఆయకట్టు ఎంత, ప్రతిపాదనల దశలో ఉన్నది ఎంత అనే వివరాలను వేరువేరుగా ప్రకటించాలి. ఆయకట్టు లక్ష్యాలను ప్రకటించడం సులభమే, వాటిని సాకారం చేయడానికి అవసరమైన నిధులు, నిర్మాణాలు, అనుమతులు, నీటి లభ్యతలను సమన్వయం చేయడమే అసలు సవాలు. కేవలం సుమారు రూ.2,000 కోట్ల వ్యయంతో ఏడాదిలో పూర్తిచేయగలిగే 16 ప్రాజెక్టులను గుర్తించి, వాటి ద్వారా దాదాపు ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని సాగునీటి రంగంలో చర్చ జరుగుతోంది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం సాంకేతికంగా పరిశీలించి, అటువంటి ప్రాజెక్టుల జాబితాను బహిరంగపరచాలి. నిజంగా తక్కువ వ్యయంతో, తక్కువ సమయంలో పూర్తిచేయగలిగే ప్రాజెక్టులు ఉంటే వాటిని ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయడం రైతులకు తక్షణ ప్రయోజనం కలిగిస్తుంది. ఒకవైపు వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టులను చేపడుతూ, మరోవైపు కొద్దిపాటి నిధులతో పూర్తయ్యే పనులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం అభివృద్ధి ప్రణాళికలో లోపాలను సూచిస్తుంది. ప్రతి ప్రాజెక్టుకు పూర్తి చేయాల్సిన తేదీ, అవసరమైన నిధులు, అందించే ఆయకట్టు, బాధ్యత వహించే అధికారుల వివరాలతో కూడిన కార్యాచరణ ప్రకటించాలి.



ఈ సమస్యకు అత్యంత కీలకమైన ఉదాహరణ పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం. మొదట జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసే ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ పథకాన్ని, తర్వాత శ్రీశైలం జలాశయం వెనుకజలాల నుంచి నీటిని తరలించే విధంగా పునఃరూపకల్పన చేశారు. ప్రారంభ అంచనాల నుంచి ప్రస్తుత వ్యయ అంచనాల వరకు భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, 2025 ఫిబ్రవరి నాటికి ఈ పథకంపై సుమారు రూ.32,662 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు సుమారు రూ.43,000 కోట్ల వరకు అవసరమవుతాయని అంచనాలు పేర్కొంటున్నాయి. ఈ మొత్తాలు తాజా ప్రభుత్వ లెక్కలతో నిర్ధారించాల్సి ఉన్నప్పటికీ, ప్రాజెక్టు వ్యయం ఎంత భారీ స్థాయికి చేరిందో అవి సూచిస్తున్నాయి. ఇంతటి ప్రజాధనం ఖర్చు చేసిన తర్వాత కూడా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడం ఆందోళన కలిగించే అంశం.

పాలమూరు--రంగారెడ్డి పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు నాగర్‌కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లోని ప్రాంతాలకు నీటి వసతి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టు ప్రతిపాదనల్లో సుమారు 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, హైదరాబాద్‌కు 30 టీఎంసీల తాగునీటి సరఫరా వంటి లక్ష్యాలు ప్రస్తావించబడ్డాయి. ఈ లక్ష్యాలు నెరవేరాలంటే రిజర్వాయర్ల నిర్మాణంతోపాటు ప్రధాన కాలువలు, పంపిణీ వ్యవస్థలు, భూసేకరణ, పునరావాసం, అవసరమైన అనుమతులు కూడా పూర్తికావాలి. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ వంటి రిజర్వాయర్ల నిర్మాణ పురోగతిని విడివిడిగా సమీక్షించాలి. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిందని చెప్పడం ఒకటైతే, దాని ద్వారా నీటిని ఎత్తిపోసి ఆయకట్టుకు అందించడం మరొకటి. ఈ రెండు దశల మధ్య అంతరాన్ని తొలగించడమే ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. కృష్ణా జలాల కేటాయింపులు, వినియోగం విషయంలో నెలకొన్న అనిశ్చితి పాలమూరు భవిష్యత్తును మరింత ప్రభావితం చేస్తోంది. అంతర్రాష్ట్ర నదీ జలాల వ్యవహారంలో ప్రతి రాష్ట్రం తనకు చట్టబద్ధంగా లభించిన వాటాను వినియోగించుకునే హక్కు కలిగి ఉంటుంది. అదే సమయంలో ఆ నీటి వినియోగం నదీ జలాల కేటాయింపులు, సంబంధిత ఒప్పందాలు, ట్రిబ్యునళ్ల తీర్పులు, అమల్లో ఉన్న నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. ఏ రాష్ట్రం ఎంత నీటిని వినియోగించింది, ఏ ప్రాజెక్టు ద్వారా ఎంత నీటిని విడుదల చేసింది, ఎంత నీరు ఆవిరి లేదా ఇతర కారణాలతో నష్టపోయింది అనే వివరాలు పారదర్శకంగా ఉండాలి. ఆంధ్రప్రదేశ్ నీటిని అధికంగా మళ్లిస్తోందని తెలంగాణలో కొన్ని వర్గాలు చేస్తున్న ఆరోపణలను నిర్ధారించడానికి అధికారిక గణాంకాలు అవసరం. ఆరోపణలను రాజకీయ వాదనలుగా కొట్టిపారేయడం ఎంతవరకు సరికాదో, నిర్ధారణ కాని సంఖ్యలను వాస్తవాలుగా ప్రచారం చేయడం కూడా అంతే సరికాదు. శ్రీశైలం జలాశయం ఈ వివాదంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. కృష్ణా నదిపై నిర్మించిన ఈ జలాశయం పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం సుమారు 215.807 టీఎంసీలు. అయితే జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం, నీటిని వాస్తవంగా వినియోగించుకోగల స్థాయి, విద్యుదుత్పత్తి లేదా సాగునీటి అవసరాల కోసం నిర్దేశించిన కనిష్ఠ నీటిమట్టాలు వేర్వేరు అంశాలు. అందువల్ల జలాశయంలో ఒక సమయంలో ఎంత నీరు ఉందనే వివరంతోనే రాష్ట్రాల మధ్య నీటి వినియోగంపై తుది నిర్ణయానికి రాలేం. జూన్ ప్రారంభంలో నిల్వలు సుమారు 40 టీఎంసీలుగా ఉన్నాయని, వరదల అనంతరం ఆగస్టు రెండో వారానికి 185 టీఎంసీలకు చేరాయని పేర్కొంటున్న గణాంకాలను తేదీల వారీగా అధికారిక రికార్డులతో సరిపోల్చాలి. అలాగే ఆంధ్రప్రదేశ్ 56 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించిందనే ఆరోపణ, శ్రీశైలం నుంచి ఏపీకి 34 టీఎంసీలే కేటాయించారనే వాదనలను ఏ కాలానికి, ఏ ప్రాజెక్టులకు, ఏ నిబంధనలకు సంబంధించినవో స్పష్టం చేయాలి. నీటి కేటాయింపులు, వాస్తవ వినియోగం మధ్య తేడా ఉంటే స్వతంత్ర సాంకేతిక పరిశీలన జరిపించాలి.

జూరాల ప్రాజెక్టు నుంచి అందుబాటులోకి వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవడం కూడా పాలమూరుకు అత్యంత అవసరం. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద జలాలను సకాలంలో నిల్వ చేసుకోవడం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి అవసరమైన నీటిని సమయానికి తరలించడం, పంపింగ్ వ్యవస్థలను పూర్తి సామర్థ్యంతో నడపడం, చెరువులను నింపడం వంటి చర్యలు సమగ్ర ప్రణాళికతో జరగాలి. కల్వకుర్తి పథకం ద్వారా ఒక సీజన్‌లో సుమారు 12 టీఎంసీల నీటినే వినియోగించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ సంఖ్య ఏ సంవత్సరానికి సంబంధించినదో, ఆ సీజన్‌లో నీటి లభ్యత ఎంత ఉందో, పథకం పూర్తి సామర్థ్యంతో పోలిస్తే వినియోగం ఎంతన్నది ప్రభుత్వం వివరించాలి. పంపుల మరమ్మతులు, విద్యుత్ సరఫరా, కాలువల నిర్వహణ, సిబ్బంది కొరత వంటి సమస్యలు ఉంటే వాటిని సాగు సీజన్‌కు ముందే పరిష్కరించాలి. నీరు అందుబాటులో ఉన్నప్పుడు దాన్ని ఎత్తిపోసే సామర్థ్యం లేకపోవడం, ఎత్తిపోసిన నీటిని పంపిణీ చేసే కాలువలు సిద్ధంగా లేకపోవడం ప్రాజెక్టు లక్ష్యాన్నే దెబ్బతీస్తాయి.

కృష్ణా నది యాజమాన్య బోర్డు పాత్ర కూడా ఇక్కడ కీలకం. నీటి విడుదలలు, నిల్వలు, ప్రాజెక్టుల వారీ వినియోగం, టెలిమెట్రీ ద్వారా నమోదయ్యే ప్రవాహాల వివరాలు రెండు రాష్ట్రాలకు అందుబాటులో ఉండాలి. వివాదాలు తలెత్తినప్పుడు సమావేశాలు నిర్వహించడమే కాకుండా, అందుబాటులో ఉన్న అధికారాల పరిధిలో నిబంధనల అమలు, సాంకేతిక పరిశీలన, వివాద పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా తన వాదనలను బలమైన ఆధారాలతో బోర్డు ముందు ఉంచాలి. అవసరమైతే కేంద్ర జల సంఘం, సంబంధిత సాంకేతిక సంస్థల సహకారంతో ప్రాజెక్టుల వారీ నీటి లెక్కలను పరిశీలించాలి. కృష్ణా జలాల విషయంలో న్యాయమైన వాటా కోసం పోరాడటం అవసరమే, అదే సమయంలో రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునే అంతర్గత వ్యవస్థను బలోపేతం చేయడం కూడా అంతే ముఖ్యం. సాగునీటి సమస్యకు పరిష్కారం భారీ ప్రాజెక్టులతోనే సాధ్యమవుతుందని భావించడం సరికాదు. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, సూక్ష్మ సేద్యం, పంటల ప్రణాళిక, నీటి పొదుపు పద్ధతులు సమాంతరంగా అమలుకావాలి. వాతావరణ మార్పుల నేపథ్యంలో వర్షపాతం ఎప్పుడు, ఎంత కురుస్తుందో ఖచ్చితంగా అంచనా వేయడం కష్టమవుతోంది. అందువల్ల వరదలు వచ్చిన సంవత్సరాల్లో నీటిని నిల్వ చేసుకోవడం, తక్కువ వర్షపాతం ఉన్న సంవత్సరాల్లో ప్రాధాన్యాల ప్రకారం వినియోగించడం, తాగునీటికి తగిన రక్షణ కల్పించడం అవసరం. రైతులకు ఏ సీజన్‌లో ఎంత నీరు అందుబాటులో ఉంటుందో ముందుగానే తెలియజేస్తే పంటల ఎంపికలోనూ నష్టాలను తగ్గించుకోవచ్చు. సాగునీటి ప్రణాళికను కేవలం ఇంజినీరింగ్ శాఖ బాధ్యతగా కాకుండా వ్యవసాయం, విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో అమలు చేయాలి. ప్రస్తుతం పాలమూరు నీటి సమస్యపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు చర్చలు జరపడం ఉపయోగకరమైన పరిణామమే. అయితే ఆ చర్చలు ప్రకటనలకే పరిమితం కాకూడదు. అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ప్రాంత ప్రయోజనాల కోసం ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలి. ప్రాజెక్టుల వారీగా పెండింగ్ పనులు, అవసరమైన నిధులు, అనుమతులు, పూర్తి చేయాల్సిన గడువులు, వాస్తవంగా సాగునీరు అందించే ఆయకట్టు వివరాలను ప్రజలకు వెల్లడించాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి పురోగతి నివేదిక విడుదల చేయాలి. కేటాయించిన నిధులు ఖర్చు కాకపోతే కారణాలు చెప్పాలి, నిర్ణీత గడువులో పనులు పూర్తికాకపోతే బాధ్యతను నిర్ధారించాలి. అదే విధంగా కృష్ణా జలాల వినియోగంపై రోజువారీ లేదా నిర్దిష్ట వ్యవధుల్లో లెక్కలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఈ పారదర్శకతే ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. పాలమూరు ప్రజలకు కావాల్సింది మరో హామీ కాదు, తమకు న్యాయంగా అందాల్సిన నీటిపై భరోసా, పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా వాస్తవ సాగునీరు, అసంపూర్తి పనులకు కాలపరిమితితో కూడిన పరిష్కారం. కరువు, వలసలతో గుర్తింపు పొందిన ప్రాంతం ఇకపై సాగునీటి భద్రతతో, వ్యవసాయ ఆధారిత ఉపాధితో ముందుకు సాగాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నీటి హక్కుల పరిరక్షణలో చురుకుగా వ్యవహరించాలి, అదే సమయంలో ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ, నిధుల వినియోగంపై జవాబుదారీతనాన్ని నిర్ధారించాలి. నీటి లెక్కల్లో పారదర్శకత, నిర్మాణాల్లో వేగం, ఖర్చులో క్రమశిక్షణ, రైతుల అవసరాలపై స్పష్టమైన దృష్టి ఉంటేనే పాలమూరు సంక్షోభానికి పరిష్కారం సాధ్యమవుతుంది. ఎర్రటి నేలల్లో పచ్చని పంటలు కనిపించడం, వలసబాట పట్టిన కుటుంబాలు స్వగ్రామాల్లోనే ఉపాధి పొందడం, రైతుకు సాగునీటిపై నమ్మకం కలగడం ఇవే ఏ ప్రభుత్వానికైనా నిజమైన అభివృద్ధి ప్రమాణాలు కావాలి.



**-మన్నారం నాగరాజు**
**తెలంగాణ లోక్‌సత్తా పార్టీ.**
**వ్యవస్థాపకులు**

---

## తెలంగాణలో నామినేటెడ్

# పోస్టుల సందడి

### త్వరలో భారీగా భర్తీ?

**ప్రధానంగా మూడు అంశాలపై ఫోకస్**

**1. ఖాళీగా ఉన్న కార్పొరేషన్లు, బోర్డుల జాబితా ఖరారు**

**2. ఆశావహుల పేర్లపై సీఎం-పీసీసీ స్థాయిలో పరిశీలన**

**3. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవ, గత పదవుల పనితీరు ఆధారంగా తుది ఎంపిక**



తెలంగాణలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి కసరత్తు ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ ఇటీవల జరిపిన చర్చల్లో ఈ అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నేతలు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని చర్చ జరిగినట్లు సమాచారం.

**సుమారు 50 పోస్టులపై ఫోకస్**

ప్రస్తుతం రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు, బోర్డులు, డెవలప్‌మెంట్ అథారిటీలు తదితర విభాగాల్లో గణనీయ సంఖ్యలో నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 50పైగా పోస్టుల భర్తీకి కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. మొత్తం ఖాళీల సంఖ్యపై వేర్వేరు లెక్కలు ఉన్నప్పటికీ, ప్రస్తుత దశలో సుమారు 50 పోస్టులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు సమాచారం.

**ఎవరికి ప్రాధాన్యం?**

ఈసారి పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. గతంలో నామినేటెడ్ పదవులు పొందినవారి పనితీరు, పార్టీ కార్యక్రమాల్లో వారి క్రియాశీలతను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

**సామాజిక సమీకరణాలపై ఫోకస్**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే అంశం కూడా కసరత్తులో కీలకంగా మారింది. కులగణన వివరాలను పరిగణనలోకి తీసుకుని, ఇప్పటివరకు తక్కువ ప్రాతినిధ్యం దక్కిన సామాజిక వర్గాలకు అవకాశం కల్పించాలనే ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం.

పాతవారికి రెన్యూవల్.. కొత్తవారికి ఛాన్స్?

2024 జూలైలో పలు కీలక కార్పొరేషన్లకు చైర్మన్లు నియమించబడ్డారు. వారిలో కొందరి రెండేళ్ల పదవీకాలం 2026 జూలైలో ముగిసింది. దీంతో గడువు ముగిసిన వారికి మరోసారి అవకాశం ఇవ్వాలా? లేక కొత్తవారిని నియమించాలా? అనే అంశంపైనా పార్టీ నాయకత్వంలో చర్చ జరుగుతున్నట్లు తాజా సమాచారం. కొంతమంది మాజీ చైర్మన్లను కొనసాగించే ప్రతిపాదనలు ఉన్నట్లు నేతలు పేర్కొంటున్నప్పటికీ, చివరి జాబితా అధికారికంగా ప్రకటించే వరకు పేర్లపై స్పష్టత లేదు.

**ఆలస్యానికి కారణాలపై చర్చ**

నామినేటెడ్ పోస్టుల భర్తీపై గతంలోనూ పలుమార్లు కసరత్తు జరిగినప్పటికీ వివిధ రాజకీయ, సంస్థాగత కార్యక్రమాల కారణంగా ప్రక్రియ ఆలస్యమవుతూ వచ్చింది. ఆగస్టులోనే రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు విశ్వాసనీయ సమాచారం. తాజాగా దసరా తర్వాత భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి, దీపావళిలోగా నియామకాలు పూర్తి చేయాలనే లక్ష్యంపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చర్చించినట్లు పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

**ఆశావహుల్లో పెరిగిన ఉత్కంఠ**

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌లోని ఆశావహుల్లో మళ్లీ ఉత్కంఠ పెరిగింది. ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ ముఖ్య నేతల ద్వారా సిఫార్సులు చేయించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే కొందరు నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం డబ్బులు అడుగుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**నామినేటెడ్ పోస్ట్ లకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సిఎం రేవంత్ మెలిక..**

ప్రజా భవన్ లో జరిగిన సమావేశంలో సిఎం రేవంత్ నేతలకు దిశా నిర్దేశం తో పాటు క్లాస్ పీకినట్టు సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం పనిచేసిన నేతలకే పార్టీ పదవులైనా, నామినేటెడ్ పోస్టులైని స్పష్టం చేసినట్లు సమాచారం. పదవి రాకముందు తర్వాత పనితీరును బట్టే మీ ఎదుగుదల పదవులు ఉంటాయని సిఎం హెచ్చరించినట్టు విశ్వాసనీయ సమాచారం. కాబట్టి నామినేటెడ్ పోస్ట్ లకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సిఎం లింకు పెట్టి రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల గెలిపే లక్షం ఆ తర్వాతే పదవుల భర్తీ ఏదైనా అనేది మనకున్న సమాచారం.

**వాసుదేవరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్.**

---

## భారత ప్రజాస్వామ్యం :

# రాజ్యాంగ స్ఫూర్తితో భవిష్యత్తు వైపు

1951 అక్టోబర్ 25న భారతదేశం తొలి సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 1952 ఫిబ్రవరి వరకు కొనసాగిన ఆ ఎన్నికలు స్వతంత్ర భారత చరిత్రలో ఒక కీలక మలుపు. దేశ విభజన గాయాలు ఇంకా మానని రోజులు. పేదరికం విస్తృతంగా ఉంది. నిరక్షరాస్యత పెద్ద సవాలుగా నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో దేశ భవిష్యత్తును ప్రజలే నిర్ణయించాలన్న నమ్మకంతో భారత్ ప్రజాస్వామ్య బాట పట్టింది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 17.3 కోట్ల మంది ఓటు హక్కు పొందారు. 489 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది కాలానికే ఇంతటి విస్తృతమైన ప్రజాస్వామ్య ప్రయోగానికి సిద్ధపడటం భారతదేశం తీసుకున్న అసాధారణ నిర్ణయం. ఈ ఎన్నికల ప్రాధాన్యం కేవలం ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలోనే లేదు. పౌరులకు రాజకీయ సమానత్వాన్ని కల్పించడంలోనూ ఉంది. చదువు, ఆస్తి, ఆర్థిక స్థితి వంటి అర్హతలతో సంబంధం లేకుండా ప్రతి వయోజనుడికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి ఒక బలమైన పునాది వేసింది. దేశం అభివృద్ధి చెందిన తరువాత ప్రజలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలన్నది కాకుండా, ప్రజల భాగస్వామ్యంతోనే దేశాన్ని అభివృద్ధి చేయాలన్న దృక్పథాన్ని భారత్ ఎంచుకుంది. ప్రజల తీర్పు నుంచే ప్రభుత్వానికి అధికారం లభించాలన్న ఈ సూత్రం భారత ప్రజాస్వామ్య ప్రయాణానికి దిశానిర్దేశం చేసింది. ఏడు దశాబ్దాలకు పైగా సాగిన ఈ ప్రయాణం భారత ప్రజాస్వామ్యంలోని విస్తృతిని, పరిణామశీలతను చాటుతోంది. ఎన్నో సాధారణ ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వాలు మారాయి. కొత్త రాజకీయ శక్తులు ఆవిర్భవించాయి. ప్రాంతీయ పార్టీల ఎదుగుదలతో రాష్ట్రాల ఆకాంక్షలకు జాతీయ రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం లభించింది. మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల రాజకీయ భాగస్వామ్యం కూడా విస్తరిస్తోంది. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజాస్వామ్య వ్యవస్థ కొత్త రూపాలను సంతరించుకుంటున్నా, ప్రజలే అధికారానికి మూలమన్న మౌలిక సూత్రం మాత్రం కొనసాగుతోంది. ఈ ప్రయాణానికి భారత రాజ్యాంగమే వెన్నెముక. ప్రజల హక్కులను నిర్వచించడంతో పాటు, ప్రభుత్వ అధికారాలకు హద్దులు నిర్దేశించడం, పాలనా వ్యవస్థల బాధ్యతలను స్పష్టం చేయడం రాజ్యాంగం అందించిన కీలకమైన భరోసాలు. ప్రాథమిక హక్కులు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, కేంద్రం--




రాష్ట్రాల మధ్య అధికారాల విభజన కలిసి దేశ పరిపాలనకు ఒక సమతుల్యమైన చట్రాన్ని కల్పిస్తున్నాయి. ఇవి కేవలం న్యాయపరమైన నిబంధనలు కావు. భిన్నమైన అభిప్రాయాలు, విభిన్నమైన ఆకాంక్షలు కలిగిన ప్రజలు ఒకే దేశంలో కలిసి ముందుకు సాగేందుకు అవసరమైన వ్యవస్థాగత ఆధారాలు. భారత ప్రజాస్వామ్య ప్రత్యేకత దేశంలోని వైవిధ్యాన్ని తనలో ఇముడ్చుకోవడంలోనూ కనిపిస్తుంది. భాషలు, సంస్కృతులు, మతాలు, ప్రాంతీయ అవసరాలు వేరైనా, వాటికి ప్రజాస్వామ్య ప్రక్రియలో వ్యక్తీకరణకు అవకాశం ఉంది. ఎన్నికలు ప్రజలకు తమ ప్రాధాన్యాలను తెలియజేసే వేదికగా నిలుస్తాయి. పార్లమెంటు, శాసనసభలు భిన్నమైన అభిప్రాయాల మధ్య చర్చకు, సమన్వయానికి అవకాశం కల్పిస్తాయి. రాష్ట్రాలకు తమ అవసరాలకు అనుగుణంగా విధానాలు రూపొందించుకునే అవకాశం కల్పించే సమాఖ్య వ్యవస్థ కూడా ఈ ప్రజాస్వామ్య నిర్మాణంలో కీలక భాగం. భిన్నత్వాన్ని బలహీనతగా కాకుండా, దేశ నిర్మాణంలో భాగంగా చూడటమే భారత ప్రజాస్వామ్యానికి ఉన్న ప్రత్యేకమైన బలం. ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి మధ్య ఉన్న సంబంధం కూడా అంతే ముఖ్యం. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేస్తాయి. ఎన్నికల ద్వారా ప్రజలు తమ అవసరాలను, ఆకాంక్షలను ప్రభుత్వాల ముందుంచగలుగుతారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడు, విద్యా అవకాశాలు విస్తరించినప్పుడు, సమాచారాన్ని పొందడం సులభమైనప్పుడు ప్రజాస్వామ్య భాగస్వామ్యం మరింత అర్థవంతమవుతుంది. అభివృద్ధి ప్రజలకు అవకాశాలను కల్పించాలి; ప్రజాస్వామ్యం ఆ అవకాశాలు సమాజంలోని అన్ని వర్గాలకూ అందేలా దోహదపడాలి. ఈ రెండింటి మధ్య సమన్వయం ఉన్నప్పుడే దేశ పురోగతి విస్తృతమైన సామాజిక ప్రయోజనాన్ని అందిస్తుంది. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఓటు హక్కులో సమానత్వం ప్రజాస్వామ్యానికి పునాది అయినప్పటికీ, జీవితంలోని అవకాశాల్లోనూ సమానత్వం సాధించడం అంతిమ లక్ష్యం కావాలి. నాణ్యమైన విద్య, అందుబాటులో ఉండే వైద్యం, గౌరవప్రదమైన ఉపాధి, సామాజిక వివక్షను తగ్గించే చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రజల దైనందిన జీవితానికి మరింత దగ్గర చేస్తాయి. వెనుకబడిన వర్గాలకు అవకాశాలు పెరిగినప్పుడు వారి గొంతు ప్రజా నిర్ణయాల్లో మరింత స్పష్టంగా వినిపిస్తుంది. ప్రజాస్వామ్యం సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలకు ప్రతిబింబంగా మారుతుంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ ప్రజాస్వామ్యానికి కొత్త అవకాశాలను తెరుస్తోంది. డిజిటల్ వేదికలు సమాచారాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నాయి. ప్రభుత్వ సేవలను పొందడం సులభతరమవుతోంది. ప్రజా సమస్యలపై చర్చించడానికి, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి కొత్త మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే ఈ ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరాలంటే డిజిటల్ సౌకర్యాలు, విశ్వసనీయమైన సమాచారం, వ్యక్తిగత సమాచార భద్రతకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, సాంకేతిక పరిజ్ఞానానికి పరిమితంగా చేరువైన ప్రజలు కూడా ఈ మార్పుల వల్ల ప్రయోజనం పొందేలా చూడటం అవసరం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేది ఎన్నికల నిర్వహణ మాత్రమే కాదు; ప్రజల్లో పెరిగే పౌర బాధ్యత కూడా. ఓటు వేయడం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన హక్కు. కానీ ప్రజల భాగస్వామ్యం అక్కడితో ముగియదు. స్థానిక సమస్యల పరిష్కారంలో పాల్గొనడం, ప్రజా విధానాలపై అవగాహన పెంచుకోవడం, స్థానిక సంస్థలతో కలిసి పనిచేయడం, సమాజ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మకంగా చర్చించడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతిలో భాగమే. విద్యాసంస్థలు, మీడియా, రాజకీయ పార్టీలు ప్రజల్లో రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించగలవు. భారతదేశం ఆర్థికంగా, సాంకేతికంగా కొత్త దశలోకి అడుగుపెడుతున్న వేళ రాజ్యాంగ స్ఫూర్తి మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త విధానాలను రూపొందించుకోవడం ఎంత ముఖ్యమో, వ్యక్తి స్వేచ్ఛకు గౌరవం ఇవ్వడం, హక్కులను కాపాడటం, జాతీయ ఐక్యతను నిలబెట్టడం కూడా అంతే ముఖ్యం. దేశ పురోగతి కొందరికే పరిమితం కాకుండా విస్తృత ప్రజానీకానికి చేరినప్పుడే అభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజాస్వామ్య సంస్థలు, ప్రజల భాగస్వామ్యం, రాజ్యాంగ విలువలు పరస్పరం బలపరుచుకోవాలి. 1951--52 తొలి సార్వత్రిక ఎన్నికలు భారత ప్రజల సామర్థ్యంపై దేశం ఉంచిన విశ్వాసానికి ప్రతీక. విభిన్నతలతో కూడిన సమాజం కూడా ప్రజల భాగస్వామ్యంతో తన భవిష్యత్తును నిర్మించుకోగలదని అవి నిరూపించాయి. ఆ ఎన్నికలతో మొదలైన ప్రయాణం భారతదేశానికి ఒక విలువైన వారసత్వాన్ని అందించింది. ప్రతి పౌరుడికీ దేశ భవిష్యత్తులో భాగస్వామ్యం ఉందన్న విశ్వాసమే భారత ప్రజాస్వామ్యానికి అసలైన పునాది. ఆ విశ్వాసాన్ని సమాన అవకాశాలుగా, సమ్మిళిత అభివృద్ధిగా, రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధతగా మార్చగలిగినప్పుడే ప్రజాస్వామ్య ప్రయాణం మరింత బలంగా ముందుకు సాగుతుంది.



**-కింజరాపు అమరావతి**
kinjarapuamara-
vathi588@gmail.com



## దుర్గామాతకు సీఐ ప్రత్యేక పూజలు

- దుర్గాదేవి శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలి

**మంచాల వెలుతురు అక్టోబర్ 24:**
మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత శోభాయాత్ర కార్యక్రమనాకి హాజరైన మంచాల పోలీస్ స్టేషన్ సిఐ ఏ మధు ముందుగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు అనం తరం మాట్లాడుతూ దుర్గామాత శోభాయాత్రను శాంతియుతంగా ఇలాంటి సంఘటనలు జరగ కుండా భక్తిశ్రద్ధలతోజరుపుకోవాలని అన్నారు అనంతరం శోభాయాత్రలో పాల్గొని దుర్గామాతకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు దుర్గాదేవి శోభాయాత్ర డప్పుచప్పులతో డీజే సౌండ్ తో యు వకుల ఆటపాటలతో దుర్గాదేవి శోభయాత్ర అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు గ్రా మంలోని ప్రజలం దరూ పెద్దఎత్తున పాల్గొని దుర్గామాత శోభయాత్ర విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నర్సింగ్ వెంకటరమణ గౌడ్ పాలకుర్ల శేఖర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింగ్ శేఖర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నేనావత్ రా జు నాయక్ జాటోత్ రాజు నాయక్ మామిడిపల్లి శ్రీనివాస్ గ్రామపెద్దలు యువకులుతదితరులు పాల్గొన్నారు

## రైతులు నీటి వినియోగాన్ని తగ్గించాలి : ఎమ్మెల్యే

వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గించి, ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లిలోని రైతు వేదికలో సర్పంచి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, వ్యవసాయంపై వాటి ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే ఆధునిక సాగు పద్ధతులను రైతులు అవలంబించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పత్య నాయక్, భాస్కర్ రెడ్డి, నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మహేష్, శ్రీకాంత్, సురేష్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా సమయంలో కోతలు లేకుండా కరెంట్ ఇచ్చాం

కరోనా సమయంలో కూడా కరెంటు కోతలు లేకుండా సరఫరా చేశామని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరోనా మొదలైన నాడు 10వేల మెగావాట్ల డిమాండ్ ఉండేదని, ఒకేసారి 3,800 మెగావాట్ల డిమాండ్ పెరిగిందని చెప్పారు. ప్రజలందరూ కరోనాకు భయపడి ఇళ్లల్లో ఉన్నా కూడా విద్యుత్ అధికారులు రాత్రింబవళ్లు కష్టపడ్డారని అన్నారు. కానీ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాక అధికారులను సస్పెండ్ చేయడం, మెమోలు ఇవ్వడం చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్‌నినో వల్ల ప్రజలు ఇబ్బంది పడడానికి బీఆర్ఎస్ పార్టీ కారణమని చెప్పడమేంటని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. మూడేళ్ల నుండి మీరేం చేయలేదని, మీ దగ్గర రిజల్ట్ ఎందుకు లేదని అడిగితే... పాత మొగుడు ఏం చేయలేదన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు. ఇప్పుడే కన్నెపల్లి దగ్గరికి పోదామని, మోటర్లు ఆన్ చేసి నీళ్లు తెచ్చి చూపిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఛాలెంజ్ చేశారు. ఇప్పుడు కూడా అక్కడ నీళ్లు వృథాగా పోతున్నాయని అన్నారు. కృష్ణా నీటిని ఇప్పటికే చంద్రబాబుకు ధారాదత్తం చేశారని, ఇప్పటికైనా నీటిని లిఫ్ట్ చేసినా కరీంనగర్, మెదక్, నల్గొండ జిల్లాలకు నీళ్లు ఇవ్వొచ్చని అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు కౌంటర్ ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి తిట్టగానే, ఈరోజు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టాడని ఆరోపించారు. అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని ఉన్నట్టు, తెలంగాణకు కాంగ్రెస్ అనే శని చుట్టుకుందని విమర్శించారు.

# చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

- పంచాయతీ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి
- ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గ్యార పాండు డిమాండ్

**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 24:**
ఇబ్రహీంపట్నం గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లాకార్యదర్శి గ్యార పాండు డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా డిపివో గారికి వినతిపత్రం అందజేశారు ఈ సం దర్భంగా గ్యార పాండు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12790 గ్రామపంచాయతీలో 52, 000 మంది గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని నిత్యం గ్రామాల్లో ప్రజల కు సేవలు చేస్తున్నారు 2019 సంవత్సరంలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 51మల్టీపర్పస్ విధా నం పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాడుగా మారిందన్నారు ప్రతీ కార్మికుడు అన్ని పనులు చేయాలనే నిబంధనతో అనేకచోట్ల ప్రమాదా లు జరుగుతున్నాయని ఆందోళన చెందారు కాంగ్రె స్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు వేతనాలు పెంచి పర్మినెంట్



చేస్తామని ఎన్నికలకు మేని ఫెస్టోలో ప్రకటించింది కానీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇచ్చిన హామీల ను ఏ ఒక్కటి కూడా అమలు చేయటం లేదు పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసిపిఆర్సి లో కూడా కార్మికులను గుర్తించాలని కనీస వేతనం30వేల రూపాయలు ఇవ్వాలన్నారు కారో ప ర్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని కార్మికుల అక్రమ తొల గింపు పై చర్యలు తీసుకోవాల ని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటి జిల్లాకమిటీ సభ్యులు పోచమోని కృష్ణ జగన్ పోల్కంపల్లి తదితరులు పాల్గొన్నారు

# అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించండి

**వాటర్ వర్క్స్ అధికారులకు సిపిఐ వినతి పత్రం.**

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 24:**
ఎల్నినో కారణంగా రాబోవు రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది కాబట్టి ప్రజలను అప్రమత్తత చేయడానికి, నీటి వృధాను అరికట్టడానికి వాటర్ వర్క్స్ అధికారులు అన్ని బస్తీలలో పర్యటించి ప్రజలను చైతన్యపరిచి నీటిని వృధా చేయకుండా చూడాలని నేడు సిపిఐ ఆధ్వర్యంలో చింతల్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ,రాష్ట్ర నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ బస్తీలలో మంచినీరు సరఫరా చేసే సమయంలో అధికారులు పర్యటించి ఎవరైతే నీరు వృధా చేస్తున్నారో వారికి జరిమానా విధిస్తే నీటిని వృధా చేసే మిగతా ప్రజలు కూడా భయపడి నీటిని వృధా చేయకుండా ఉంటారని అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారని,నీటి వృధానీ అరికట్టాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు అధికారులు కూడా ప్రకటనలకే పరిమితమైతే సరిపోదని వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు మొదలుపెట్టాలని అదేవిధంగా అక్రమంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను కూడా మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గిరి నగర్ మరియు జగద్గిరి గుట్టలో వివిధ ప్రాంతాలలో వివిధ బస్తీలలో ఎక్కడెక్కడ నీరు వృధాగా పోతుందో వాటి



వివరాలను వాటర్ వర్క్స్ అధికారులకు ఇవ్వడం జరిగింది. వారం రోజుల్లోపు సిపిఐ ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్ సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, కీర్తి శాఖ కార్యదర్శి వెంకటేష్, యాకూబ్, సిపిఐ నాయకులు ఇమామ్ యాదన్న, సాగర్, రాజేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవి

**శ్రీగురు మాధవానంద సరస్వతీ తెలంగాణ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి**

**శంకర్పల్లి, వెలుతురు అక్టోబరు 24 :**
బారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని శ్రీగురు మాధవానంద సరస్వతీ తెలంగాణ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి తెలిపారు. శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ లో శనివారం కౌన్సిలర్ కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి పాదుకాపూజ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. పాదుకాపూజ అనంతరం స్వామివారు భక్తులను





ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కోపాన్ని వీడి, ప్రేమను అనుసరించాలని తెలిపారు. కోపంతో ఆరోగ్యం పాడవుతుందని వివరించారు. శాంతం. ప్రేమతో అన్ని పనులను చక్కదిద్దుకోవచ్చని అన్నారు. ఇతరులతో కలిసి మెలిసి జీవించాలని సూచించారు. కష్టం వస్తే అందరూ కలిసి దాన్ని ఎదుర్కోవాలని తెలియజేశారు. ప్రతివాడు అన్ని పనులు చేయలేడని చెప్పారు. భగవంతునిపై భారం వేసి జీవితాన్ని గడుపాలని స్పష్టం చేశారు. సేవా కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలని వెల్లడించారు. తల్లిదండ్రులను పూజించిన అనంతరమే భగవంతున్ని కొలవాలని స్పష్టం చేశారు. ఐశ్వర్యం ముఖ్యం కాదని, ఈశ్వరుడి నామస్మరణమే ముఖ్యమైనదని చె ప్పారు. ఈకార్యక్రమంలో వార్డు పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## మద్దెల బాలరాజు దశదినకర్మలో పాల్గొని నివాళులర్పించిన ప్రముఖులు

**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 24:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని అంబేద్కర్ ఫంక్షన్ హాలో జరిగిన మద్దెల యాదగిరి క్రైమ్ కానిస్టేబుల్.తండ్రి మద్దెల బాలరాజు దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా బా లరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పలువురు ప్రము ఖులు ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా మద్దెల బాలరాజు చిత్రపటానికి పూలమా లలువేసి ఆయనకు నివాళు లుఅర్పించారు ఈ కార్యక్రమంలో మంచాల గ్రామమాజీ కోఆప్షన్ స భ్యుడు అశ్వాల బాలరాజు. రజక సంఘం రాష్ట్ర నాయకుడు మొగిలి మహేష్ లింగం పాల్గొని మద్దెల బాలరాజు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢసానుభూతిని తెలియజేస్తూ. ఈ కష్టసమ యంలో మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నవారు బా లరాజు మృతికి సంతాపం వ్యక్తం చేశారు

## షార్ట్ సర్క్యూట్‌తో చర్చి బుగ్గిపాలు!



: వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని వెల్చాల్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సెవెంత్ డే చర్చి పూర్తిగా దగ్ధమైంది. ఉదయం నిద్రలేచి చూసేసరికి చర్చి నుంచి మంటలు రావడాన్ని గమనించిన బోవోళ్ల ప్రవీణ్ వెంటనే స్థానిక ఎస్సై భరత్ భూషణ్‌కు సమాచారం అందించారు. పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన స్పీకర్..

చర్చి దగ్ధమైన విషయం తెలుసుకున్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అగ్నిప్రమాదం కారణంగా చర్చికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన చర్చి నిర్మాణానికి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. చర్చి దగ్ధం కావడంతో స్థానిక క్రైస్తవులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

### సకాలంలో స్పందించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది..

అగ్నిప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి సహాయక చర్యల్లో పాల్గొనడంతో పాటు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. సకాలంలో స్పందించిన పోలీసుల తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘటనాస్థలాన్ని డీఎస్పీ అంజయ్య, సీఐ జి. వెంకట్, ఎస్సై భరత్ భూషణ్, తహసీల్దార్ మునిరొద్దీన్, పంచాయతీ కార్యదర్శి సందర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురేందర్, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ అవగాహన కార్యక్రమం



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కో–ఆర్డినేటర్లు, బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులు సీఈఓ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫారం–18 సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. మహబూబ్‌నగర్––రంగారెడ్డి––హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా ఈ సమావేశం నిర్వహించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, దిండు శ్రీనివాస్ గౌడ్, బోయపల్లి వెంకటరెడ్డి, పుట్టగల జగన్, రామిడి కృష్ణారెడ్డి, మల్గారి శ్రీధర్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, సాయి, పుట్టగల భాస్కర్, వెంకటేష్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, వంశీ, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కాలనీకి విద్యా వసతుల కానుక

: నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్రవ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో సుడా నిధులు రూ. 1.30 కోట్లతో చేపట్టనున్న ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు, మూడు వారాలకు ఒకసారి పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించాలని



సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ మీటర్లు అందించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కాలనీలో ఇళ్లలో నివసిస్తున్న వారికి ఇంటి పన్ను ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎవరూ అక్రమంగా విద్యుత్ వినియోగించకూడదని, ప్రతి ఇంటికి సరైన విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి పన్ను ధ్రువీకరణ పత్రం కూడా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. కాలనీలో నివసించే ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం విద్యుత్ సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. 2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అంశాలపై సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు విద్యావంతులైతేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయి



- తెలంగాణ రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి
- తెలంగాణలోనే తొలిసారిగా ఫరూక్‌నగర్‌లో ఉర్దూ భాషా అభ్యసన కార్యక్రమం
- మార్చిలోగా ఫరూఖ్ నగర్ మండల్‌లో 5,500 మందికి విద్య అందించే లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- కార్యక్రమానికి హాజరైన వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత

**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 24:**
మహిళా అక్షరాస్యతను పెంపొందించి, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్రవ–యోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్‌నగర్‌లో తెలంగాణలోనే తొలిసారిగా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఉర్దూ భాషా అభ్యసన కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలు చదువుపై ఆసక్తి పెంచుకొని అక్షరాస్యత సాధించాలని పిలుపునిచ్చారు. మార్చి నెలలోగా ఫరూక్ నగర్ మండల్ లో 5,500 మంది పురుషులు, మహిళలకు విద్య అందించాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ విద్యను చేరువ చేయడంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

సెమినా మహిళా సేవా మండలి, ఆలియా సుల్తానా సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అనిత, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్య తదితరులు పాల్గొని ఉర్దూ అభ్యసన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఫరూక్‌నగర్‌లో ఉర్దూ భాషా అభ్యసన కార్యక్రమం ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొంటూ, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలియా సుల్తానా మాట్లాడుతూ తన సహకారంతో వెయ్యి మందికి ఉర్దూ భాషనేర్పించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఉర్దూ భాషను ప్రతి ఇంటికీ చేరవేసి మహిళల్లో భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, తమ పిల్లల భవిష్యత్తు కోసం విద్యకు ప్రాధాన్యత ఇస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ న్యాయవాది సబియా సుల్తానా, మెప్మా సిబ్బంది ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి



**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 24:**
కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ మునుగోడు నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ కోరారు. కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ఆ పార్టీ నాయకత్వం కార్యాచరణకు సిద్ధం కావాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు, త్వరలోనే బూత్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రతి వార్డులో పార్టీకి బలమైన నాయకత్వాన్ని నిర్మించి, బూత్ స్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించడంపై దృష్టి సారించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో ప్రాధాన్యతనిచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, బ్లాక్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ , సింగిల్ విండో వైస్ చైర్మన్ శివారెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు రామాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ప్రధాన కార్యదర్శిలు ఇప్ప వెంకటేష్, ఎర్రగుని లింగస్వామి యాదవ్, ఉపాధ్యక్షులు వెంకట్ కుమార్, అంతటి విజయలక్ష్మి బాలరాజు, చెరుకు లింగస్వామి, బండమీది మల్లేష్, ఎండి వహీద్, అధికార ప్రతినిధి శ్యామకూర యాదయ్య, కార్యదర్శిలు మాదాని గోపాల్, గుండబోయిన మనిత ఐలయ్య యాదవ్, ఓర్సు శ్రీజా రాజు ,ఎండి ఫరోజ్ దుబ్బాటి దయాకర్ రెడ్డి, బత్తుల రాజు, జక్కర్తి సుధా, సుమతి,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## గుండాలలో రైతుల సమస్యలపై బీజేపీ వినతి

**గుండాల, అక్టోబర్ 24:(వెలుతురు):**
మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం సబ్ స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వ మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్నలో వోల్టేజ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, యాసంగి పంటల సాగుకు రోజుకు 10 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీతారాంపురం శివారులో అసంపూర్తిగా ఉన్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పింగళి విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుక్క శేఖర్, వెంపటి సురేష్, ప్రధాన కార్యదర్శులు కప్పరి నాగిరెడ్డి, ఆవుల సాయితేజ, జిల్లా బీజేవైఎం ఐటీ సెల్ నాయకుడు మచ్చ వివాకర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు రొయ్యల ఉపేందర్, సీనియర్ నాయకులు బండి యాదగిరి, యామగాని బాలయ్య, ముత్యం సోమయ్య, నరేష్, గుండాల గ్రామ శాఖ అధ్యక్షులు అవిరెండ్ల సతీష్, బంగారోజు సోమన్న, కార్యదర్శి దొర్నం రమేష్, మహేష్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన సదస్సు



**మోత్కూర్, అక్టోబర్ 24,వెలుతురు న్యూస్ :**
జిల్లా న్యాయసేవాధికారి ఆదేశానుసారం మండల లీగల్ సర్వీస్ అథారిటీ రామన్నపేట ఆధ్వర్యంలో శనివారం నాడు బుజిలాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలల హక్కులపై అవగాహన సదస్సును మండల విద్యాధికారి టి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య హాజరై మాట్లాడుతూ విద్యార్థులే దేశానికి తల్లిదండ్రులకు నిజమైన సంపద అని అన్నారు .విద్యార్థులు బడిలో ఉన్నప్పుడే వారి హక్కులు రక్షింపబడతాయని పిల్లలే తమ నిజమైన సంపద మరియు దేశ సంపద అని తల్లిదండ్రులు గుర్తించినప్పుడే విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్ద టానికి అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఫ్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాసు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, డ్రగ్స్, గంజాయి, పోక్సో , రవాణా చట్టాలు, మరియు సైబర్ నేరాలు మీద, మరియు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు 2098,108,112,100 మీద అవగాహన కల్పించారు. అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యులు కానుగంటి శ్రీశైలం, లీగల్ సర్వీస్ ప్రతినిధి కురిమేటి యాదయ్య, మోత్కూరు మున్సిపాలిటీ కౌన్సిలర్ మొగుళ్ల అనురాధ, జెడ్ పి హెచ్ ఎస్ సి పి ఓ ఎ.భవాని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. ఉమేష్ చంద్ర, ఏ ఏ పీ సి చైర్మన్ శ్రీమతి. చుక్క విజయ ,ఉన్నత పాఠశాల ,ప్రాథమిక పాఠశాల,ఉపాధ్యాయ బృందం, మోత్కూర్ పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులోకి దిగి గిరిజన రైతు మృతి



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 24:**
బహిర్ భూమిక ని వెళ్లి చెరువులోకి దిగి చేపల వలలో చిక్కుకొని గిరిజన రైతు మృతి చెందిన సంఘటన కౌడిపల్లి మండలం బతుకమ్మ తండాలో శనివారం చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి పంచాయతీ పరిధిలోని బతుకమ్మ తండాకు చెందిన అజ్మీరా శ్రీనివాస్ (47) శుక్రవారం రాత్రి ఇంట్లో బహిర్భూమి కోసం వెళ్తానని చెప్పి బయటకు వెళ్ళాడు. రాత్రి వెళ్లిన శ్రీనివాస్ తెల్లవారినప్పటి కూడా ఇంటికి రాలేదు దీంతో కుటుంబ సభ్యులు బంధువులు తెలిసిన పలుచోట్ల వెతికారు అయినప్పటికీ ఆచూకీ లభించలేదు. తిరిగి తండా శివారులో వెతుకుతుండగా సమీపంలోని పల్లెచెరువు కట్టపై చెప్పులు తువాలు కనిపించాయి. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తాండావాసులు చెరువులోకి దిగి వెతుకుతుండగా చేపల వలలో చిక్కుకున్న అజ్మీర శ్రీనివాస్ మృతదేహం లభించింది. మృతుని భార్య సాయమ్మ శనివారం కౌడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమరేందర్ రెడ్డి తెలిపారు."



## ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

**మునుగోడు,అక్టోబర్ 24 (వెలుతురు ):**
జిల్లాలో ఎస్సీ,ఎస్టీల హక్కుల పరిరక్షణ, అభ్యున్నతికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత సూచించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన జంగిలి నాగరాజు శనివారం కైలాష్ నేతను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కైలాష్ నేతను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కైలాష్ నేత నాగరాజును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారికి అందాల్సిన హక్కులు, సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపాలని సూచించారు.





## పెన్షన్ కోసం వెళ్లిన వృద్ధురాలి ఇంట్లో చోరీ..

పెన్షన్ తీసుకునేందుకు వెళ్లిన ఓ వృద్ధురాలి ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన దుబ్బగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెన్ పహాడ్ మండల పరిధిలోని నాగులపహాడ్, దుబ్బగూడెం గ్రామానికి చెందిన నంద్యాల లింగమ్మ (55) ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు తన ఇంటికి తాళం వేసి పెన్షన్ తీసుకునేందుకు వెళ్లింది. తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా, ఇంటి వెనుక తలుపు తెరిచి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో భద్రపరిచిన రెండు తులాల బంగారు గాజులతో పాటు రూ.10 వేల నగదు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని దొంగలు ఇంటి వెనుక తలుపు ద్వారా లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు గుర్తించింది. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కె. సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎల్‌నినో ప్రభావం- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 24:**
చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో ఎల్ నినో (జుశ్రీ చీఅశీ) ప్రభావం, నీటి కొరత మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రజలు సహకారం అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని కోరారు.

శనివారం రోజున తంగడపల్లి లోని 4, 5, 6, 15 వార్డుల్లో, లక్కారం లో 8వ వార్డు ఆఫీస్ వద్ద వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, కొయ్యడి శేఖర్, ఆలె శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, బద్రి గాలయ్యల అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ సారథ్యంలో వార్డు సభలు నిర్వహించారు.

మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని జలాన్ని వృధా చేయకూడదని కోరారు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

**9, 10, 11 మరియు 19వ వార్డులలో...**
చౌటుప్పల్ పట్టణంలో 10వ వార్డు కౌన్సిలర్ దేప రమ్య రాజు, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్ అధ్యక్షతన వార్డు సభలు నిర్వహించారు. చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతతో పాటు, ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే నీటి ఎద్దడిని తట్టుకునేలా వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. చిన్న చిన్న జాగ్రత్తలతో( గేట్ వాళ్ళ మార్చుకోవడం, లీకేజీ పైపులు తీసి కొత్త పైపులు మర్చిపోవడం) నీటి వృథాను అరికట్టవచ్చని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో నీటి వృథాను అరికట్టాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని కమిషనర్ పిలుపు నిచ్చారు. అదేవిధంగా గాలి, నీరు, భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని, భవిష్యత్ తరాలకు ఈ స్వచ్ఛ సంపదను అందించాలని కోరారు.







**12 మరియు 13వ వార్డులు**

**(కంచరకుంట్ల కాలనీ):**
వినాయకుని మండపం వద్ద 12వ వార్డు కౌన్సిలర్ ఒక పాక చిరంజీవి, 13వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి బత్తుల వాణి విప్లవ్ మరియు కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ పాల్గొని 12, 13 వార్డుల ప్రజలకు ఎల్ నినో అంశంపై విస్తృత అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి మేనేజర్, అంజయ్య, ఆర్వో, కే హనుమాన్ ప్రసాద్ ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్, ఏం రేణు కుమార్ పర్యావరణ ఇంజనీర్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, జవాన్లు,పట్టణ ప్రముఖులు, నాయకులు, ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## దళిత బంధు నిధులను విడుదల చేయ్యాలి

**మోత్కూర్, అక్టోబర్ 24,వెలుతురు న్యూస్ :**
ఫ్రీజింగ్ చేసిన దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డా " బుషిపాక గణేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత దీ=వా ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం దళిత బంధు పథకం ను ప్రవేశ పెట్టి మొదటి విడతలో ప్రతి లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో 10 లక్షల రూపాయలు జమచేసింది. అదేవిధంగా 2 వ విడతలో భాగంగా మోత్కూరు అడ్డగూడూరు మండలాలకు సంబంధించిన 254 మంది లబ్ధి దారుల బ్యాంకు ఖాతాలో 3లక్షల రూపాయలు జమ చేసింది. జమ చేసిన కొద్ది రోజులకే 2023 సంవత్సరంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడం ద్వారా కలెక్టర్లు బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును ఫ్రీజింగ్ చేశారు. దీని వలన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టే ఏ యొక్క సంక్షేమ పథకానికి వీరు అర్హులు కాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రేవంత్ రెడ్డి తక్షణమే చొరవ తీసుకోని నిధులు మంజూరు చేపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 3 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తూ ,దళితుల అభివృద్ధిని అడ్డుకుంటూ , దళితుల పొట్ట కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు రేవంత్ రెడ్డి కి ఇప్పటికైనా కనువిప్పు కలిగించాలని మోత్కూరు మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి రాష్ట్ర గౌరవ సలహా దారులు కొంపల్లి అంజయ్య మరియు బండి వెంకటేష్, సుక్క అశోక్ ,బందెల శ్రీను, మోత్కూరు చిటికలయ్య, కొంపల్లి రమేష్ గంటెపాక రామ్ మల్లు తదితరులు పాల్గొన్నారు



## కుక్కల దాడిలో 32 గొర్రెలు మృతి..

: వీధి కుక్కల దాడిలో 32 గొర్రెలు మృతి చెందగా మరో 20 గొర్రెలకు గాయాలైన ఘటన దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మజీపేట వార్డులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెల కాపరి ఎడ్లకాడి యాదయ్యకు చెందిన 32 గొర్రెలు మృతి చెందగా, మరో 20 గొర్రెలు గాయాలపాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు బాధితుడు, గ్రామస్థులు తెలిపారు. రోజువారీ జీవనోపాధి కోసం గొర్రెల పెంపకంపై ఆధారపడిన యాదయ్యకు ఈ ఘటన తీరని నష్టాన్ని మిగిల్చింది. తెల్లవారుజామున కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో పెద్ద సంఖ్యలో గొర్రెలు మృత్యువాత పడగా, మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది.

గొర్రెల మృతితో సుమారు రూ.6 లక్షల మేర ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. గొర్రెల పెంపకమే జీవనాధారంగా బతుకుతున్న తనకు ఈ ఘటన కోలుకోలేని దెబ్బ అని ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కల దాడిలో నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఎడ్లకాడి యాదయ్య కోరుతున్నాడు. సంబంధిత అధికారులు ఘటనపై విచారణ జరిపి, నష్టాన్ని అంచనా వేసి, తగిన పరిహారం అందించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. జీవనోపాధిని కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. వీరి వెంట వార్డు కౌన్సిలర్ లు,గ్రామస్తులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుల నియామకం



**మోత్కూర్,అక్టోబర్ 24,వెలుతురు న్యూస్ :**
కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో భాగంగా పార్టీ అధిష్టానం మార్గదర్శకాలకు అనుకూలంగా యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య ఆదేశానుసారం తుంగతుర్తి శాసన సభ్యులు గౌరవ శ్రీ మందుల సామేలు సూచన మేరకు మోత్కూరు మండలానికి సంబంధిన నాలుగు గ్రామాల నూతన గ్రామశాఖ అధ్యక్షులను నియమించి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు నియామక పత్రాలను అందజేశారు .వీరిలో పాలడుగు శాఖ అధ్యక్షులుగా కొసన ఉప్పలయ్య,పాటిమట్ల అధ్యక్షులుగా కురిమేటి విక్రమ్,రాగిబావి అధ్యక్షులుగా గంటా వెంకట్రెడ్డి, అనాజిపురం అధ్యక్షులుగా బర్రె వెంకన్న కార్యకర్తల అభీష్టం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బాలరాజు గౌడ్ మాట్లాడుతూ ఇప్పుడు నియమించబడ్డ అధ్యక్షులందరూ తమ గ్రామంలో కార్యకర్తలందర్నీ సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలలో కాంగ్రెస్ శ్రేణులందర్నీ కలుపుకొని చురుకుగా పనిచేయాలని పార్టీ సిద్ధాంతాలు,నియమ నిబంధన,క్రమశిక్షణ చర్యలకు అనుగుణంగా వ్యవహరించాలని తెలిజేశారు. మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలుపుటలో ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి మధ్య సమన్వయ కర్తగా బాధ్యత వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో పాక్స్ ఛైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు , మున్సిపల్ పట్టణ అధ్యక్షులు బద్దం నాగార్జున రెడ్డి ,జిల్లా నాయకులు బొడ్డుపల్లి కల్యాణ్ చక్రవర్తి , గడ్డం సోమ నర్సయ్య ,గ్రామ సర్పంచ్లు అంతటి భగవంతు,బండ రామా విజయారెడ్డి, బీసు వెంకన్న,మండల నాయకులు ఎడ్ల భగవంత్. బండా వెంకటరెడ్డి,పసునూరి సత్తిరెడ్డి,ప్రతాప రెడ్డి,రంగారెడ్డి,మర్రిపెల్లి యాదయ్య,అంతటి వెంకన్న,ఉపసర్పంచ్లు దండబోయిన సత్తయ్య, శ్రీనివాసరెడ్డి, దడిపెల్లి సైదులు మరియు అంతటి బక్కయ్య,ఎడ్ల రాజు,ఆవుల చంద్రయ్య, జెల్ల నాందేవ్, ముక్కెర్ల మహేష్,గుండా రాములు,కురిమేటి సైదులు, ఎల్లయ్య, బట్టు మొగులయ్య,మర్రి గణేష్,మల్లేష్,దేవర శ్రీశైలం,నర్సిరెడ్డి, కన్నెబోయిన వెంకటేష్,అంజిరెడ్డి, రాంపాక రాములు,ఉప్పేష్,మహేష్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు .

## నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను వెంటనే పునరుద్ధరించాలి

పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని వెంటనే పునరుద్ధరించి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు చిక్కుడు అశోక్, మొగిలి వంశీ ఆధ్వర్యంలో ఆయన హాస్టల్ భవనాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మారం రవికుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు వసతి కల్పించాలనే ఉద్దేశంతో దాతలు ఉచితంగా అందించిన ఎకరం భూమిలో, ప్రభుత్వ నిధులు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉండటం బాధాకరమని అన్నారు. ప్రస్తుతం ఎస్సీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతుండగా,గూడూరులో ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం వినియోగంలో లేకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉండటానికి గల కారణాలపై విచారణ జరిపి, అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

; ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఆత్మకూర్(ఎస్) మండలం మిద్దనపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ హై స్కూల్ ను కలెక్టర్ ఆకస్మికంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా సంభాషించారు. పాఠ్యాంశాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి, వారి సందేహాలను ఎంతో ఓపిగ్గా నివృత్తి చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని వంట గదిను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, పారిశుద్ధ్య ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని మాత్రమే వడ్డించాలని, వంటకాల తయారీలో ఎలాంటి అలసత్వం వహించవద్దని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా మౌలిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, తహసీల్దార్ హమీన్ సింగ్, ఎంఈఓ ధారాసింగ్ ఉపాధ్యాయులు స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వెట్టిచాకిరి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శనివారం మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కార్మిక శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంస్థ సమన్వయంతో వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెట్టిచాకిరి, బలవంతపు శ్రమ నుంచి కార్మికులకు విముక్తి కల్పించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కులను తెలుసుకోవాలని, వారి రక్షణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపక కేంద్రాలు, గనులు, రాతి క్వారీలు, వ్యవసాయ క్షేత్రాలు, ఇతర అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు ఈ ప్రచార వాహనం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వెట్టిచాకిరి బాధితులు, అటువంటి పరిస్థితులను గుర్తించిన ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 080-69434343ను సంప్రదించి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక కళాజాత బృందం వెట్టిచాకిరి నిర్మూలనపై ప్రదర్శన ఇవ్వనున్నారన్నారు. అనంతరం వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

# మక్కా, మదీనాల్లో చిక్కుకున్న ఉమ్రా యాత్రికులను స్వదేశానికి రప్పించాలి!

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి
- సీపీఐ ఎమ్మెల్యే సాంబ శివారావు, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలలుద్దీన్ డిమాండ్



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:**
సౌదీ అరేబియాలోని మక్కా, మదీనాల్లో చిక్కుకుపోయిన భారతీయ ఉమ్రా యాత్రికులను తక్షణమే స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎమ్మెల్యే సాంబ శివారావు, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలలుద్దీన్ డిమాండ్ చేశారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు, భద్రతాపరమైన ఆందోళనలు, విమాన సర్వీసుల రద్దు కారణంగా వేలాది మంది యాత్రికులు స్వదేశానికి తిరిగి రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరారు.

**తెలంగాణకు చెందిన 1,800 మంది వరకు యాత్రికులు!**

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సుమారు 4,000 మంది భారతీయ ఉమ్రా యాత్రికులు మక్కా, మదీనాల్లో చిక్కుకుపోయినట్లు సమాచారం ఉందని, వీరిలో తెలంగాణకు చెందిన వారు 1,500 నుంచి 1,800 మంది వరకు ఉన్నారని వారు పేర్కొన్నారు. విమాన సర్వీసుల నిలిపివేత, గగనతలానికి సంబంధించిన సమస్యల కారణంగా యాత్రికుల తిరుగు ప్రయాణం అనిశ్చితిలో పడిందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేయాలి**

చిక్కుకుపోయిన యాత్రికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, అవసరమైన విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ప్రైవేట్ విమానయాన సంస్థల సహకారం తీసుకొని యాత్రికులను దశలవారీగా స్వదేశానికి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**యాత్రికులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలి**

ప్రత్యేక విమానాల ఏర్పాటు, తిరుగు ప్రయాణానికి అయ్యే అదనపు ఖర్చులు యాత్రికులపై ఆర్థిక భారాన్ని మోపే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రయాణ ఖర్చులు భరించి ఉమ్రా యాత్రకు వెళ్లిన వారికి మరోసారి భారీ మొత్తాలు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బాధ్యత తీసుకొని అవసరమైన ఆర్థిక సహాయం అందించడంతో పాటు, యాత్రికుల తిరుగు ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**యాత్రికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

సౌదీ అరేబియాలో ఉన్న భారతీయ యాత్రికుల ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, భారత రాయబార కార్యాలయం ద్వారా వారికి అవసరమైన సహాయం అందేలా చూడాలని వారు కోరారు. యాత్రికులకు వసతి, ఆహారం, వైద్య సహాయం వంటి అవసరాలు అందుబాటులో ఉన్నాయో లేదో అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వేలాది మంది యాత్రికులు స్వదేశానికి తిరిగి రావడానికి ఎదురుచూస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలస్యం చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని సాంబ శివారావు, సయ్యద్ జలలుద్దీన్ డిమాండ్ చేశారు. యాత్రికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, వారిని సురక్షితంగా స్వదేశానికి చేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారు కోరారు.

# విద్యుత్ షాక్‌తో మూడు ఎకరాల చెరుకు దగ్ధం!

- చేతికొచ్చిన పంట బూడిదపాలు..
- రైతుకు రూ.5 లక్షలకు పైగా నష్టం!



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం బూర్థిపాడ్ గ్రామంలో విద్యుత్ షాక్ కారణంగా చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో రైతు పెంటారెడ్డికి చెందిన మూడు ఎకరాల చెరుకు పంట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు 150 టన్నుల చెరుకుతో పాటు డ్రిప్ పైపులు, ఇతర పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే కాలిపోవడంతో రైతుకు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. అగ్నిమాపక శాఖ అధికారుల అంచనా ప్రకారం ఈ ప్రమాదంలో రూ. 5 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

**సకాలంలో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది**

ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే చెరుకు పంటలో ఎక్కువ భాగం కాలిపోయింది. మంటలు వేగంగా వ్యాపించడంతో పంటతో పాటు సాగు కోసం ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పైపులు, ఇతర పరికరాలు సైతం దగ్ధమయ్యాయి.



**మరో 15 రోజుల్లో ఫ్యాక్టరీలకు తరలించాల్సిన పంట**

మరో 15 రోజుల్లో చక్కెర కర్మాగారాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చెరుకును ఫ్యాక్టరీలకు తరలించేందుకు రైతు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పంట చేతికొచ్చిన సమయంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో రైతు పెంటారెడ్డి తీవ్రంగా నష్టపోయాడు. ఏడాది పొడవునా కష్టపడి సాగు చేసిన పంట కళ్లముందే కాలిపోవడంతో ఆర్థికంగా దెబ్బతిన్నాడు.

**ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకోలు**

విద్యుత్ షాక్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో రూ. 5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తుండటంతో, సంబంధిత అధికారులు పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి అంచనా వేయాలని రైతు కోరుతున్నాడు. నష్టపోయిన చెరుకు పంటతో పాటు డ్రిప్ పరికరాలకు కూడా పరిహారం అందించి, ప్రభుత్వం తనను ఆదుకోవాలని పెంటారెడ్డి విజ్ఞప్తి చేస్తున్నాడు.

# జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:**
అవసరమైన రోగులకు ఉచితంగా రక్తం అందించి ప్రాణాలను కాపాడేందుకు జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగిందని ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గాజుల మల్లికార్జున స్వామి తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన వారు, రక్తహీనతతో బాధపడుతున్న వారు, డయాలిసిస్ రోగులు, క్యాన్సర్ రోగులు, ప్రసవ సమయంలో అత్యవసరంగా రక్తం అవసరమైన వారు ఈ గ్రూప్ ద్వారా సంప్రదించి రక్తాన్ని పొందవచ్చని తెలిపారు. అలాగే బ్లడ్ డొనేషన్ క్యాంపుల్లో పాల్గొని రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మారాలని కోరారు. సహృదయులైన మిత్రులందరూ ఈ క్రింద ఇవ్వబడిన వాట్సాప్ గ్రూప్‌లో చేరి సహకరించాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గాజుల మల్లికార్జున స్వామి విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ జిల్లా నాయకులకు ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ విజయదశమి శుభాకాంక్షలు



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 24 :**
సంగారెడ్డి జిల్లా :- విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోణం విఠల్ పటేల్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమలై అంజిరెడ్డి గారిని, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు చేరువగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లేశం, శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పట్లోళ్ల సగుణాకర్, అశోక్ కుమార్, శివచందర్, కార్యవర్గ సభ్యులు వేముల రాములు, జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ యాదగిరి పటేల్, యువ మోర్చా నాయకులు సాయి పటేల్, అశోక్ పాల్గొన్నారు.

# సదాశివపల్లి పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



పాల్గొన్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సరోజ

**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 24:**
కౌడిపల్లి మండల పరిధిలోని సదాశివ పల్లి గ్రామం లోని ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాధికారి బాల్‌రాజు మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సరోజ సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. మండల విద్యాధికారి బాల్ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ కూడా సమయపాలన పాటించాలని, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరి చేయాలని, విద్యార్థుల మార్కులను ఆన్లైన్లో ఎంట్రీ చేయాలని సూచించారు. కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయు రాలు సరోజ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం!

- 313 ఇళ్లకు మంజూరు.. పూర్తయినవి 72 మాత్రమే!
- బిల్లులు అందక బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిన నిర్మాణాలు
- 27వ వార్డు కౌన్సిలర్ నామా స్రవంతి ఆగ్రహం



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:**
పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం కారణంగా అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 27వ వార్డు కౌన్సిలర్ నామా స్రవంతి విమర్శించారు. ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సరైన స్పందన లభించడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 37 వార్డుల లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన కోసం నెల రోజుల క్రితం ఆరుగురు అధికారులను నియమించగా, వారిలో ముగ్గురు మాత్రమే అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నారని నామా స్రవంతి ఆరోపించారు. ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాల పేరుతో లబ్ధిదారులను గందరగోళానికి గురిచేస్తూ, ఇళ్ల మంజూరు ప్రక్రియలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు.

**313 ఇళ్లకు మంజూరు.. 72 మాత్రమే పూర్తి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్ల పాలనలో జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 313 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు కేవలం 72 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారని ఆమె పేర్కొన్నారు. బిల్లులు సకాలంలో అందక కొంతమంది లబ్ధిదారులు బేస్‌మెంట్ స్థాయిలోనే నిర్మాణ పనులను నిలిపివేశారని తెలిపారు. మరోవైపు, ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల ఇళ్లను రద్దు చేసి, ఆ స్థానంలో అర్హులైన వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

**రెండో విడత జాబితాను వెంటనే విడుదల చేయాలి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్లు అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదని నామా స్రవంతి విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు రెండో విడత లబ్ధిదారుల జాబితాను విడుదల చేయాలని కోరారు. విధులకు సక్రమంగా హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకొని, వారి స్థానంలో కొత్త అధికారులను నియమించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రైతు సమస్యలపై బికేఎస్ ఉద్యమం

**సోమవారం మండల కేంద్రాల్లో నిరసన**





**సంగారెడ్డి వెలుతురు అక్టోబర్ 24:**
రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి ,ప్రధాన కార్యదర్శి పర్యాద రామకృష్ణారెడ్డి శనివారం పేర్కొన్నారు. ముఖ్యంగా లో వోల్టేజి సమస్యతో పంటలు ఎండిపోతు న్నాయని అన్నారు. దీనివల్ల రైతులు లక్షలాది రూపాయలను నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా లేదన్నారు. వరంగల్ డిక్లరేషన్ అమలులో నిర్లక్ష్యం వల్ల రైతులను మోసం చేసినట్టుగా తెలుస్తుంది అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ విషయంలో రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. చెరుకు టన్నుకుగాను ఐదువేల రూపాయలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్ ట్రాలీని వ్యవసాయ పనిముట్టుగా గుర్తించాలని, రిజిస్ట్రేషన్ ను ఎత్తివేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఇంకా పెండింగ్లో ఉన్నాయని వారు చెప్పారు. సోమవారం నాడు ఈ సమస్యలపై మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు, అంతేకాకుండా తహసీల్దార్లకు ఎక్కడికి అక్కడే వినతిపత్రం సమర్పిస్తామని భారతీయ కిసాన్ సాంగ్ నేతలు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రైతుల పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు సూచించారు.

# టీజీపీఎస్సీ పరీక్ష కేంద్రాల్లో సీపీ ఆకస్మిక తనిఖీలు

టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ సైంటిస్ట్, అనలిస్ట్ గ్రేడ్-2 ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరీంనగర్ నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల, హుజూరాబాద్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.
పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో నిబంధనల మేరకు సెక్షన్ 144 అమలు చేస్తూ, పరీక్షల నిర్వహణకు ఆటంకాలు కలగకుండా సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, బయోమెట్రిక్ విధానం, అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియలను సీపీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# హరీష్ రావును కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మహిళా నాయకులు

**మహిళా నాయకులను ఆప్యాయంగా పలకరించిన మాజీ మంత్రి**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం పిచారగాడ్ సహకార బ్యాంకు చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డితో కలిసి శనివారం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరీష్ రావు మహిళా నాయకుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి శాలువాలు కప్పి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ విజయదశమి పర్వదినం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, కర్షకులు సుఖసంతోషాలతో జీవించాలని, వ్యాపారవేత్తలకు మంచి లాభాలు చేకూరాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, పిచరేగాడి సహకార బ్యాంకు చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డితో పాటు మాజీ జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి



**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డాక్టర్లుగా ఉత్తమ వైద్య సేవలు అందించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులకు వైట్ కోట్లు అందజేసి అభినందించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సమాజంలో వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. వైద్య విద్య అభ్యసించేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందని, నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఈ అవకాశం వస్తుందని వివరించారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక వారి తల్లిదండ్రుల శ్రమ, ప్రోత్సాహం ఉంటాయన్నారు. వైద్యుల సేవలు చాలా కీలకమని స్పష్టం చేశారు. గర్భిణులు, పిల్లలు, వివిధ రోగాలతో బాధపడే వారికి వైద్యులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తారని కొనియాడారు. వైద్యులు తాము ఎంచుకున్న విభాగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా వైద్యులు కొందరికైనా ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆత్మసంతృప్తి ఉంటుందని తెలిపారు. వైద్యం, సేవల్లో మిగతావారికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వైద్యులు తమ ఆరోగ్యం, ఆహారంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సిరిసిల్ల వైద్య కళాశాల, బాలికల, బాలుర హాస్టళ్ల నిర్మాణ పనులను తాను పలుమార్లు సందర్శించానని గుర్తు చేశారు. ప్రస్తుతం బాలికల హాస్టల్ వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. మెడికల్ కాలేజీ, బాలుర హాస్టల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నిర్వాహకులు జిల్లా కలెక్టర్, ఎస్పీలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, తహసీల్దార్ మహేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సేవకు ప్రతిరూపం ఓంప్రకాష్

- 53 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచిన సామాజిక సేవకుడు
- డి. ఓంప్రకాష్‌ను శాలువాతో సన్మానించిన మునిగాల మణిక్ ప్రభు



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 24:**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో సామాజిక సేవకు ప్రతిరూపంగా నిలుస్తూ, ఉత్తమ రక్తదాతగా సేవలందిస్తున్న గౌరవ డాక్టరేట్ గ్రహీత డి. ఓంప్రకాష్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగాల మణిక్ ప్రభు అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మునిగాల మణిక్ ప్రభు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 53 సార్లు రక్తదానం చేసి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందికి రక్తాన్ని అందించి ప్రాణదాతగా నిలిచిన ఓంప్రకాష్ సేవలు అభినందనీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లి కూడా రక్తం అవసరమైన వారికి రక్తదానం చేస్తూ తన ఔదార్యాన్ని చాటుకున్నారని కొనియాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడంతో పాటు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి మరింత మందిలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ఓంప్రకాష్ చేస్తున్న సేవలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.
రక్తదానం మహాదానమని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని మునిగాల మణిక్ ప్రభు పిలుపునిచ్చారు. ఓంప్రకాష్ వంటి సేవాభావం కలిగిన వ్యక్తులను సమాజం గుర్తించి ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ వేంకటేశం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, ఉపాధ్యక్షులు దత్తా గౌడ్, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి యం.ఏ ఖైసర్, జర్నలిస్టులు ఓంప్రకాష్, భూమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బండలింగాపూర్‌లో ఆర్మీ జవాన్ పై దాడి



బండలింగాపూర్ గ్రామంలో ఆర్మీ జవాన్‌పై దాడి చేసిన కేసులో 14 మందిని అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ బి. సురేష్ బాబు, ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి. నవీన్ కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న రాత్రి వెల్లుల్ల గ్రామానికి చెందిన వన్నెల వికాస్‌పై బండలింగాపూర్ వాసులు దాడి చేశారనే కారణంతో వికాస్ స్నేహితులు సుమారు 30 మంది అర్ధరాత్రి తర్వాత బైకులపై బండలింగాపూర్‌కు వెళ్లారు. 23న తెల్లవారుజామున 1 గంటకు హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న వారి పక్క నుంచి వేగంగా వెళ్తుండగా, అక్కడే ఉన్న ఆర్మీ జవాన్ తిగుర్ల స్వామి ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో స్టీల్ కడియంతో ముఖంపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. జవాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, 24న ఉదయం ఇబ్రహీంపట్నం ఎక్స్ రోడ్డు వద్ద 14 మందిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరికొందరు పరారీలో ఉన్నారు.
అరెస్టయిన వారు : బావు రమేష్, తుపాకుల స్వామి, బావు అఖిల్, లక్కంపల్లి కార్తీక్, మర్రి నీరజ్, లక్కంపల్లి కళ్యాణ్, ఐలేని వంశీ, కల్లూరి మహేష్, కల్లూరి వంశీ, కాంతి విశాల్, బొబ్బిలి నాగరాజ్, పోచంపల్లి సాయి, మంచాల పవన్, కల్లూరి రవి. వీరిని అరెస్ట్ చేసి, నిందితుల నుంచి 14 సెల్‌ఫోన్లు, 7 బైకులు, ఒక స్టీల్ కడియం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడితే భవిష్యత్తు దెబ్బతింటుందని, ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌పై ప్రభావం పడుతుందని పోలీసులు హెచ్చరించారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని సూచించారు.

# విబిజి రామ్ జి బిల్లును రద్దు చేయాలి




**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు రాష్ట్ర కార్యవర్గ సమావేశం 24 10 2026 రాజు బదుర్గౌరాల్ మగ్దుంబం హిమాయత్ నగర్ లో కలకొండ కాంతాయ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు టి వెంకట రాములు గారు పాల్గొని మాట్లాడుతూ దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పకడిబందీగా అమలు చేయాలని వీపీజీ రామ్ జి బిల్లును రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని ఉపాధి కూలీలకు సంవత్సరానికి ?200 పని కల్పించి రోజుకు 700 రూపాయల వేతనం ఇవ్వాలని పనులు చేసే చోట మౌలిక వసతులు కల్పించాలని వారి డిమాండ్ చేశారు వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 6000 పెన్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్రంలో కాంగ్రెస ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేయలేదని భూమిలేని వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు మహిళలకు 2500 వృద్ధులపై పెంచను 4000 రూపాయలు ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు సరిగా చెల్లించాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎన్నిక గ్రామ సభల ద్వారా ఎన్నిక చేసి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు దేశంలో రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని వారన్నారు ఈ సమావేశంలో కే సుజన కుమార్ బుద్ధుల జంగయ్య ఏ బాబు సిహెచ్ వెంకన్న బి నరసింహ రేసు ఎల్లయ్య పూర్ణ అబ్రహం బి అశోక్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రమాదకర నేరస్థుడిపై పీడీ చట్టం ప్రయోగం



**సైబరాబాద్ వెలుతురు అక్టోబర్ 24:** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐ.పి.ఎస్., నాగారాజు రఘు వర్మ అలియాస్ నాగారాజు కార్తికేయ రఘు వర్మ అలియాస్ వంశీ అలియాస్ అల్లూరి విజయ రామ్ అలియాస్ కల్నల్ కార్తికేయ సింగ్ అనే ప్రమాదకరమైన, కుఖ్యాతి చెందిన నేరస్థుడిపై 'పీడీ చట్టం' ) ప్రయోగించారు. ఇతను భవిష్యత్తులో మరిన్ని నేరాలకు పాల్పడకుండా నిరోధించే ఉద్దేశంతో, ఇతనిని 'గూండా'గా పరిగణించి, మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేరస్థుడు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్‌కు వలస వచ్చిన ఇతను, మొదట్లో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత, సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో నేరాల బాట పట్టాడు. ఇతను పోలీసు అధికారిగా నటిస్తూ, బాధితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని నమ్మించి వారిని మోసం చేసేవాడు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భయపెట్టి, కేసుల నుండి కాపాడతామని చెప్పి డబ్బులు వసూలు చేసేవాడు. అంతేకాకుండా, వ్యక్తులను కిడ్నాప్ చేసి, తుపాకులు చూపించి వారి వద్ద ఉన్న నగదును దోచుకునేవాడు. 2017 నుండి 2026 మధ్య కాలంలో, ఇతను మోసం, కిడ్నాప్, దోపిడీ, బలవంతపు వసూళ్లు , నేరపూరిత బెదిరింపులు మరియు 'ఆర్మ్స్ యాక్ట్, 1959' (ఆయుధ చట్టం) కింద నమోదైన మొత్తం 14 నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలో కూడా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2021 మరియు 2024 సంవత్సరాల్లో ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించారు. అయితే, జైలు నుండి విడుదలైన తర్వాత కూడా ఇతను తన నేరపూరిత కార్యకలాపాలను కొనసాగించాడు. పోలీసు అధికారిగా నటిస్తూ కిడ్నాప్, బలవంతపు వసూళ్లు మరియు దోపిడీకి సంబంధించిన మరో నాలుగు కేసుల్లో ఇతను నిందితుడిగా ఉన్నాడు. తాజా కేసులకు సంబంధించి, సైబరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు ఇతనిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. గతంలో తీసుకున్న నివారణ చర్యలు (పీడీ చట్టం) ఉన్నప్పటికీ, ఇతను పదేపదే నేరాలకు పాల్పడుతుండటాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు, మరోసారి ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించి జైలులో ఉంచారు.

**అపరాధిగారి పేరు మరియు చిరునామా:**

నాగరాజు రఘు వర్మ ఏ నాగరాజు కార్తికేయ రఘు వర్మ ఏ వంశీ ఏ అల్లూరి విజయ రామ్ ఏ కల్నల్ కార్తికేయ సింగ్, తండ్రి నాగరాజు పద్మనాభరాజు పెద్దరాజు, వయస్సు: 29 సంవత్సరాలు, ఆంధ్ర ప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా, పోడూరు మండలం, స్వస్థలం.



## 88 గ్రాముల గంజాయి పట్టివేత..

తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాకాబందీ నిర్వహిస్తుండగా 88 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 22న రాత్రి 10.20 గంటల సమయంలో తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. మంగర్ బస్తీకి చెందిన లొండే ధోని (21), మా బాషా అలియాస్ బాబన్ (26), ఉపాధ్యాయ బాషా (32)లను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో లొండే ధోనిపై లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఓ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు తుకారాంగేట్ పోలీసులు వెల్లడించారు.



# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

నగరంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు భారీ డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేశారు. భోపాల్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రైవేట్ ప్రయాణికుల బస్సులో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ. 1.1 కోట్ల విలువైన 1.136 కిలోల మెథాంఫెటమిన్ అనే నిషేధిత డ్రగ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఖచ్చితమైన నిఘా సమాచారం మేరకు డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు ఈ ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రైవేట్ బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేయగా, స్లీపర్ బెర్త్‌ల పరుపుల కింద దాచి ఉంచిన నాలుగు అనుమానాస్పద ప్యాకెట్లను గుర్తించారు.

ఫీల్డ్ టెస్టింగ్ కిట్ ద్వారా నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో ఆ ప్యాకెట్లలో ఉన్నది మత్తు కలిగించే మెథాంఫెటమిన్ అని నిర్ధారణ అయింది. అధికారుల ప్రాథమిక విచారణలో సదరు స్లీపర్ బెర్త్‌లలో ప్రయాణించిన వ్యక్తులు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బస్సు ఎక్కి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో దిగిపోయినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు డ్రగ్స్‌ను బస్సులోనే వదిలి వెళ్లడంపై అధికారులు తీవ్రంగా ఆరా తీస్తున్నారు. పట్టుబడిన మెథాంఫెటమిన్‌ను ఎన్‌డీపీఎస్ చట్టం, 1985 కింద అధికారులు సీజ్ చేశారు. ఈ అంతర్రాష్ట్ర డ్రగ్ సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, నగరంలో ఈ సరుకును ఎవరికి డెలివరీ చేయాలనుకున్నారనే కోణంలో లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

# పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం




**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 24:** రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించి, ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం రాహత్ పథకం అమలుపై సమీక్షించారు. ఈ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే రోడ్డు ప్రమాద కేసులను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, బాధితుల వివరాల ధ్రువీకరణలో పోలీసులు తక్షణమే స్పందించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఆసుపత్రుల చికిత్స ఖర్చులకు సంబంధించిన క్లెయిమ్‌లను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆమోదించాలని, ఆసుపత్రులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు చికిత్సలో జాప్యం జరగకుండా చూడాలన్నారు.

నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారాన్ని నమోదు చేయడం, పథకం కింద క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పథకం అమలులో ఎదురయ్యే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ద్వారా అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, రహదారి భద్రతా లోపాలను సరిచేసి, అవసరమైన నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్య, ఆర్ అండ్ బి, ఎన్‌హెచ్‌ఏఐ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లు, ఆసుపత్రులు, ట్రామా సెంటర్ల సేవలను సమీక్షించాలని, సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవసరమైన ప్రక్రియలను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా నమోదైన కేసులు, ఆమోదించిన క్లెయిమ్‌లు, పెండింగ్ కేసులపై సమగ్ర నివేదిక సమర్పించాలని, అన్ని శాఖలు నెలవారీ పురోగతి నివేదికలు అందజేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్ అండ్ బి, రవాణా శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ జిల్లా కేంద్ర గ్రంథాలయం సందర్శన



**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 24:** బడంగ్‌పేట్‌లోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పాఠకులకు అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, గ్రంథాలయ నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో ఆమె మాట్లాడి, ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సన్నద్ధత గురించి ఆరా తీశారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు సరైన ప్రణాళికతో చదవడం, సమయపాలన పాటించడం, నిర్దిష్ట లక్ష్యంతో నిరంతరం సాధన చేయడం, అందుబాటులో ఉన్న పుస్తకాలు మరియు అధ్యయన సామగ్రిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వంటి అంశాలపై పాఠకులకు సూచనలు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ, ప్రస్తుత అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందించడంతో పాటు, వారి భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడే ముఖ్యమైన వేదికలని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయంలో పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పుస్తకాల లభ్యత, అధ్యయన వాతావరణం తదితర అంశాలను పరిశీలించారు. పాఠకులకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.జి.వి. రాణి, గ్రంథాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కన్న కూతురికి లొకేషన్ పంపి ఉరి వేసుకుని తండ్రి ఆత్మహత్య

### మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలో ఘటన.



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 24:** కౌడిపల్లి మండలంలోని తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వెంకాగోని నర్సింలు గౌడ్ (45) తన ఇద్దరి చెల్లెళ్ల పెళ్లిళ్లు, తాను నూతనంగా నిర్మించిన ఇంటికి అప్పులు చేశాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోయింది. తరచూ కుటుంబ సభ్యులతో అప్పు ఎలా తీర్చాలంటూ బాధపడేవాడు. అప్పులకు తోడు పెళ్లీడుకు వచ్చిన కూతురు కూడా ఉంది. ఇటీవల గండి మైసమ్మ సమీపంలోని గాగిల్లాపూర్ కు కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి కోసం వెళ్లాడు. శనివారం ఉదయం స్వగ్రామం తిమ్మాపూర్ కు వెళ్లి వస్తానని ఇంట్లో భార్య పిల్లలకు చెప్పి బయలుదేరాడు. ఇదే రోజు 9 గంటలకు మృతుడికి భార్య ఫోన్ చేస్తే కలవలేదు. తన మరిది వెంకాగౌని ఆంజనేయులుకు ఫోన్ చేసి నా భర్త గ్రామానికి వచ్చాడు ఏమైనా కనిపించాడా అని అడిగారు. ఇంతలోనే మృతుడు నర్సింలు గౌడ్ తిమ్మాపూర్ అటవీ ప్రాంతం నుంచి తన కూతురుకు లోకేషన్ తో పాటు బాయ్ అమ్ములు అంటూ వాట్సాప్ మెసేజ్ పెట్టాడు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసిన ఫోన్ ఎత్తలేదు. మరిది ఆంజనేయులుకు సమాచారం ఇవ్వడంతో అటవీ ప్రాంతంలో వెతుకుతుండగా ఓ చెట్టుకు కేబుల్ వైర్ తో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులకు తెలుపగా వచ్చి చూడగా చెట్టుకు ఉడి వేసుకుని వేలాడుతూ మృతి చెంది ఉన్నాడు. అప్పులు తీర్చలేకనే మనస్తాపం చెంది మృతి చెందాడని భార్య సంతోష కౌడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమరేందర్ రెడ్డి తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు."

# విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: కలెక్టర్




మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని శనివారం రైతు వేదికలో "కేత్ బచావో అభియాన్" ఎల్ ని నోపై రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో ఎల్ ని నో కారణంగా వర్షాబావ పరిస్థితులు ఏర్పడినందున భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి లభ్యత లేనందున రైతులు ఈ యాసంగి సీజన్లో వరి పంట సాగు చేయవద్దని, ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో ఎక్కువ లాభాలు పొందే ఆరు తడి పంటలు అపరాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్, పండ్లతోటలు, మల్బరీ, మునగ, పూలు, ఉల్లి, ఔషధ మొక్కలు, తదితర మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు వేయాలని, అందుకోసం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు సేకరించాలని కోరారు. మండల పరిధిలో 19 వేల 500 ఎకరాలలో సాగు భూమి ఉందని, మండల పరిధిలో రైతులు 9వేల 800 మంది ఉన్నారని, (78) ట్యాంకులు మండల పరిధిలో ఉన్నాయని నీటి లభ్యత తక్కువగా ఉందని, ప్రతి అంశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగు వైపు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయం అన్నారు. విద్యుత్తు, నీరును సంరక్షిస్తూ పొదుపుగా వినియోగించుకోవాలని ఇది ఒక ఉద్యమం లాగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని తెలిపారు, పంట మార్పిడి చేసి ఆదాయం పొందిన రైతులు గుగులోతు గణేష్ నాయక్, (బొప్పాయి), జక్కుల మహేష్, (పెసర), సుభాష్ చంద్రబోస్, (బెండ, టమాటా), నజీర్ పాషా (డ్రాగన్ ఫ్రూట్స్), వాంకుడోత్ విర్యా నాయక్, (ఆయిల్ పామ్), గార్ల సర్పంచ్ బానోతు పార్వతి, పది ఎకరాలలో పెసర్లు, తదితర పంటలు వేసిన వారితో స్వయంగా మాట్లాడుతూ వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు తెలియపరిచారు. విబిజి రామ్ జి గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు వారి వ్యవసాయ క్షేత్రాల వద్ద పంట కుంట, నీటి కుంట, ఊట కుంట, ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, అలాగే వ్యవసాయ, ఉద్యాన రంగానికి సంబంధించిన వివిధ సబ్సిడీ కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని రైతులు కచ్చితంగా వాటి వినియోగం ద్వారా ఆర్థిక లాభాలు పొందాలని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ సంవత్సరం యాసంగిలో వరి సాగు చేయకుండా ఇతర పంటల వైపు మొగ్గు చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ, విద్యుత్తు, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ, గ్రామీణ అభివృద్ధి, మిషన్ భగీరథ, సాగునీటి శాఖ, మల్యాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయల శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసిని తదితర విభాగాలకు చెందిన అధికారులు రైతులకు ప్రస్తుత పరిస్థితులను వివరించారు. అనంతరం ఆత్మ నిర్భర్ భారత్ పథకంలో భాగంగా రైతులకు ఉచితంగా పెసరు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న, పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఏడిఏ శ్రీనివాసరావు, ఈఈ మిషన్ భగీరథ పుష్పలత, విద్యుత్ శాఖ దర్శన్ కుమార్, స్థానిక సర్పంచ్ బానోతు పార్వతి, ఆత్మ సభ్యులు వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మండల అధికారి రామారావు, ఉద్యాన అధికారి శాంతి ప్రియ, శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసిని, అన్ని విభాగాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో యంగ్ ఇండియా స్కూల్‌కు భూమిపూజ

పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి--మోరపల్లి శివారులో 25 ఎకరాల్లో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమిపూజ ఏర్పాట్లను శనివారం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆదివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా నిర్వహించనున్న భూమిపూజకు సంబంధించిన సభాస్థలి, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2,500 మంది విద్యార్థులకు విద్య, వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. జగిత్యాలకు ప్రతిష్టాత్మక విద్యాసంస్థను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భూమిపూజ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, సర్పంచులు కట్ట రాజేందర్, బొలిశెట్టి గంగారెడ్డి, స్థానిక నాయకులు, రూరల్ సీఐ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

# వైద్యపరమైన రికార్డులను జాగ్రత్తగా భద్రపర్చాలి

వైద్య వృత్తిలో కొనసాగుతున్న వారు వైద్యపరమైన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, వాటిని జాగ్రత్తగా భద్రపర్చాలని జిల్లా జడ్జి జీ.వీ.ఎన్.భరతలక్ష్మి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు, వైద్య రంగ నిపుణులకు వివిధ అంశాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేయగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే తదితరులు పాల్గొన్నారు. వైద్యుల హక్కులు, వైద్య సేవల్లో చట్టపరమైన బాధ్యతలపై జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర వక్తలు ముఖ్య సూచనలు చేశారు. హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (ప్రివెన్షన్ ఆఫ్ వయలెన్స్) చట్టం--2025, వైద్య రికార్డుల నిర్వహణ, వాటి చట్టపరమైన ప్రాముఖ్యత, న్యాయపరమైన విచారణల్లో వాటి ప్రామాణికత తదితర అంశాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు. వైద్య సేవలందించే సమయంలో చట్టపరమైన నిబంధనలను పాటించడం, వైద్య రికార్డులను సక్రమంగా నిర్వహించడం, వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా వైద్యులు, రోగుల హక్కులను పరిరక్షించడంతో పాటు న్యాయ ప్రక్రియకు సహకారం అందించిన వారు అవుతారని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. న్యాయవ్యవస్థలో వైద్యులు భాగస్వాములుగా వ్యవహరించాల్సిన ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.నారాయణ, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని, ట్రైనీ కలెక్టర్ సురేష్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.సుభాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.విశాల్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, పాల్గొన్నారు.

# 2 బీహెచ్‌కే ఇండ్ల పట్టాల పంపిణీ చేసిన మంత్రి పొన్నం



అర్హులైన పేద ప్రజలకు రెండు పడక గదుల ఇండ్లను అందిస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం 2 బీహెచ్ కే ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కార్వాన్ శాసనసభ్యులు కౌసర్ మొహియుద్దీన్, బహద్దూర్ పురా శాసనసభ్యులు మొహమ్మద్ మోబీన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా లతో కలసి లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వం పేద కుటుంబాలందరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు . రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. మొదటి విడతలో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు , రెండో విడతలో మరో 2,000 ఇండ్ల చొప్పున మొత్తం 5,500 ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. అలాగే గుడిసెలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లను కేటాయించే కార్యక్రమాన్ని చేపట్టామని, అర్హతే ప్రామాణికంగా రాజకీయాలు, కులం, మతం వంటి భేదాలు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఉపాధి ఒకచోట, నివాసం మరొకచోట ఉండటం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ దిశగా ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకొని ఉపాధి చోటనే ఇళ్లను చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గతంలో నగరానికి దూరంగా నిర్మించిన ఇళ్లు ఉపాధి కేంద్రాలకు దూరంగా ఉండటంతో లబ్ధిదారులు వాటిలో నివసించలేక, ఇళ్లు ఖాళీగా ఉండి పాడైపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎకరం భూమి రూ. 100 కోట్ల నుంచి రూ. 150 కోట్ల వరకు విలువ చేసే ప్రాంతాల్లోనైనా అవసరాన్ని బట్టి పేదల ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లబ్ధిదారులు తమ నియోజకవర్గ పరిధిలోనే, ఉపాధి అవకాశాలకు దగ్గరగా నివసించేలా ఇందిరమ్మ అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి వేగవంతంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. బోనాల పండుగ నాటికి లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా కార్యాచరణ అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డులు పొందని వారు దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఆధారంగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతోపాటు, కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు.

### దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనాధ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తుకు గుర్తింపు కల్పించేందుకు యూడీఐడీ కార్డుల జారీ కార్యక్రమాన్ని కూడా చేపట్టామని చెప్పారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమం సహా వివిధ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 2300 యూ డి ఐ కార్డులు అలాగే ఇతర ధృవీకరణ పత్రాలను అందజేయటం జరిగిందని, వారి సంక్షేమానికి, సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యుడిఐ కార్డులను అనాధ పిల్లలకు అందచేసి ఉజ్వల భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ఎల్ నినో పరిస్థితులను ప్రస్తావిస్తూ రాబోయే 8 నెలల్లో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉందని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమలు చేపట్టడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్నటువంటి వనరులను పొదుపుగా వాడుకోవాలని ఇలా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న ఎండల నేపథ్యంలో ముఖ్యంగా తాగునీటి లభ్యత విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఇప్పటికే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని జరిగిందని పేర్కొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ రౌడీషీటర్ ఆబిద్ బిన్ ఖలీద్ అరెస్ట్



నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 36 కేసుల్లో పరారీలో ఉన్న మోస్ట్ వాంటెడ్ రౌడీషీటర్ అల్లబండ ప్రాంతానికి చెందిన ఆబిద్ బిన్ ఖలీద్ అలియాస్ ఆబిద్ అలియాస్ లల్లాను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేసి నిందితుడి వద్ద నుంచి పదునైన కత్తి, రిజిస్ట్రేషన్ లేని తెల్లని కలర్ బజాజ్ పల్సర్ ఎన్ ఎస్ 200 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ వి. తిరుపతి మంగళ్ హాట్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర , డిఐ మహేందర్ తో కలిసి శనివారం వివరాలను వెల్లడించారు. ఆర్.కె. పేట్‌లో పెరిగిన ఆబిద్, చెడు అలవాట్లకు బానిసై 7వ తరగతిలోనే చదువును నిలిపివేశాడు. వ్యసనాలు, చెడు సావాసాల వల్ల 2005 నుంచి నేరాలకు పాల్పడటం మొదలుపెట్టాడు. ఇప్పటివరకు ట్రై-కమిషనరేట్ (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 35కి పైగా తీవ్రమైన కేసుల్లో నిందితుడిగా ఉండి జైలుకు కూడా వెళ్లాడు. ఇతని నేర చరిత్రను దృష్టిలో ఉంచుకుని 2008లో మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు. అయితే నిందితుడు తరచుగా తన నివాస స్థలాన్ని మారుస్తుండటంతో ప్రస్తుతం ఇతని రౌడీషీట్‌ను మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్నారు. ఇతనిపై గతంలో మంగళ "హాట్ పిఎస్ పరిధిలో రెండుసార్లు, షాహినాయత్‌గంజ్ పిఎస్ పరిధిలో ఒకసారి.. మొత్తంగా మూడుసార్లు పి.డి. యాక్ట్ ప్రయోగించారు. అయితే గత ఆరు నెలలకు పైగా పోలీసుల కంటపడకుండా పరారీలో ఉన్న ఈ రౌడీషీటర్‌పై మంగళ్‌హాట్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. నిఘా వర్గాల విశ్వసనీయ సమాచారం మేరకు, అక్టోబర్ 23న ఆర్.కె. పేట్ జంక్షన్ వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న పదునైన కత్తిని, బైక్‌ను స్వాధీనం చేసుకుని, ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# కేటీఆర్ దుష్ప్రచార దందా బయటపెడతా!

- దుబాయ్ కేంద్రంగా సామాజిక మాధ్యమాల్లో బ్లాక్‌మెయిల్
- యూట్యూబ్ ఛానళ్లకు నెలకు రూ.1.08 కోట్ల ఖర్చు
- దమ్ముంటే నా ఆరోపణలకు సమాధానం చెప్పాలి
- రూపం మార్చుకుంటే రేవంత్‌లా సీఎం కాలేవు
- ఆధారాలతో బండారం బయటపెడతానన్న బల్మూర్ వెంకట్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుడు ప్రచారాన్ని ప్రోత్సహిస్తే సహించేది లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ హెచ్చరించారు. తనపై రాజకీయంగా ఎదుర్కోలేక కుటుంబం, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ప్రచారానికి సంబంధించిన అంశాలను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ తన హెయిర్ స్టైల్, గడ్డం, దుస్తుల శైలిని మార్చుకోవడం కంటే ముందుగా తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని వెంకట్ సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అనుకరిస్తే ఆయనలా ముఖ్యమంత్రి కాలేరని వ్యాఖ్యానించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నంత మాత్రాన నక్క పులి కాలేదని ఎద్దేవా చేశారు. దసరా పండుగ సందర్భంగా కొంత విరామం ఇచ్చానని, ఇకపై కేటీఆర్ వ్యవహారాలను వరుసగా బయటపెడుతూనే ఉంటానని అన్నారు. దుబాయ్ కేంద్రంగా కేటీఆర్, ఆయన బృందం సామాజిక మాధ్యమాల ద్వారా బ్లాక్‌మెయిల్, తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని బల్మూర్ వెంకట్ ఆరోపించారు. కొండూరి సంకేత్‌తో పాటు నితిన్, దిలీప్, అనిల్ తదితరుల పేర్లను ప్రస్తావిస్తూ, యూట్యూబ్ ఛానళ్లకు ప్రతి నెలా రూ. 1.08 కోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎలిగెంట్ కంపెనీ, డెక్కన్ సరాయ్ హోటల్ కేంద్రంగా నిధుల పంపిణీ జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని బయటపెడతానని చెప్పారు. తనపై ఇప్పటివరకు చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పే ధైర్యం కేటీఆర్‌కు లేదని విమర్శించారు. తాను చేసిన ఆరోపణలు అవాస్తవమైతే కేటీఆర్ స్వయంగా విలేకరుల సమావేశం నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. అవసరమైతే చట్టపరంగా ఎదుర్కోవాలని సూచించారు. పాఠశాల, కళాశాల రోజుల్లో స్నేహితులతో కలిసి దిగిన ఫొటోలను సైతం వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రచారం వల్ల ఇతర కుటుంబాలకు చెందిన పిల్లల వ్యక్తిగత చిత్రాలు కూడా దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాజీవితంలో ఉన్నవారి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. తాను ఒక యువకుడిగా, తెలంగాణ సగటు యువకుడి తరఫున సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రశ్నిస్తున్నానని తెలిపారు. రాజకీయ విమర్శలకు వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు సంబంధించిన అంశాలను ఆధారాలతో సహా బయటపెడితే ఆయన ప్రజల ముందు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని బల్మూర్ వెంకట్ వ్యాఖ్యానించారు.

## పార్కులను కాపాడిన హైడ్రా



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :**
రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామం ప్రశాంత్‌నగర్ కాలనీలో 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పార్కులను హైడ్రా కాపాడింది. 45 ఎకరాలు, 30 ఎకరాల పరిధిలో రెండు దశల్లో వేసిన లే ఔట్‌లలో మొత్తం 10 పార్కులు కేటాయించారు. హెచ్ ఎం డీ ఏ అనుమతి పొందిన లే ఔట్లలో 4 పార్కులు అన్యాక్రాంతం అయ్యాయి. ఒక పార్కును జీహెచ్ ఎంసీ అభివృద్ధి చేసింది. మిగతా పార్కులను కూడా కబ్జా చేసేందుకు చిన్న గదులను నిర్మించారు. ఇదే విషయమై ప్రశాంత్‌నగర్ కాలనీ నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పార్కింగ్ కోసం వినియోగించుకుంటూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి కబ్జాలను నిర్ధారించుకుంది. వెనువెంటనే 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పార్కులను కాపాడుతూ చర్యలు తీసుకుంది. షెడ్డులను తొలగించింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అలాగే కాపాడిన పార్కుల చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది.

### కరెంటు, సాగునీటి సమస్యలకు
## కాంగ్రెస్‌దే బాధ్యత : జగదీశ్‌రెడ్డి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం గురించి ముందుగానే తెలిసినా రైతులను అప్రమత్తం చేయలేదని ఆరోపించారు. ప్రజా సమ స్యలను పరిష్కరించకుండా కేసీఆర్, బీఆర్ఎస్‌ను తిట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శిం చారు. కేసీఆర్ నిర్మించిన యాదాద్రి విద్యుత్ కేంద్రం రాష్ట్రానికి కీలకమని, దాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్ ఇప్పుడు అదే కేంద్రంపై ఆధారపడు తోందన్నారు. సాగునీటి విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కన్నెపల్లి పంపుహౌస్ వద్దకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి వచ్చేందుకు సిద్ధమని, పంపులు ఎలా నడిపి నీటిని ఎత్తిపోయవచ్చో నిరూపిస్తానని సవాల్ విసిరారు. ప్రజలకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదని, భరోసా కల్పించే చర్యలని పేర్కొన్నారు.

విద్యుత్ కష్టాలకు కారణమైనందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## లక్షలాది మంది గ్రాడ్యుయేట్లు ఉన్నా 23 వేల దరఖాస్తులేనా?

- ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యంపై సోమవారం నిలదీస్తాం
- ఓటరు నమోదును వేగవంతం చేయండి : తలసాని



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :** ఇంటింటికీ వెళ్ళి అర్హులైన గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని మాజీమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా ముఖ్య నేతల సమావేశం తెలంగాణ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. నవంబర్ 6 వ తేదీతో ఓటరు నమోదు కార్యక్రమం గడువు ముగుస్తుందని అన్నారు. నవంబర్ 2023 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారితో పాటు గతంలో ఓటు వేసిన వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. గడువు సమీపిస్తున్నందున ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు అన్ని నియోజకవర్గాల్లో రేపు, ఎల్లుండి సమావేశాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఎన్నికల కమిషన్ తమ బాధ్యతలు నిర్వర్తించడంలో చిత్తశుద్ధి తో వ్యవహరించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ సమన్వయం తో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిర్వహించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అంతేకాకుండా గతంలో ఓటు వేసిన గ్రాడ్యుయేట్ లు కూడా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యం వల్లనే లక్షలాది మంది గ్రాడ్యుయేట్ లు ఉన్న హైదరాబాద్ లో ఇప్పటి వరకు కేవలం 23 వేల దరఖాస్తు లు మాత్రమే రావడం బాధాకరం అని విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి, తప్పిదాలపై సోమవారం బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం ఎన్నికల కమిషన్ ను కలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభి వాణిదేవి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీమంత్రి మహమూద్ అలీ, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ లు కోలేటి దామోదర్ గుప్త, మన్నె క్రిశాంక్, రావుల శ్రీధర్ రెడ్డి, గజ్జెల నగేష్, నియోజకవర్గ ఇంచార్జి లు ఆనంద్ గౌడ్, ఆజామ్, మాగంటి సునీత, సలా ఉద్దీన్ లోది, శ్యామ్ సుందర్ రెడ్డి, ఓటరు నమోదు కార్యక్రమం నియోజకవర్గ ఇంఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు పోటీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలి

- -నవంబర్ 6న జరగనున్న ఏఈఈ పరీక్ష వాయిదా వేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:**
తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయొద్దని, నవంబర్ 6న జరగనున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) పరీక్షను తక్షణమే వాయిదా వేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనాయకుడు హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. అదే తేదీన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జూనియర్ ఇంజినీర్ పరీక్ష, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏఈఈ పరీక్షలు ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశా లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ ఇంజినీర్ పరీక్ష రాసే అభ్యర్థులు తిరిగి తెలంగాణకు వచ్చి ఏఈఈ పరీక్ష రాయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన రెండు పోటీ పరీక్షల్లో ఒకదాన్ని వదులుకోవాల్సిన దుస్థితిలో నిరుద్యోగ యువత ఉందన్నారు. పరీక్షల తేదీలను మార్చాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్పందించలేదని విమర్శించారు. పరీక్షల తేదీలను పునఃపరిశీలించాలని అక్టోబర్ 14నే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కమిషన్‌కు లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. నిరుద్యోగ యువత ఉద్యోగాలు ఇవ్వకుండా పరీక్షలు వాయిదా వేయాలని కోరడం లేదని, రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని మాత్రమే అడుగుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒడిశా, బీహార్ వంటి రాష్ట్రాల్లో పరీక్షల తేదీలను మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దని హితవు పలికారు. వెంటనే జోక్యం చేసుకొని నవంబర్ 6న జరగనున్న ఏఈఈ (సివిల్) పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి గందరగోళం పునరావృతం కాకుండా ప్రభుత్వం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

### గాంధీ భవన్‌లో
## టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం చైర్మన్ అశోక్ గౌడ్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఏఐపిసి చైర్మెన్ మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రీ అనిల్,ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రాంమోహన్ రెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. సమావేశంలో లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కృష్ణాకాంత్ పార్కులో చెరువు విస్తరణకు హైడ్రా చర్యలు

- చెరువు పనులను ప్రారంభించిన హైడ్రా కమిషనర్
- 3 ఎకరాల చెరువును 12 ఎకరాలకు పెంచుతున్న హైడ్రా
- అమీర్‌పేట ప్రాంతాల్లో వరద కట్టడి లక్ష్యంగా పనులు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని కృష్ణాకాంత్ పార్కులో ఉన్న చెరువు విస్తరణ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి చెరువు అభివృద్ధి పనులకు కమిషనర్ శ్రీకారం చుట్టారు. గతంలో ఇక్కడ 27 ఎకరాల చెరువు ఉండేది. జూబ్లీహిల్స్, వెంకటగిరి, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల నుంచి పెద్దమొత్తంలో వచ్చే వరద నీరు ఈ చెరువుకు చేరేది. తర్వాత కాలంలో ఈ చెరువు ప్రాంతం కృష్ణాకాంత్ పార్కుగా అభివృద్ధి చేశారు. ఇందులో చెరువును కేవలం 3 ఎకరాలకు పరిమితం చేశారు. దీంతో 5 సెంటీమీటర్ల వర్షం పడితే కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట మైత్రేయివనం పరిసరాలను వరద ముంచెత్తడం సర్వ సాధారణంగా మారింది. ఇలాంటి తరుణంలో ఈ చెరువును అభివృద్ధి చేసి వరద కట్టడికి వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరద కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఈ క్రమంలో కృష్ణాకాంత్ పార్కులో ఉన్న చెరువును విస్తరించడంతో పాటు లోతు పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును 12 ఎకరాలకు విస్తరించాలని భావించారు. అయితే ఇందులో చెట్లను సురక్షితంగా.. శాస్త్రీయ పద్ధతిలో తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు ట్రీ ప్రొటెక్షన్ కమిటీ అనుమతులు లభించడంతో ఇక్కడ ఉన్న చెట్లను హైడ్రా అభివృద్ధి చేసిన సున్నం చెరువు చెంత నాటాలని నిర్ణయించారు. ఈ పనులు కూడా వెనువెంటనే మొదలౌతున్నాయి.

**పార్కు అందాలకు మరింత ఊతం**

ప్రస్తుతం కృష్ణాకాంత్ పార్కులో ఉన్న చెరువు మురుగు నీటి నిలయంగా మారింది. ఇక్కడ చెరువును అభివృద్ధి చేసి వరద నీటిని కట్టడి చేయడం వరకే హైడ్రా పరిమితం అవ్వడంలేదు. చెరువులోతును పెంచి వరద నీరు సులభంగా చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇన్‌లెట్లను అభివృద్ధి చేసి.. వరద నీరు చేరడం.. చెరువు నిండిన తర్వాత బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో ఈ చెరువుకు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సమకూరనున్నాయి. చెరువు చుట్టూ బండ్ నిర్మించడం.. పాత్‌వేను అభివృద్ధి చేయడం జరుగుతుంది. పార్కులో ఉన్న ఓపెన్ జిమ్‌కుతోడు అదనంగా మరో ఓపెన్ జిమ్ అందుబాటులోకి రానుంది. చెరువు చుట్టూ కూర్చునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గజబోలు, పిల్లల ప్లే ఏరియాను అభివృద్ధి చేస్తారు. చెరువు నీటిలోకి ఎవరూ వెళ్లడానికి వీలు లేకుండా.. ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. బోటు షికారుకు అనువైన వాతావరణం సమకూరనుంది. చెరువు సహజ లక్షణాలన్నీ సమకూర్చి.. భూగర్భ జలాలు ఆ ప్రాంతంలో పెరిగేలా హైడ్రా చర్యలు తీసుకుంటోంది.

## మున్నేరు-పాలేరు భూసేకరణ నిలిపివేయాలి



**మహబూబాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ నిర్మాణం కోసం ఐదో షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని గార్ల మండల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ సత్యవతి రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భూసేకరణకు సంబంధించిన జీవో నంబర్ 98/2025, జీవో నంబర్ 07/2026లను రద్దు చేయాలని రైతులు, అఖిలపక్ష నాయకులు కోరారు. గిరిజనుల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ముల్కనూర్ వద్ద మున్నేరు రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి జీవో నంబర్ 1076/2009 ప్రకారం పనులు ప్రారంభించి గిరిజన ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, భూములు, జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల ప్రయోజనాలను విస్మరించకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి భూసేకరణ సమస్యను పరిష్కరించాలని కోరారు. గిరిజనుల ప్రయోజనాలకు అనుగుణంగా న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## జూబ్లీహిల్స్-ఎన్‌ఎఫ్‌సీఎల్ కారిడార్ పనులు వేగవంతం చేయాలి

- -సిగ్నల్ రహిత ట్రాఫిక్ కోసం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాలు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :** జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు సిగ్నల్ రహిత ట్రాఫిక్ సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన 4. 3 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పురోగతిని ఆయన సీనియర్ అధికారులతో కలిసి సమీక్షించారు. కేబీఆర్ పార్కు పరిసరాల్లో వన్‌వే ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు పార్కు ప్రధాన ప్రవేశ ద్వారం, అగర్సేన్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కేబీఆర్ పార్కు చుట్టూ విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల మార్పిడి కోసం టీజీఎస్‌పీడీసీఎల్‌తో తక్షణమే సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ముగ్ధ జంక్షన్ నుంచి ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు ఫౌండేషన్ రూపకల్పనకు అవసరమైన భూగర్భ సాంకేతిక పరిశోధనలను వేగవంతం చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముగ్ధ జంక్షన్ మధ్య పునాదుల తవ్వకాలు, నిర్మాణానికి అవసరమైన ఉక్కు భాగాల తయారీ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## 1800 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :** సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్, మచ్చబొల్లారం జొన్నబండ ప్రాంతంలో ఉన్న శ్రీ గణేష్ ఎన్‌క్లేవ్ కాలనీలో సుమారు 1800 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబర్లు 17, 33, 34 పరిధిలో ఉన్న శ్రీ గణేష్ ఎన్‌క్లేవ్ కాలనీలో గ్రామ పంచాయతీ ఆమోదించిన లేఅవుట్ ప్రకారం ప్రజా అవసరాల కోసం 1800 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే కొందరు వ్యక్తులు ఈ స్థలాన్ని ఆక్రమించి, పక్కనే ఉన్న సర్వే నంబర్లతో కలిపి తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో కాలనీకి చెందిన వారు లేఅవుట్ అనుమతి పత్రాలు, 1969 నాటి లింక్ డాక్యుమెంట్లు, 1981 నాటి జీపీఏ పత్రాలు, భువన్ శాటిలైట్ చిత్రాలు, సర్వే రికార్డులతో హైడ్రాను ఆశ్రయించారు. ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు సంబంధిత రికార్డులు, లేఅవుట్ పత్రాలను పరిశీలించి పార్కు స్థలాన్ని ఆక్రమణల నుంచి పరిరక్షించారు. ప్రజల కోసం కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టారు.

## కళకు సంకెళ్లు వేయడం
# ప్రజాస్వామ్యానికి మంచిది కాదు

- కళకు సంకెళ్లు వేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు
- యువత గొంతుకను, కళాకారుల భావప్రకటన స్వేచ్ఛను గౌరవించాలి
- రైహాన్ వాద్రా చిత్రాల తొలగింపుపై సమగ్ర చర్చ జరగాలి: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 24, 2026:** న్యూఢిల్లీ బికనీర్ హౌస్‌లో యువ కళాకారుడు, ఫోటోగ్రాఫర్ రైహాన్ వాద్రా నిర్వహించిన "చీశీ ×ంము ×ం ఖీఅఱఅశ్రీ" కళా ప్రదర్శనలో విద్యార్థులు, యువత చేపట్టిన నిరసన ఉద్యమాలకు సంబంధించిన అనేక ఫోటోలను తొలగించాలని నిర్వాహకులు కోరిన ఘటన కళా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, పౌరుల భావప్రకటన హక్కులపై విస్తృత చర్చకు దారితీసిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కుమారుడైన రైహాన్ వాద్రా, రాజకీయాల్లోకి ప్రవేశించాలనే ఉద్దేశంతో కాకుండా, తన కళాత్మక దృష్టితో సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఫోటోగ్రఫీ ద్వారా ప్రజల ముందుకు తీసుకురావాలనే ప్రయత్నం చేశారని ఆయన పేర్కొన్నారు.

**కళ కేవలం అందాన్ని చూపించడానికే పరిమితం కాదు**

కళ అనేది ప్రకృతి సౌందర్యాన్ని, పూలను, పక్షులను, అందమైన దృశ్యాలను మాత్రమే చూపించే సాధనం కాదు. సమాజంలో చోటుచేసుకునే మార్పులు, ప్రజల భావోద్వేగాలు, యువత ఆకాంక్షలు, సామాజిక సంఘర్షణలు, నిరసనలు, ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగే పోరాటాలు కూడా కళలో భాగమే. ఒక ఫోటోగ్రాఫర్ తన కెమెరా ద్వారా సమాజాన్ని పరిశీలించి, తాను ప్రత్యక్షంగా చూసిన సంఘటనలను చిత్రాల రూపంలో భద్రపరుస్తాడు. ఒక ఉద్యమంలో పాల్గొంటున్న ప్రజల ముఖాల్లో కనిపించే ఆవేదన, న్యాయం కోసం నిలబడిన యువత ధైర్యం, ప్రజల ఐక్యత, రాజ్యాంగ విలువలపై వారి విశ్వాసం వంటి అంశాలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. రైహాన్ వాద్రా తన No Idea Is Final ప్రదర్శనలో ప్రకృతి, వన్యప్రాణులు, అమూర్త కళాచిత్రాలతో పాటు ఇటీవలి నెలల్లో ఢిల్లీలో చోటుచేసుకున్న యువత, విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫోటోలను కూడా ప్రదర్శించాలనుకున్నారు. ఈ చిత్రాలను కేవలం రాజకీయ వ్యాఖ్యానంగా కాకుండా, తాను చూసిన సామాజిక వాస్తవాలను కళాత్మకంగా నమోదు చేసే ప్రయత్నంగా ఆయన వివరించారు.

**105 ఫోటోలలో 74--75 ఫోటోల తొలగింపు వివాదం**

వార్తా కథనాల ప్రకారం, అక్టోబర్ 21న ప్రారంభం కావాల్సిన ఈ ప్రదర్శనకు కొద్ది గంటల ముందు, మొత్తం 105 ఫోటోలలో సుమారు 74--75 ఫోటోలను తొలగించాలని బికనీర్ హౌస్ యాజమాన్యం కోరినట్లు రైహాన్ వాద్రా వెల్లడించారు. తొలగించాలని సూచించిన చిత్రాల్లో ఢిల్లీలో జరిగిన యువత, విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫోటోలు అధికంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రదర్శనలోని కొన్ని చిత్రాలు తమ సంస్థ విధానాలకు అనుగుణంగా లేవని బికనీర్ హౌస్ యాజమాన్యం పేర్కొన్నప్పటికీ, ఏయే ఫోటోలు ఏ నిర్దిష్ట నిబంధనను ఉల్లంఘించాయనే అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చర్చ జరుగుతోంది. ఈ సంఘటనలో ప్రధానంగా పరిశీలించాల్సిన ప్రశ్న ఏమిటంటే --- ఒక ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాంస్కృతిక ప్రాంగణంలో కళా ప్రదర్శనకు అనుమతి ఇచ్చిన తరువాత, ప్రారంభానికి కొన్ని గంటల ముందు సామాజిక ఉద్యమాలను ప్రతిబింబించే చిత్రాలను తొలగించాలని కోరడం ఎంతవరకు సమంజసం? ఒక కళాఖండం నిజంగా నిబంధనలను ఉల్లంఘిస్తే, దానికి సంబంధించిన స్పష్టమైన కారణాలను ముందుగానే తెలియజేసి, కళాకారుడికి తన వాదనను వినిపించే అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదా? ఇక్కడ జరిగిన పరిణామాలపై సమగ్ర వివరణ ఇవ్వడం, సంబంధిత విధానాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయడం నిర్వాహకుల బాధ్యత అని పి. ప్రసన్న కుమార్ శర్మ అభిప్రాయపడ్డారు.

**ప్రజా ఉద్యమాలను చిత్రీకరించడం నేరం కాదు**

ప్రజాస్వామ్యంలో ప్రజలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉంది. విద్యార్థులు, యువత తమ సమస్యలపై నిరసనలు చేపట్టడం, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, తమ డిమాండ్ల కోసం శాంతియుతంగా ఉద్యమించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. అటువంటి సంఘటనలను ఒక ఫోటోగ్రాఫర్ చిత్రీకరించడం, వాటిని భవిష్యత్తు తరాల కోసం భద్రపరచడం కూడా సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. చరిత్రలో అనేక ప్రజా ఉద్యమాలు ఫోటోలు, వార్తా కథనాలు, చిత్రకళ, సాహిత్యం ద్వారా ప్రజలకు చేరాయి. ఆ దృశ్యాలు ఆయా కాలాల్లోని సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సహాయపడ్డాయి. అయితే, ఒక ఫోటోలో కనిపించే దృశ్యాన్ని బట్టి మాత్రమే మొత్తం ఉద్యమాన్ని లేదా దానిలో పాల్గొన్న ప్రతి వ్యక్తి ఉద్దేశాన్ని నిర్ణయించలేము. అదే విధంగా, రాజకీయంగా సున్నితమైన అంశాన్ని చూపించే ప్రతి చిత్రాన్ని రాజకీయ ప్రచారంగా పరిగణించడం కూడా సరైన పద్ధతి కాదు. చిత్రాల సందర్భం, కళాకారుడి ఉద్దేశం, ప్రదర్శన స్వభావం, వర్తించే నిబంధనలను సమగ్రంగా పరిశీలించాలి.

**ప్రభుత్వ సంస్థలకు బాధ్యత ఉంది - కళాకారులకు కూడా హక్కులున్నాయి**

ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాంస్కృతిక సంస్థలు కళాకారులకు వేదిక కల్పించడమే కాకుండా, పారదర్శకమైన నియమాలను పాటించాలి. ఏదైనా కళాఖండాన్ని ప్రదర్శించకూడదని నిర్ణయిస్తే, దానికి వర్తించే నిబంధనను స్పష్టంగా వివరించాలి. కళాకారుడికి తన అభిప్రాయాన్ని తెలియజేసే అవకాశం కల్పించాలి. వివాదాస్పద అంశాలను తొలగించాలనే నిర్ణయాలు ఏకపక్షంగా కాకుండా, సముచితమైన ప్రక్రియ ద్వారా తీసుకోవాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఋ) పౌరులకు భావప్రకటన స్వేచ్ఛను కల్పిస్తుంది. అయితే, ఆర్టికల్ 19(2) ప్రకారం రాజ్యాంగబద్ధమైన నిర్దిష్ట కారణాలపై చట్టం విధించే సముచిత పరిమితులకు కూడా అవకాశం ఉంది. కాబట్టి కళా స్వేచ్ఛను గౌరవించడం ఎంత ముఖ్యమో, చట్టబద్ధమైన నిబంధనలను పారదర్శకంగా, న్యాయబద్ధంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో, రైహాన్ వాద్రా ప్రదర్శనలో జరిగిన పరిణామాలపై సంబంధిత యాజమాన్యం పూర్తి వివరణ ఇవ్వాలి. ప్రదర్శనకు సంబంధించిన విధానాలు, అభ్యంతరాలకు కారణాలు, చిత్రాల తొలగింపు ప్రక్రియను ప్రజలకు తెలియజేయాలి. కళాకారుల హక్కులు, ప్రభుత్వ సంస్థల బాధ్యతలు రెండింటినీ గౌరవించే విధంగా ఈ వివాదానికి పరిష్కారం కనుగొనాలి.

**యువత గొంతుక వినిపించాలి - ప్రజాస్వామ్య చర్చ కొనసాగాలి**

భారతదేశ యువత దేశ భవిష్యత్తుకు పునాది. వారి ఆశలు, ఆందోళనలు, ప్రశ్నలు, నిరసనలు ప్రజాస్వామ్య చర్చలో భాగం కావాలి. ఒక యువ కళాకారుడు తన కళ్లతో చూసిన సమాజాన్ని చిత్రాల ద్వారా ప్రజలకు చూపించాలనుకున్నప్పుడు, ఆ ప్రయత్నాన్ని ముందుగానే రాజకీయ కోణంలో మాత్రమే చూడకుండా, కళాత్మక స్వేచ్ఛ మరియు ప్రజా ప్రయోజనం అనే కోణాల్లో కూడా పరిశీలించాలి. ఈ వివాదం ఏ ఒక్క కళాకారుడికి లేదా రాజకీయ కుటుంబానికి సంబంధించిన అంశంగా మాత్రమే మిగిలిపోకూడదు. దేశంలోని కళాకారులు, ఫోటోగ్రాఫర్లు, రచయితలు, జర్నలిస్టులు తమ అనుభవాలను భయాందోళనలు లేకుండా వ్యక్తపరచగల వాతావరణం ఎలా ఉండాలనే విషయంపై విస్తృత చర్చకు ఇది అవకాశంగా మారాలి. ప్రజాస్వామ్యం అంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును గౌరవించడం, భిన్నాభిప్రాయాలను వినడం, విమర్శలకు సమాధానం చెప్పడం. కళను ఒకే కోణంలో చూడకుండా, సమాజంలోని విభిన్న అనుభవాలను ప్రతిబింబించే మాధ్యమంగా అర్థం చేసుకోవాలి. కళాకారుడి కెమెరా సమాజాన్ని నమోదు చేస్తుంది; ఆ చిత్రాలపై చర్చ జరగవచ్చు, అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. కానీ వాటిని ప్రదర్శించకూడదనే నిర్ణయానికి స్పష్టమైన కారణాలు, పారదర్శకమైన ప్రక్రియ ఉండాలి. యువత స్వరాన్ని వినడం, కళా స్వేచ్ఛను గౌరవించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం మనందరి బాధ్యత అని పి. ప్రసన్నకుమార్ శర్మ అన్నారు.

## అక్టోబర్ 31న
# సమూహ యువసాహిత్యోత్సవం-2026




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:** సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ నెల 31న హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో 'సమూహ యువసాహిత్యోత్సవం --2026' నిర్వహించనున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా 'గోడల్ని ఛేదిద్దాం' (వర్డ్స్ ఎగైనెస్ట్ వాల్స్) అనే ఇతివృత్తంతో ఉత్సవాలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఐదు చర్చా సమావేశాలు, యువ కవిసమ్మేళనం, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

**ఆధిపత్య వ్యవస్థలు -- సంస్కృతి నిర్మాణం**

తొలి సమావేశం 'సంస్కృతి--ఆధిపత్య వ్యవస్థలు' అంశంపై జరగనుంది. సంస్కృతి నిర్మాణంలో కులం, లింగ వివక్ష, కుటుంబం, మతం, భాష, రాజ్యం వంటి వ్యవస్థల పాత్ర, ప్రజాస్వామిక సంస్కృతి నిర్మాణానికి ఎదురవుతున్న అవరోధాలు, వాటిని అధిగమించే మార్గాలపై చర్చిస్తారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి స్వాగతంతో ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఆచార్య సూర్యా ధనంజయ్ గౌరవ అతిథిగా హాజరవుతారు. స్కై బాబా సమన్వయం చేయగా, బీబీసీ తెలుగు ఎడిటర్ జి.ఎస్. రామ్మోహన్ చర్చను ప్రారంభిస్తారు. ఎం.ఎం. వినోదిని, చల్లపల్లి స్వరూపరాణి, రచన ముద్రబోయిన, జాబాలి, అఖిల్ సూర్య పాల్గొంటారు. గుడిపల్లి నిరంజన్ సమావేశాన్ని నిర్వహిస్తారు.

**డిజిటల్ మాధ్యమాలు -- అసమ్మతి స్వరాలు**

రెండో సమావేశంలో డిజిటల్ మాధ్యమాల పాత్ర, అసమ్మతి స్వరాలకు ఎదురవుతున్న సవాళ్లపై చర్చిస్తారు. ప్రధాన స్రవంతి మీడియాలో ప్రజాభిప్రాయాలకు, ఉద్యమ స్వరాలకు తగిన ప్రాధాన్యం లభించని పరిస్థితుల్లో డిజిటల్ వేదికలు ప్రత్యామ్నాయాలుగా ఎలా ఎదుగుతున్నాయి, వాటిపైనా అణచివేత ప్రయత్నాలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలను చర్చకు తీసుకురానున్నారు. కె.వి. కూర్మనాథ్ మోడరేటర్‌గా వ్యవహరించగా, రవీశా చర్చను ప్రారంభిస్తారు. తులసి చందు, ముద్దం స్వామి, సుమేరా, విప్లవ శ్రీనిధి పాల్గొంటారు. సిద్ధంకి యాదగిరి సమావేశాన్ని నిర్వహిస్తారు.

**కొత్తతరం -- సాహిత్య స్వరం**

మూడో సమావేశం 'కొత్తతరం--సాహిత్య స్వరం' అంశంపై జరగనుంది. నేటి యువత సాహిత్య ఆకాంక్షలు, సృజనాత్మక ప్రయోగాలు, కొత్తతరం రచనా ధోరణులపై చర్చిస్తారు. శివన్నగారి చంద్రయ్య మోడరేటర్‌గా వ్యవహరించనుండగా, వేణు ఉడుగుల చర్చను ప్రారంభిస్తారు. జయలక్ష్మి, ఎ. సందీప్ పోటారికారి, స్వప్న కొండమడుగు, చీకొండ్ర రవి, సూర్యచంద్ర తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. హాథీరాం సభావట్ సమావేశాన్ని నిర్వహిస్తారు.

చదువుల మేనిఫెస్టో -- మేమెక్కడ?

నాలుగో సమావేశంలో నూతన విద్యావిధానం, విద్యావ్యవస్థను బలహీనపరిచే విధానాలు, పరీక్షల నిర్వహణలో పాలనా వైఫల్యాలు, విద్యారంగంలో మార్పుల కోసం యువత చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చిస్తారు. క్రాంతి మోడరేటర్‌గా వ్యవహరించనుండగా, ఇబ్రహీం నిర్గుణ సమావేశాన్ని నిర్వహిస్తారు. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి ప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశంలో ఆచార్య భంగ్యా భూక్యా ప్రసంగిస్తారు.

**ప్రదర్శన కళలు -- సామాజిక మార్పు**

ఐదో సమావేశంలో భాగంగా అజయ్ మంకెనపల్లి బృందం వీధి నాటక ప్రదర్శన ఇవ్వనుంది. ప్రదర్శన అనంతరం నిర్మల, ధీరజ్ రావణ్ తేజా స్పందనలు తెలియజేస్తారు. మెర్సీ మార్గరెట్, కుంజ కళ్యాణి ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు.

**యువ కవుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు**

సాయంత్రం ఆర్. సీతారాం, గాజోజు నాగభూషణం, రూపరుక్మిణి నిర్వహణలో యువ కవిసమ్మేళనం జరగనుంది. సుమారు 40 మంది యువ కవులు ఇందులో పాల్గొంటారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. గడ్డం మల్లేశం ఆత్మీయ సందేశం అందిస్తారు. అనంతరం పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు, ఉదయమిత్ర నిర్వహణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. రేలారే ప్రసాద్, అందె దప్పు భాస్కర్, అరుణోదయ బృందానికి చెందిన రాకేష్ తదితర గాయకులు, కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. లౌకిక, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న యువత, రచయితలు, కవులు, కళాకారులు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని యువసాహిత్యోత్సవాన్ని విజయవంతం చేయాలని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆహ్వానించింది.

**మరిన్ని వివరాలకు సంప్రదించండి:**
**మెర్సీ మార్గరెట్, కొల్లాపురం విమల, ఎ. కె. ప్రభాకర్**
**9052809952, 9848098333, 76800 55766**

## గ్రామాల వారీగా అభివృద్ధిపై
# మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష



- ప్రతి గ్రామానికి 20 నిమిషాల సమయం కేటాయించి సమస్యలపై చర్చ..
- అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



**ఆత్మకూరు వెలుతురు అక్టోబర్ 24:** మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి, ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా 20 నిమిషాల సమయం కేటాయించి, గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలు, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల ప్రాధాన్యతలను గుర్తించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ సమావేశాలు నిర్వహించారు. గ్రామాల సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టి సారించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోవడం ద్వారా అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిచ్చి ప్రజల అవసరాలకనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# పారదర్శకంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

- బహదూర్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల్లో 216 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసిన మంత్రి పొన్నం
- వచ్చే ఆషాఢ మాసంలోపు హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం
- ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి పొంచి ఉంది.. నీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :** నిరుపేద కుటుంబాలకు ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో శనివారం బహదూర్‌పురా, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన 216 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలు, పట్టాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం అవిభక్త కవలలు వీణ, వాణిలతోవాణిలతోపాటు అనాథ పిల్లలకు ప్రత్యేక వైకల్య గుర్తింపు (యూడీఐడీ) కార్డులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబీన్, కౌసర్ మొహియుద్దీన్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

216 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు

బహదూర్‌పురా నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారుల కోసం ఫారూఖ్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో 136 ఇళ్లను కేటాయించగా, కార్వాన్ నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్, గోల్కొండ, షేక్‌పేట మండలాల పరిధిలోని లబ్ధిదారుల కోసం మల్లాపూర్--బాలాపూర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో 80 ఇళ్లను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు**

ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి దశలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, రెండో దశలో 2,000 ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యమిస్తూ ఇళ్లను కేటాయిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే ఆషాఢ మాసంలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. నగరంలో విలువైన స్థలాల్లో నివసిస్తున్న అర్హులకు ఆయా నియోజకవర్గాల్లోనే ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భూమి ఉన్న అర్హులైన పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లను అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ప్రజా సంక్షేమానికి పెద్దపీట**

అర్హులైన ప్రతి ఒక్కరూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారందరికీ కార్డులు అందిస్తామని మంత్రి సూచించారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. మహిళలు ఇప్పటివరకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 12,888 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని తెలిపారు. మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తూ, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

**ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రజలంతా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారని తెలిపారు. నీటి ఎద్దడితో పాటు విద్యుత్ సరఫరాపైనా ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, వాడిన నీటిని తిరిగి ఉపయోగించుకునే విధానాలను పాటించాలని సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడంతో పాటు వర్షపు నీటి సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పేదలకు ఇళ్లను అందించడం నుంచి మహిళల సంక్షేమం, విద్యుత్, ఆరోగ్య సేవల వరకు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు.

## వైభవంగా సంగారెడ్డి
# సాయిబాబా ఆలయ రజతోత్సవాలు



**సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 24 :** సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సాయిబాబా ఆలయం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రజతోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ పర్యవేక్షణలో, జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో మూడు రోజులపాటు యజ్ఞయాగాదులు, కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లికి చెందిన నరేష్ పంతులు నేతృత్వంలో 30 మంది వేద పండితులు ఈ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదటి రోజు సుదర్శన యాగం, రెండో రోజు శత కలశాభిషేకం, మూడో రోజు శిఖర కుంభాభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన పూజలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూడో రోజు జరిగిన శిఖర కుంభాభిషేకంలో నిర్మల జగ్గారెడ్డి పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్యులు టీ. కాశప్ప, కేవీ నర్సయ్య, ఎస్. వీరేందర్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 22 ఏళ్ల తర్వాత
# ఒక్కచోట చేరిన విద్య పూర్వ విద్యార్థులు

**తీపి జ్ఞాపకాలతో ఆత్మీయ సమ్మేళనం.. గురువులకు కృతజ్ఞతలు**



**ఖమ్మం వెలుతురు అక్టోబర్ 24 :** ఖమ్మం పట్టణంలోని శ్రీ విద్య ఇంటర్ కాలేజీ 2002--2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార మ్మ తల్లి ఆలయం సమీపంలోని అనుమూల దశవం త్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి తమ కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో కలిసి చదువుకున్న రోజులు, స్నేహితులతో గడిపిన క్షణాలు, పండుగ సెలవుల్లో ఆటపాటలతో గడిపిన సమయం, కళాశాలలో జరిగిన వివిధ కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. సెల్‌ఫోన్లు, ఆధునిక డిజిటల్ పరికరాలు అందుబాటులో లేని రోజుల్లో చదువుకే ప్రాధాన్యతనిస్తూ, స్నేహబంధా లకు విలువనిస్తూ గడిపిన కాలాన్ని గుర్తుచేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. కొత్త సినిమాలు విడుదలైన ప్పుడు స్నేహితులంతా కలిసి సినిమాలకు వెళ్లిన సందర్భాలు, కళాశాలలో చేసిన సరదాలు, అప్పటి విద్యావిధానం, ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు ఉన్న గౌరవం వంటి అంశాలను పరస్పరం పంచుకున్నారు. అప్పట్లో నిర్వహించిన విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు తమలోని ప్రతిభను వెలికితీసి, మేధాశక్తిని పెంపొందించేందుకు దోహద పడ్డాయని పేర్కొన్నారు. తమ జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గనిర్దేశం చేసిన ఉపా ధ్యాయులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకున్నారు. గురువులు అందించిన విద్యాబోధన, క్రమశిక్షణ, విలువలు తమ ప్రస్తుత జీవితానికి ఎంతో ఉపయోగపడు తున్నాయని తెలిపారు. 2002--2004 బ్యాచ్‌కు చెందిన పలువురు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ రంగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని, కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. పాత స్నేహాలను పునరుద్ధరించుకుంటూ, భవిష్యత్తు లోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించు కోవాలని ఆకాంక్షించారు.

# రక్షణ రంగానికి తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

- దేశ రక్షణ పరిశ్రమకు అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా రాష్ట్రం
- పెట్టుబడి ప్రణాళికలను రెట్టింపు చేయండి.. పూర్తి సహకారం అందిస్తాం
- త్వరలో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 విడుదల
- కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- పరిశ్రమలతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి : భట్టి
- రక్షణ, ఏరోస్పేస్ పెట్టుబడులకు తెలంగాణకు రండి : ఉత్తమ్
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో రక్షా ఎక్స్‌పో




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24**

భారతదేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణను అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రక్షణ, అంతరిక్ష, ఏరోస్పేస్, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, డ్రోన్ సాంకేతిక రంగాల్లో పెట్టుబడులను రెట్టింపు చేయాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో నిర్వహించిన రక్షా ఎక్స్‌పో–-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. రక్షణ రంగానికి చెందిన అంతర్జాతీయ సంస్థలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావడమే రక్షా ఎక్స్‌పో లక్ష్యమన్నారు. హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరమని, డీఆర్‌డీఓ, హెచ్‌ఏఎల్, బీడీఎల్, మిధాని వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలకు నిలయమని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండంలో నౌకాదళానికి సంబంధించిన అత్యంత తక్కువ పౌనఃపున్యాల సమాచార ప్రసార కేంద్రం నిర్మాణంలో ఉందన్నారు.

### త్వరలో నూతన రక్షణ విధానం

యుద్ధ సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ప్రపంచానికి రక్షణ సాంకేతికతను ఎగుమతి చేసే శక్తిగా భారత్ ఎదగాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా త్వరలో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 విడుదల చేస్తామని ప్రకటించారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 2047 నాటికి 10 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో విధానపరమైన ప్రతిష్టంభన లేదని, రాజకీయ భేదాభిప్రాయాలున్నా పెట్టుబడులు, అభివృద్ధి విషయంలో విభేదాలకు తావులేదని స్పష్టం చేశారు.

### పెట్టుబడులతో పాటు ఉపాధి పెరగాలి: భట్టి

పెట్టుబడుల ప్రకటనలతోనే అభివృద్ధి పూర్తికాదని, స్థానిక యువతకు ఉద్యోగాలు, చిన్న పరిశ్రమలకు ఆర్డర్లు, కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి లభించినప్పుడే అసలైన ప్రయోజనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్, వేగవంతమైన అనుమతులు, పారదర్శక విధానాలు అందించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు అప్రెంటిస్‌షిప్‌లు, తొలి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

### రక్షణ పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం : ఉత్తమ్

అంతర్జాతీయ రక్షణ పరిశ్రమల సరఫరా వ్యవస్థలో హైదరాబాద్ కీలక స్థానానికి చేరుకుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, ఎయిర్‌బస్, సాఫ్రాన్, టాటా వంటి సంస్థల కార్యకలాపాలు రాష్ట్ర పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు. తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023–24లో రూ.15,900 కోట్లు ఉండగా, తాజా గణాంకాల ప్రకారం రూ.32,850 కోట్లకు చేరాయని వెల్లడించారు. రక్షా ఎక్స్‌పో ద్వారా మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, 90కిపైగా దేశీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# రైల్వే బ్రిడ్జిలకు నిధులు

- మంజూరుకు సీఎం అంగీకారం
- నిజామాబాద్ జిల్లా అభివృద్ధి పనులపై సీఎంతో భేటీ
- మాదానగర్ రైల్వే బ్రిడ్జి, ఆర్సపల్లి ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు నిధులపై చర్చ

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టుల పురోగతిపై చర్చించి సమీక్షించారు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలోని మాదానగర్ రైల్వే బ్రిడ్జి, ఆర్సపల్లి ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు అవసరమైన నిధుల కేటాయింపు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని నేతలు వివరించారు. నేతల విజ్ఞప్తులపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాదానగర్ రైల్వే బ్రిడ్జి, ఆర్సపల్లి ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు నిధుల మంజూరుకు అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ రెండు బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే నిజామాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, ఆయా ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.




# 3 రోజులకు సరిపడా వస్తువులను ఉంచుకోండి

**యూకే ఎమర్జెన్సీ అలర్ట్..!**

- ఆహారం, నగదు దాచుకోవాలని ప్రజలకు ఆదేశం
- బ్రిటన్‌లో మూడేళ్లపాటు బీ రెడీ ప్రచారానికి శ్రీకారం
- తుపాన్లు, కార్చిచ్చులు, సైబర్ దాడుల ముప్పుతో ముందస్తు చర్యలు

**లండన్, వెలుతురు అక్టోబర్ 24:**

ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, అడవుల్లో కార్చిచ్చులు, విద్యుత్ సరఫరా అంతరాయాలు, సైబర్ దాడుల వంటి అనుకోని సంక్షోభాలను ఎదుర్కొనేందుకు బ్రిటన్ ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో సాధారణ సేవలు నిలిచిపోయినా కనీసం 72 గంటలపాటు తమ అవసరాలను తామే తీర్చుకునేలా ఇళ్లలో నిత్యావసర వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. ఇందులో భాగంగా ‘బీ రెడీ’ పేరుతో మూడేళ్లపాటు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు అక్టోబర్ 22న ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.

### సేవలకు అంతరాయం కలిగితే..

గత శీతాకాలంలో వచ్చిన తుపాన్లు, ఈ వేసవిలో సంభవించిన కార్చిచ్చులు తీవ్ర వాతావరణ పరిస్థితులు ప్రజల దైనందిన జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో స్పష్టం చేశాయని బ్రిటన్ ప్రభుత్వం పేర్కొంది. విద్యుత్, తాగునీరు, ఫోన్ సేవలు, అంతర్జాలం వంటి కీలక సదుపాయాలు నిలిచిపోతే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. మరోవైపు సైబర్ దాడులు పెరిగితే బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, ఇతర కీలక సేవలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇలాంటి సమయాల్లో అత్యవసర సిబ్బంది సహాయం అందే వరకు ప్రజలు తమ కుటుంబాల అవసరాలను తామే చూసుకునేలా సిద్ధంగా ఉండాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

### ఇంట్లో ఏయే వస్తువులు ఉంచుకోవాలంటే..

కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా కనీసం మూడు రోజులపాటు సరిపడా సీసాల్లోని తాగునీరు, ఎక్కువ రోజులు నిల్వ ఉండే ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి వ్యక్తికి రోజుకు కనీసం మూడు లీటర్ల తాగునీరు అవసరమని పేర్కొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఉపయోగపడేలా టార్చ్‌లైట్, అదనపు బ్యాటరీలు, వెచ్చని దుస్తులు, దుప్పట్లు, బ్యాటరీతో పనిచేసే లేదా చేతితో తిప్పి నడిపే రేడియో, మొబైల్ ఫోన్ల కోసం ఛార్జింగ్ పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపింది.

అలాగే ఏటీఎంలు, డిజిటల్ చెల్లింపుల సేవలు పనిచేయని పరిస్థితుల్లో అవసరాల కోసం కొంత నగదును నోట్ల రూపంలో, చిల్లరతో సహా అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. ప్రథమ చికిత్స సామగ్రి, క్రమం తప్పకుండా వాడే మందులు, ముఖ్యమైన పత్రాల ప్రతులు, అత్యవసర ఫోన్ నంబర్లు కూడా సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొంది. చిన్నపిల్లలు, వృద్ధులు, పెంపుడు జంతువులు ఉన్న కుటుంబాలు వారికి అవసరమైన ప్రత్యేక వస్తువులను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించింది.

### యుద్ధ భయాలే కారణమా..?

ఈ కార్యక్రమం వెనుక యుద్ధం ఒక్కటే కారణం కాదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, వరదలు, అగ్నిప్రమాదాలు, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో ఆటంకాలు, సైబర్ దాడుల వల్ల సాధారణ సేవలు నిలిచిపోయే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ సూచనలు చేసింది. అయితే సైబర్ ముప్పులు, శత్రు దేశాల నుంచి వచ్చే ప్రమాదాలు, కీలక సేవలపై దాడుల అవకాశాలపై బ్రిటన్ భద్రతా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రజలు భయాందోళనలకు గురై పెద్దఎత్తున సరుకులు నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, క్రమంగా కొద్దికొద్దిగా అవసరమైన వస్తువులను సమకూర్చుకుంటే సరిపోతుందని ప్రభుత్వం తెలిపింది. ప్రజలు తమకు సాధ్యమైన మేరకు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటే అత్యవసర సేవలపై ఒత్తిడి తగ్గుతుందని, అత్యంత అవసరమైన వారికి సహాయం అందించేందుకు సిబ్బందికి వీలవుతుందని పేర్కొంది. ఇలాంటి మూడు రోజుల ముందస్తు సన్నద్ధత సూచనలను ఫ్రాన్స్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ వంటి యూరప్ దేశాలు కూడా అమలు చేస్తున్నాయి.

**ఆదిలాబాద్ గిరిజనుల**

# కుల ధ్రువీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం

- 1950 నాటికి ఉన్న నిబంధనల ఆధారంగా పరిశీలన
- అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి
- మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వారి క్లెయిమ్‌లపై అప్రమత్తంగా ఉండాలి
- నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 24:**

ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులకు చట్టబద్ధంగా, సమగ్రంగా పరిష్కారం చూపాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ అంశం అత్యంత సున్నితమైనదని, అర్హులైన గిరిజనులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడటంతోపాటు, అనర్హులు కుల ధ్రువీకరణ పత్రాలు పొందకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆదిలాబాద్ జిల్లాలో కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన సమస్యలపై మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గారి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లాలోని ఏయే గ్రామాలు, మండలాల్లో సమస్య తీవ్రంగా ఉందో గుర్తించి, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి సూచించారు.

### నిబంధనలకు లోబడే నిర్ణయాలు

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, రాష్ట్రంలో అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా 1950కి ముందు ఉన్న ఆధారాలు, అప్పటి చట్టపరమైన పరిస్థితులు, అందుబాటులో ఉన్న పాత రికార్డులు, ఓటరు జాబితాలు తదితర ఆధారాలను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న వారికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### వలస వచ్చిన వారి విషయంలో అప్రమత్తత

మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వ్యక్తులు స్థానిక గిరిజనులుగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు చేసే క్లెయిమ్‌లను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. నిజమైన స్థానిక గిరిజనులకు నష్టం కలగకుండా చూడటంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ ధ్రువీకరణ పత్రాలు పొందకుండా రెవెన్యూ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అదే సమయంలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునే నిజమైన గిరిజనులను రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే భావన కలగకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి చట్టపరమైన హక్కు లభించేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

### క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన

సమస్య ఉన్న గ్రామాలు, మండలాల వారీగా వివరాలను సేకరించి, పాత రెవెన్యూ రికార్డులు, ఓటరు జాబితాలు, కుటుంబ వివరాలు, స్థానిక నివాసానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఒకే విధమైన నిబంధనలను అన్ని ప్రాంతాల్లో అమలు చేస్తూ, అర్హత నిర్ధారణకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు.

### నవంబర్ రెండో వారంలో మరోసారి సమావేశం

ఈ సమస్యపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. అప్పటిలోగా అధికారులు గ్రామాలు, మండలాల వారీగా సమస్యల వివరాలను సేకరించి, అర్హత కలిగిన దరఖాస్తుదారుల పరిస్థితి, పెండింగ్ దరఖాస్తులు, ఎదురవుతున్న న్యాయపరమైన అంశాలు తదితర వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.

అన్ని వర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఎవరికీ అన్యాయం జరగకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి అన్నారు.

### చట్టపరంగా పరిష్కరిస్తా

“ఈ సమస్యను పరిష్కరించడం మంత్రిగా నా బాధ్యత. అర్హులైన గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చట్టపరమైన అన్ని అవకాశాలను పరిశీలిస్తాం. అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ ప్రయోజనం పొందకుండా చూస్తున్నాం” అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. అర్హులైన గిరిజనులకు ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో అనవసర జాప్యం లేకుండా చూడాలని, సందేహాస్పద కేసులను నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్హర్ మహేష్‌దత్ ఏక్కా, ప్రత్యేక కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, టీసీఆర్‌అండ్‌టీఐ డైరెక్టర్ డాక్టర్ వి.సముజ్వల, ఐటీడీఏ ఉట్నూర్ ఏపీవో వసంతరావు, టీసీఆర్ అండ్ టీఐ అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఏ.లీల, మూడు మండలాల తహసీల్దార్లు, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, ఆదిలాబాద్ మాజీ ఎంపీ వేణుగోపాల చారి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, శ్యాంనాయక్, నరేష్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై ఘోర ప్రమాదం..

- లారీని ఢీకొన్న కారు.. ఇద్దరు యువకులు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

**హుజురాబాద్, వెలుతురు అక్టోబరు 24:**

విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం ముగించుకుని ఆనందంగా స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన యువకులను రోడ్డు ప్రమాదం కబళించింది. జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పుణ్యక్షేత్రం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన ఈ విషాద ఘటన రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ఈ ప్రమాదం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రంగాపూర్ శివారులోని 563వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.



పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకుని ఎర్టిగా కారులో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో హుజురాబాద్ మండలం రంగాపూర్ శివారుకు చేరుకోగానే ముందు వెళ్తున్న లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం లారీ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న యువకులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు.

ఈ ఘటనలో రామగుండం ప్రాంతానికి చెందిన బట్టారి అరవింద్ (20), మచ్చ సాయి (20) తీవ్ర గాయాలతో కారులోనే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న ఎరుకల సాయి కృష్ణ, మచ్చ ఆదర్శ్, ముఖియా, వివేక్, శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షణాల్లో జరిగిన ప్రమాదంతో జాతీయ రహదారిపై విషాదకర పరిస్థితి నెలకొంది.

ప్రమాద సమాచారం అందుకున్న హుజురాబాద్ రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్ పోలీసు సిబ్బందితో కలిసి వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా దెబ్బతినడంతో అందులో చిక్కుకున్న మృతదేహాలు, క్షతగాత్రులను బయటకు తీసేందుకు పోలీసులు, సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి వారిని బయటకు తీశారు.

క్షతగాత్రులను తొలుత హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వారిలో మరో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# బొగ్గు లారీ డ్రైవర్లు, క్లీనర్లకు లాభాల వాటా చెల్లించాలి

### ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ డిమాండ్

**ఆసిఫాబాద్, వెలుతురు అక్టోబరు 24:** కైరుగూడ ఓపెన్ కాస్ట్ నుంచి గోలేటి సీహెచ్ పీకి బొగ్గు రవాణా చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల్లో వాటా రూ. 5,500 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఏరియా (గోలేటి) డీజీఎం పర్సనల్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో డీజీఎంను కలిసిన ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ, బొగ్గు రవాణా చేస్తూ సింగరేణి సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి లాభాలు రావడంలో లారీ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

అర్హులైన డ్రైవర్లు, క్లీనర్లందరికీ లాభాల వాటా చెల్లించాలని, చెల్లించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.




# ప్రశ్నిస్తే శత్రువులా..?

## పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం పరస్పర ఆధారితాలు

### మహిళా జర్నలిస్టుల హక్కులను, స్వేచ్ఛను కాపాడాలి

### మహిళా జర్నలిస్టులపై దాడులు.. ప్రజాస్వామ్యానికి ముప్పు

### ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు ప్రారంభ సభలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:**

"మన గణతంత్రం, మన పత్రికా రంగం రెండూ కలిసే ఎదుగుతాయి.. లేదా కలిసే పతనమవుతాయి" అన్న ప్రముఖ పాత్రికేయుడు జోసెఫ్ పులిట్జర్ మాటలు స్వేచ్ఛాయుత మీడియా, ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం మధ్య ఉన్న విడదీయలేని సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా విషయంలో అధికారాన్ని ప్రశ్నించే మహిళా జర్నలిస్టులను శత్రువులుగా చూడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రశ్నలను అణచివేయడంలో కాకుండా, వాటికి సమాధానం చెప్పే ధైర్యంలోనే ప్రజాస్వామ్య బలం ఉంటుందని స్పష్టం చేశారు.

శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు (నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఉమెన్ జర్నలిస్ట్స్)ను మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళా జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతలను భయం లేకుండా నిర్వర్తించగలగాలని, నిజాలను వెలుగులోకి తీసుకురావడం, అధికారాన్ని ప్రశ్నించడం వారి వృత్తి పరమైన హక్కులని అన్నారు. జర్నలిస్టుల చేతిలోని మైక్రోఫోన్‌ను శత్రుత్వానికి చిహ్నంగా చూడకూడదని, అసౌకర్యం కలిగించే ప్రశ్నలు అడిగినంత మాత్రాన వారిని ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిగణించకూడదని పేర్కొన్నారు.

కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై దాడులు, లైంగిక వేధింపులు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సీతక్క అన్నారు. ఈ ఘటనలకు సంబంధించి మహిళా జర్నలిస్టులపై కేసులు నమోదైనట్లు వచ్చిన నివేదికలను కూడా నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వృత్తిపరమైన విధులు నిర్వహించే మహిళలు బెదిరింపులు, ప్రతీకార చర్యలకు ఎందుకు భయపడాల్సి వస్తోందన్న ప్రశ్నకు సమాజం సమాధానం వెతకాలని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ అధికారంలో ఉన్న సందర్భాల్లో మహిళల స్వేచ్ఛ, భద్రతపై దాడులు పెరుగుతున్నాయని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను పురుషుల ఆధీనంలో ఉంచాలనే పితృ స్వామ్య భావజాలాన్ని అధిగమించాలని, మనుస్మృతి లోని మహిళల స్వతంత్రతను పరిమితం చేసే భావనలకు బదులుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ సూత్రాలే సమాజానికి మార్గదర్శకాలని స్పష్టం చేశారు.

**ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం**

మహిళలు ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడటం లేదని, రాజ్యాంగం కల్పించిన హక్కులను మాత్రమే కోరుతున్నారని సీతక్క అన్నారు. గ్రామాల్లో పనిచేసే మహిళ నుంచి ఉద్యమాల్లో పాల్గొనే మహిళ వరకు, వీధుల్లో వార్తలు సేకరించే మహిళా జర్నలిస్టు వరకు ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం దక్కాలని పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించడం ఒక్కటే ప్రజాస్వామ్యానికి కొలమానం కాదని, అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే స్వేచ్ఛ, జవాబుదారీతనం, ప్రజలకు వాస్తవాలను అందించే స్వతంత్ర మీడియా కూడా ప్రజాస్వామ్యానికి కీలకమని అన్నారు. మహాత్మా గాంధీ జర్నలిజంలో సత్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారని గుర్తుచేసిన మంత్రి, వాస్తవాలను వెలికితీసి ప్రజల ముందుంచడమే జర్నలిజం ప్రధాన బాధ్యతగా ఉండాలని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా ప్రజాస్వామ్యం బలంగా మనుగడ సాగించలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను కేవలం ఆదాయం సంపాదించే స్థాయిలోనే కాకుండా ఆస్తులు కలిగినవారిగా, వ్యాపార సంస్థల యజమానులుగా, నాయకత్వ బాధ్యతలు నిర్వహించే వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

**భద్రత, స్వేచ్ఛకు భరోసా కల్పించాలి**

మహిళ సాధికారత అంటే ఆర్థికంగా సంపాదించడం మాత్రమే కాదని, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకునే సామర్థ్యం, తన అభిప్రాయాన్ని నిర్భయంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ కూడా ఉండాలని అన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం, విద్య, రాజకీయ భాగస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ పరస్పరం అనుసంధానమై ఉన్నాయని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టుల భద్రత, గౌరవం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సీతక్క సూచించారు. వృత్తిపరమైన అనుబంధాలు, సిద్ధాంతపరమైన భేదాలు ఎలా ఉన్నా మహిళల గౌరవానికి, భద్రతకు ముప్పు ఎదురైనప్పుడు మహిళా జర్నలిస్టులంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏ మహిళా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి, ప్రశ్నించడానికి భయపడాల్సిన పరిస్థితులు లేని సమాజాన్ని నిర్మించడమే మనందరి లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రాధా రాణి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ అయిషా కనుమ్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, జర్నలిస్టు ఉద్యమ నేతలు దేవులపల్లి అమర్, విరాహత్ అలీ, సోమసుందర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.





# ఆత్మకూరు పట్టణంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

### ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం :మంత్రి వాకిటి శ్రీహరి



**ఆత్మకూరు, వెలుతురు అక్టోబర్ 24:**

ఆత్మకూరు పట్టణంలో 28 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఆత్మకూరు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అత్యవసర వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గి, స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్మాణాన్ని నిర్ణీత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



**ఆత్మకూరు, వెలుతురు అక్టోబర్ 24:** పేదల సొంతింటి కలను సాకారం చేయ డమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు మండలంలో 35 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత నిస్తోందని తెలిపారు.

# టీజీహెచ్ఆర్సీ సుమోటోగా "సరకా" ఘటన

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి నివేదికకు ఆదేశం
- నవంబర్ 26లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:**

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతంలోని సరకా లేబొరేటరీస్ లిమిటెడ్‌లో క్లోరోఫామ్ ఆవిరి లీకేజీ ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. అక్టోబర్ 22 రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించి నవంబర్ 26లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఈ కేసును స్వీకరించింది. తెలుగు, ఆంగ్ల పత్రికలతో పాటు ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో వచ్చిన వార్తలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. గ్యాస్ లీకేజీ కారణంగా మరికొందరు కార్మికులు అస్వస్థతకు గురికావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించినట్లు వార్తా కథనాల్లో పేర్కొన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తనిఖీల అనంతరం పరిశ్రమను మూసివేయాలని ఆదేశించినట్లు సమాచారం.

పారిశ్రామిక భద్రత, భారత రాజ్యాంగంలోని 21వ అధికరణం కల్పించిన జీవించే హక్కు పరిరక్షణకు ఈ ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కమిషన్ అభిప్రాయపడింది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, మృతులు, గాయపడిన కార్మికుల వివరాలు, బాధితులకు అందించిన వైద్య సహాయం, పరిశ్రమలో అమలవుతున్న భద్రతా చర్యలు, సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

## ఎల్‌నినోపై రాజకీయాలు కాదు..

# ప్రజలకు అండగా నిలవాలి

- నీటి సంరక్షణే కీలకం.. తాగునీటికి ప్రాధాన్యమివ్వాలి
- భూగర్భ జలాలు లేని చోట్ల వ్యవసాయ మోటార్లు ఆన్ చేయొద్దు
- విద్యుత్ డిమాండ్ 25 శాతం పెరిగినా నిరంతర సరఫరాకు చర్యలు
- గ్రామీణ ఉపాధి కోసం 17 లక్షలకు పైగా పనుల గుర్తింపు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**మధిర, వెలుతురు అక్టోబర్ 24 :**

ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాకుండా ప్రజలకు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్షాలకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం కొదుమూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.



**విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు**

రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు చేరిందని, గత ఏడాది అక్టోబర్‌తో పోలిస్తే రోజువారీ వినియోగం 245.35 మిలియన్ యూనిట్ల నుంచి 335.05 మిలియన్ యూనిట్లకు పెరిగిందని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతోందన్నారు.

**తాగునీటి సంరక్షణకు ప్రాధాన్యం**

రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లలో సుమారు 15 లక్షల పంపుసెట్ల పరిధిలో భూగర్భ జలాల కొరత ఉందని భట్టి తెలిపారు. నీరు లేని బోర్ల వద్ద మోటార్లు ఆన్ చేయవద్దని రైతులకు సూచించారు. 470.22 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి ప్రస్తుతం 178.60 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, 44,034 చెరువుల్లో దాదాపు 40శాతం చెరువుల్లో పావు వంతు కంటే తక్కువ నీరు ఉందని వివరించారు. తాగునీటికి ప్రాధాన్యమిస్తూ మనుషులు, పశువులు, వన్యప్రాణుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నీటిని కాపాడుకోవాలన్నారు.

**17 లక్షలకు పైగా ఉపాధి పనుల గుర్తింపు**

ఎల్‌నినోతో వ్యవసాయ పనులు తగ్గితే గ్రామీణ కూలీలు, రైతులకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద 9.1 లక్షల పనులను గుర్తించామని, అదనంగా మరో ఎనిమిది లక్షల పనులను గుర్తిస్తున్నామని తెలిపారు. నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, బోర్ల పునరుద్ధరణ, పశువుల షెడ్లు, గ్రామీణ రహదారుల నిర్మాణం వంటి పనులు చేపడతామన్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వానికి సహకరించాలని, ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

# గచ్చిబౌలిలో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్...

- డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు మార్గనిర్దేశం
- రుక్మాపూర్ లో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలు
- టీజీఎల్ఐపీసీ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24:**

రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఔత్సాహిక ఎస్సీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ లో సుమారు వేయి మందికి ఉపాధి కల్పించేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (టీజీఎల్ఐపీసీ) ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధికి, ఆర్టిజన్లను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎస్సీ యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్ప మన్నారు. అంతర్జాతీయ హంగులతో గచ్చిబౌలిలో హబ్ అండ్ స్పోక్ విధానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న సీఎఫ్‌సీ ద్వారా రాష్ట్రంలోని ఆర్టిజన్ల ఉత్పత్తులకు అదనపు విలువ (వాల్యూ యాడెడ్)ను జోడిస్తామన్నారు. డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వంటి వారికి మార్గనిర్దేశం చేస్తామన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, ఆర్మూర్‌లో మైక్రో స్మాల్ ఎంటర్ ప్రైజెస్ క్లస్టర్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈసీడీపీ) కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, టీజీఎల్ఐపీసీ వీసీ అండ్ ఎండీ ప్రశాంత్ కుమార్, తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంట్ డా.ఆరేపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ హోంగార్డులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి

### హోంగార్డుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విజ్ఞప్తి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 24 :**



రాష్ట్రంలో రిటైర్డ్, మరణించిన హోంగార్డుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, వారి దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అరకొర వేతనాలతో శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన హోంగార్డులకు పదవీ విరమణ అనంతరం పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర ప్రయోజనాలు అందకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం దాదాపు 10 వేల హోంగార్డు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 61 ఏళ్లు, అంగన్‌వాడీ సిబ్బందికి 65 ఏళ్ల పదవీ విరమణ వయస్సు అమలవుతున్న నేపథ్యంలో హోంగార్డులను 60 ఏళ్లకే విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన హోంగార్డులను ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, మార్కెట్ యార్డులు, వసతి గృహాల్లో కాపలాదారులుగా, భద్రతా సిబ్బందిగా, వార్డెన్లుగా నియమించి ఉపాధి కల్పించాలని కోరారు. ఎలాంటి సేవా ప్రయోజనాలు లేని హోంగార్డులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పదవీ విరమణ ప్రయోజనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

**'ఒక్క రోజు వేతనం' పథకాన్ని పునరుద్ధరించాలి**

గత 13 ఏళ్లుగా హోంగార్డులు తమ వేతనంలో ఒక రోజు మొత్తాన్ని విరాళంగా అందిస్తూ, మరణించిన లేదా పదవీ విరమణ చేసిన సహచరుల కుటుంబాలకు రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయం అందించే 'ఒక్క రోజు వేతనం' సంక్షేమ పథకాన్ని పోలీసుశాఖ నిలిపివేయడంతో వందలాది కుటుంబాలు నష్టపోతున్నాయని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ఈ పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. జీవో నంబర్ 14, తేదీ 31.12.2018 ప్రకారం ప్రతి హోంగార్డుకు అందాల్సిన రూ.7,500 యూనిఫాం అలవెన్సు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలను విధుల్లో ఉన్నవారితో పాటు పదవీ విరమణ చేసిన, మరణించిన హోంగార్డుల కుటుంబాలకు కూడా అందించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో హోంగార్డుల సంక్షేమ పథకాలు కొనసాగుతున్న తరహాలో తెలంగాణలోనూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, వృద్ధాప్య పింఛన్లు, మరణించిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హోంశాఖ బాధ్యతలు కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్నందున ఆయన తక్షణమే జోక్యం చేసుకుని సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలని కోరారు. హోంగార్డుల న్యాయమైన సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరించాలని జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు.

# కృష్ణా నదిలో విషాదం..!

### పడవ మునిగి ఇద్దరు యువకులు మృతి..!

**తాడేపల్లి, వెలుతురు అక్టోబర్ 24:** గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని పాతూరులో విషాద ఘటన చోటుచేసుకుంది. కృష్ణా నదిలో పడవ మునగడంతో గల్లంతైన ఇద్దరు యువకులు హరీష్, అర్జున్ మృతదేహాలు లభ్యమయ్యాయి.

ఐదుగురు యువకులు సరదాగా పడవపై షికారుకు వెళ్లగా.. నది మధ్యలో పడవ ఒక్కసారిగా ఒకవైపు మునిగిపోయింది. దీంతో ముగ్గురు యువకులు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈత రాకపోవడంతో హరీష్, అర్జున్ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com